
మన గురుదేవుడు

బ్రహ్మంగారి సంక్షిప్త చరిత్ర



రచయిత

శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు

ప్రకాశకులు:

బ్రహ్మంగారి మఠం: కందిమల్లయపలె.

Ci

మనగురుదేవుడు

బ్రహ్మంగారి సంక్షిప్త చరిత్ర

"అనఘిగతే వేదాన్తే కలిమలకలుషే జనే సదా చరతి
వీరబ్రవ్మాభిధయా సమజని లోకే హి కాంకరం తేజ:"
— శ్రీ పుట్టపర్తి.

రచయిత
శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు

★

ప్రకాశకులు
బ్రహ్మంగారి మఠం : కందిమల్లయపల్లె.

ప్రతులకు:

బ్రహ్మంగారి మఠం,

కందిమల్లాయపల్లె. P. O.

కడప Dt.

చేయిప్రతులు

ప్రతి 2 రూపాయలు

శుభకృత్తు, మహాశివరాత్రి.

1963

REHBOARDS

అభినందనము

"మన గురుదేవుఁడు" (శ్రీ వీరబ్రహ్మేంద్రుని చరిత్రము) అను గ్రంథమును చదివితిని. వీరిని ఆంధ్రలోకము బ్రహ్మంగారని వాడుదురు. కంకరుల తరువాత ఆంధ్రదేశపు పల్లెపల్లెయందున అద్వైతబోధ చేసికొని పోయినవారలలో గురుపదాధిష్ఠితులు వేమన్న శివరామదీక్షితులు బ్రహ్మంగారు వారిశిష్యులు సిద్ధప్ప ఈశ్వరమ్మ మొదలగువారు. వీరి కాలములోనే కర్ణాటక దేశములో సర్వజ్ఞుఁడు మొదలయినవారు చెప్పుకోఁదగినవారు.

బ్రహ్మంగారిభాష వీరి అందఱిలో కొంచెము వింత గొలుపు రూపకాతిశయోక్తులతో నిండియుండును. వీనిని తిన్నగా తెలిసికొనుటకు చాలఁగృషి కావలెను. తెలివిగలవారే బ్రహ్మంగారలయు వేమన్నగారియు తత్త్వములను అటకెలఁదులను పనికిరాని వాజ్మయముగా పరిహరించువారున్నారు. అట్టి అపప్రథ పోఁగొట్టుటకు సంప్రదాయ మెఱిఁగిన వ్యాఖ్యాతలు సమర్థులు. అట్టి పనికి పునాదిగా శ్రీ వీరరాఘవాచార్యులు గారు మునిముందు ఈ చరిత్రమును వ్రాసి లోకులకు బ్రహ్మంగారి పరిచయము కలిగించిరి. ఇందులకు వీరిని నే నభినందించుచున్నాను.

చిరవాడ
12-11-62

వేలూరి శివరామశాస్త్రి

ప్రస్తావన

ఆధునిక మహర్షిమాలకు తొలిపూస అనదగిన బ్రహ్మంగారి జీవన వృత్తమును సమీక్షా రూపమున "మనగురుదేవుడు" గా శ్రీ వీరరాఘవాచార్యులుగారు మనకు అందించిరి. ఇది-ఇతఃపూర్వము వెల్వడిన వివిధ జీవితచరిత్రలవలెగాక, తజ్జీవిత సందేశమును, లీలల వివరణ లను సవిమర్శముగా తెలుపు-గ్రంథమైయున్నది. "మేరీజీ బనీ మేరీబాణీ" అని మహాత్మాజీ అన్నటుల, వీరగురు జీవన చర్యలే, సందేశమై లోకసంగ్రహలీలలై తెనుగునాటికి క్రొత్తచైతన్యమును అంటు గ్రొక్కినవి. ఆత్మ, శిల్ప సాహితీ దర్శనాది రచనల ద్వారానేమి, బహుముఖ ప్రజ్ఞావ్యంజకములగు ఉత్తమవ్యాస పరంపరలద్వారానేమి, నైక విషయిక వేదికలపై గాంగధారా సదృశోపన్యాస ముల వల్లనేమి ఈ కృతికర్త ఆంధ్రుల నుతినీరాజనములు గొన్న మహామనీషియే. ఇట్టివారు వీరగురుని జీవన రహస్యములలోనికి, తమ తత్త్వ పరిణతమైన నిశితదృష్టిని సారించి, తత్తత్ నిగూఢ విశేషములను వారికి సహజ మైన ఉదాత్త వ్యాఖ్యలతో మనకు నిరూపించిరి.

ఆధ్యాత్మిక తేజమును చిమ్మిన పెక్కురు ప్రవక్త లున్నను కర్మ, జ్ఞాన, యోగ, రీతులను మేళవించి, మతాంతర వ్యాప్తమగు సందేశము నీయజాలినవారు మిగుల కొలదిగా ఉన్నారనుట రూఢి.

"శం నో అస్తు ద్విపదే శం చతుష్పదే"అని విశ్వ విశాల సూత్రముల వల్లెవేయుచు, వ్యాఖ్యాన వాగ్ఝరుల శ్రోతల ముంచుచు, శిష్యుల పూజాసుమ వర్షముల తాన మాడు వ్యామోహమునను జగద్గురుపీఠాధికార దంభమును నను జిక్కినవారును పెక్కురుండవచ్చును. కాని ఎందరి జీవితములలో, తమ చేతలే నోళ్ళు విప్పుకొని ధర్మశంఖా రావ మొనర్చినవి? ఎంతమంది గిరి కందర తపస్సుల శుష్కకాయులైరి? ఎందరు పాదయాత్రల జ్ఞానప్రచారము చేసిరి? ఎందరు తేటతెనుగున తమ అనుభూతులనే గానము చేసిరి? ఎందరు కాయకష్టము సల్పి తనువును కర్మ యోగాగ్నిలో తపష్టంక తీత మొనర్చుకొనిరి? ఎందరు విశ్వప్రేమలో కుల మతావధులను విలంఘించి, సమస్త జనతను తమ కూర్మి కౌగిళుల లోనికి గైకొనిరి? ఎందరు తత్ఫలితముగ అశేషజనముచే గాంధీజీ "బాపూ,, అనబడినట్లు "జేజి నాన్న,, గా ప్రేమింపబడిరి? అంశావ తారములు కొన్ని; పూర్ణావతారములు కొన్ని. కాగా, శ్రీ వీరగురుడు గాంధీవలె ఒక పూర్ణావతారమని నా ప్రగాఢ విశ్వాసము. ఇది శ్రీ వీర రాఘవాచార్యుల వారు నిరూపించిచూపిన బ్రహ్మమూర్తి.

"ఆయనఎల్ల పీఠాధిపతులవలె తానును అధికార ముద్రనుఏల చేదాల్చి ఊరేగజూడడు?" అని భావగర్భ ముగ 53 వ పుటలో ప్రశ్నించిరి. ఇట్లు త్యాగమయముతో ఆరంభమై దేశాటనలో, తపశ్చర్యలో- గోపాలనలో-

స్త్రీ, శూద్ర, విచక్షణారహిత మంత్రాద్యుపదేశ విధాన ములో – ప్రౌఢ వివాహావరణములో – గార్హస్థ్యపావిత్ర్య నిరూపణలో – గ్రామీణశిల్పవృత్తి నిర్వహణములో– విగ్రహారాధన ప్రాథమికావశ్యకతా సూచనలో –హిందూ మహమ్మదీయాది మతసామరస్య సాధనలో–పుష్పగిర్యాది పీఠసంస్కరణలో – త్రిమూర్త్యంశ విలసనములో – మహా వాక్యముల తేట తెనుంగున పాడునేరుపులో–అడుగు అడుగున – వీరగురుని జీవనము ఆధునిక యుగమునకు సందేశ శంఖమును మొరయించి నట్లయినది.

సర్వోపనిషత్ సారమగు గీతను మహాత్ముడు పితికి అనాసక్తి యోగమును ప్రాసినటుల, సర్వావతారసారమగు వీరగురుని చరిత్రమును శ్రీ రాఘవాచార్యులవారు పితికి "మనగురుదేవుడు" గా అందించిరి. ఈ విధముగా వీర గురుని చరిత్రక్షీరమును చిలికి, నవనీతఖండమును తీసి ఇచ్చిన శ్రీ ఆచార్యులవారికి, ఆంధ్ర ముముక్షులోకము ఋణపడినదని నేను భావింతును. తేటతేట తెనుంగున, ఈ క్రొత్తవెలుంగును ప్రసారముచేసి, బహుముఖ భ్రాజ మానమగు ఈ వీరమణియొక్క భాగధగ్యమును మనకు ఈ దర్శనాచార్యులవారు దర్శనీయమొనర్చిరి.

అల్లదే బ్రహ్మక్షేత్రమున బహుశతాబ్దములక్రింద పాదుకొన్న విశ్వగురు పారిజాతము. ఇయ్యదే శ్రీరాఘవ సమీరము సంతరించిన నవసౌరభరాశి. ఇక మనము అవ్వారిగా ఆఘ్రాణింతముగాక.

పులివర్తి శరభాచార్యులు

మఠంవారివాట

మా మఠంపట్టాన సంక్షిప్తమైన బ్రహ్మంగారి చరిత్రను ఆంధ్రలోకానికి సమర్పిస్తున్నందుకు సంతోషిస్తున్నాము. ఇదివరకు "శ్రీ వీరబ్రహ్మ సుప్రభాతము"ను శ్రీ వీర రాఘవాచార్యులుగారిచేతనే వ్రాయించి లోకానికి అందించినాము. శ్రీ వీర రాఘవాచార్యులు గారు ఇలాంటి రచనలు చేయడానికి తగిన అధికారంకలవారు. వీరు శిల్ప వేదాంత సాహిత్యశాస్త్రాలలో మంచికృషిచేసినారు. విశేషించి తత్త్వాన్ని అనుభూతికి తెచ్చుకోవడానికి నిష్కళంక నిరాడంబర సాధనచేసే సాధకులు వీరు. ఆచార్యులుగారు శాస్త్రీయమైన యే విషయాన్నయినా ఉపనిషద్దర్శనాదులలోని నిదర్శనాలతోను, సిద్ధపురుషుల అనుభవాలతోను సమన్వయించినచ్చోటట్లు చెప్పేనేర్పుగలవారు. ఇలాంటి వీరిచేతిలో బ్రహ్మంగారి చరిత్రరచన పడడం గొప్పఅదృష్టంగా భావిస్తున్నాము. ఈ చిన్ని పుస్తకంలో బ్రహ్మంగారి జీవితతత్త్వాన్ని, మానవలోకానికాయన యిచ్చిన సందేశాలను అతిసంగ్రహంగాను, సత్సమ్మతంగాను, గంభీరంగాను వివరించడానికి ఆచార్యులవారు ప్రయత్నంచేసినారని దీన్నిచదివిన ప్రతిపాఠకుడూ సులభంగా తెలుసుకోగలడు. వీరిచేతనే బ్రహ్మంగారి సమగ్రచరిత్ర గూడ వ్రాయించి ప్రకటించవలెనని మతాధ్యక్షులగు శ్రీ శ్రీ శ్రీ శ్రీనివాసస్వాములవారి సంకల్పం. అందుకు తగిన ప్రయత్నాలుగూడ జరుగుతూ వున్నవి.

ఈ పుస్తకాన్ని ముద్రించడానికి ఎంద రెందరో భక్తులు మేమంచే మేమని ముందుకువచ్చినారు. అయినా అందరికీ అవకాశం ఇవ్వలేక పోయినాము. బ్రహ్మంగారి వేదాంత సంప్రదాయానికిచెందిన శ్రీ కావలి అడవిమూర్తి గారు నెల్లూరుమండలంలో గొప్పతత్వవేత్తలూ గురువులూను. "అమితసతీకూర్తి కావలి అడవిమూర్తి" అనే మకుటంతో వీరిపేర ఎన్నోపద్యాలూ పాటలూ ప్రచారంలోవున్నవి. వీరిశిష్యపరంపరకు చెందినవారు శ్రీ పచ్చిపాల ఆదెపరెడ్డిగారు. వారిసోదరి సాధ్వీమణిటూరిఆదెమ్మగారు అన్నగారి స్మృతిచిహ్నంగా 290 రూపాయలూ, నాన్ రెడ్డిపేట, వాస్తవ్యులు శ్రీ పదిరి ఆదెయ్యగారి స్మృతిచిహ్నంగా కుమార్తె శ్రీమతి పడాల సీతమ్మ వెంకటసుబ్బయ్య దంపతులు 260 రూపాయలూ ఈ గ్రంథ ముద్రణకు సమర్పించినారు. ఈభక్త వర్యులకుశ్రీ జేజినాయన భక్తి జ్ఞాన వైరాగ్యాలనూ, ఆయురారోగ్యభాగ్యాలనూ ప్రసాదించి రక్షించాలని ప్రార్థిస్తున్నాము. బ్రహ్మంగారి సారస్వతాన్ని క్రమంగా ప్రకటించడానికి పూనుకొన్న మాకు లోకం ఇతోధిక ప్రోత్సాహం ఇవ్వగలదని ఆశిస్తున్నాము.

కందిమల్లయ్యపల్లె
15-2-63

ఇట్లు
బండికట్లకోటీశ్వరశాస్త్రి

వ్యవహర్త
బ్రహ్మంగారిమఠం.



శ్రీ విరాట్పోతులూరి

వీర బ్రహ్మేంద్ర స్వామి

X

ఓం

మన గురుదేవుఁడు

అవతారములు

దయామయుఁడగు పరమేశ్వరుని సృష్టిలీలలు అనంతములే కాదు, అద్భుతములును, అమేయ మహిమాభిశోభితములునై పరగుచున్నవి. అల్పజ్ఞుఁడును ఇంద్రియారామునుఁడును నగు మానవుఁడు సర్వజ్ఞుఁడును అతీంద్రియుఁడును నగు నీశ్వరుని సృష్టిరహస్యములను దెలిసికొనయత్నించుటయు, కుంఠితశక్తియగు నతఁడు సర్వశక్తియగు జగదీశుని జన్మకర్మములను దెలుసుకొనఁ బూనుటయు, శరీరాంతర్వర్తియయి పరిమితశక్తిగల జీవుఁడు సర్వాంతర్యామియగు సర్వేశ్వరుని మహిమల ననగాహన చేసికొనఁ దివురుటయు హాస్యాస్పదమేకాదు, సాహసమునైయున్నదని తత్త్వజ్ఞుల యభిప్రాయము. ఆ సృష్టికర్త యే దేశమున నే విధముగా నవతరించి యే విధమగు లౌకికాలౌకిక ధర్మములను సంస్థాపించుచుండునో, ఏకాల

మున నే విధమగు సత్యధర్మమును స్థాపించుటకు ఱజుఁ డయ్యు నిజప్రకృతి నధిష్ఠించి దివ్యములగు జన్మకర్మము లను ధరించునో తెలియుటకు మనుష్యునకున్న జ్ఞానము చాలదు. ఉత్కృష్టమగు మానవప్రజ్ఞను సంయమాగ్ని తప్తము చేసి, దివ్యప్రజ్ఞగా దీపింపఁజేసికొన్న కొందఱు తపస్వులకుమాత్ర మా జగదీశుని మహిమాసముద్రమును గొంతవఱకేని ఈదుటకు సాధ్యమగునేమోకాని, యంతటి కగు పనిమాత్రము కా దది. ఈ విషయములు విశ్వ సృష్ట విచిత్రమగు సృష్టి విధానము నించుక దూరదృష్టితో గమనించిన స్పష్టముకాఁగలదు. జగన్నాథుఁడు స్థలచర ములను, జలచరములను, వ్యోమచరములను, ఉభయ చరములను సృష్టించి అనూహ్యమగు తన సృష్టి శిల్ప చాతుర్యము నెట్లు ప్రకటించియున్నదియు భావించిన, ఆతనికి దుష్కరమగునది లేదని మానవుఁ డెఱింగి, సర్వే శ్వరుని సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వముల కొక్కఁ జోహారు పెట్టుఁ గలఁడు. నానా ప్రాణికోటుల సృష్టి స్థితి లయములయం దెట్లు ఈశ్వరుని కళాచాతుర్యము వ్యక్తమగుచున్నదో,

అంతకు వేయి రెట్లెక్కువగా జ్ఞాన విశిష్టమగు మానవ సంఘమునను అదియూహింపనలవి కానిదై యొప్పుచున్నది.

"అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్
ప్రకృతిం స్వా మధిష్ఠాయ సంభవా మ్యాత్మ మాయయా.
జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వ తః
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మా మేతి సోఽర్జున."

— భగవద్గీత.

"నేను పుట్టుక లేనివాఁడనయ్యు, అవ్యయాత్ముఁడ నయ్యు, సర్వభూతములకు నీశ్వరుఁడనయ్యు నా యోగమాయచే ప్రకృతి నధిష్ఠించి పుట్టుచున్నాను." ఈ పలుకుల యర్థము నించుక భావించిన ఈశ్వరుఁడెట్లు అవతారమును గైకొను నదియు తెలియును. పరమేశ్వరుఁడు పుట్టువును గైకొనకున్నను ఆతని జన్మ కర్మములు ప్రాకృతజీవుల జన్మ కర్మములవంటివి కావనియు, అవి దివ్యములు, అనగా అలౌకికము లనియు "జన్మ కర్మ చ మే దివ్య" మను మాటచే భగవానుఁడే నుడువుచున్నాఁడు. స్వల్పమగు మర్త్యశక్తి దివ్యమగు భగవచ్ఛక్తి నర్థము చేసికొనవలె ననను, అందు ప్రవేశింపవలె ననను అది తన

మర్త్యధర్మమును దాఁటి అమృతమగు దివ్యధర్మమును పొందవలయును. మానవుఁడు ప్రాకృతధర్మ బద్ధుఁడై యున్నంతవఱకు పరమేశుని దివ్యత్వముకాని, దివ్య మహిమలుకాని యాతని కర్షములు కావు. అందుకే భగవానుఁడు స్వయముగా "నా దివ్యములగు జన్మకర్మముల రహస్యము నెఱింగినవాఁడు శరీరమును విడిచియు మఱల పుట్టక శాశ్వతమగు మత్పదమునే పొందును" అని ఘంటాఘోషముగాఁ బల్కినాఁడు.

"ఈశ్వరుని జన్మకర్మములు దివ్యములే యగును గాక; సర్వశక్తియగు నాతఁ డేల సామాన్య జీవులవలె జన్మించి కర్మ లొనర్పనలయును"? అను ప్రశ్నము రావచ్చును. ఈశ్వరుఁడు సామాన్యులవలె జన్మకర్మము లను గ్రహించుటలేదు. క్లేశకర్మ విపాకాశయముల చేతఁ బొదువఁబడని సర్వస్వతంత్రుఁడు పుట్టుచున్నాఁడన్న కర్మ బద్ధుఁడయి కాదు. లోకకల్యాణము కోసము; ప్రజాసంతరణముకొఱకు. ఆ యా దేశములయం దా యా కాలముల యందు ఖిలమైలుప్తమైన యవసరధర్మమును సంస్థాపించుట కొఱకు. ఈ విషయము నీశ్వరుఁడు తానై వచించినాఁడు—

"యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదా2త్మానం సృజా మ్యహం.
పరిత్రాణాయ సాధూనాం వినాశాయు చ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే."

"ధర్మమునకు హాని సంభవించినప్పుడు, అధర్మ మభివృద్ధి యయినప్పుడు, సాధు సంరక్షణముకోసమై దుష్టశక్తులను నాశ మొందించి, సనాతనమగు ధర్మమును సంస్థాపించు నిమిత్తము ఆత్మమాయచే నే నవతారమును స్వీకరింతు" నని చెప్పియుండుటచే నీశ్వరుఁడు స్వశక్తిచేఁ బుట్టి అలౌకికములగు దివ్యలీలలచే మానవసంఘమును ్రైవస మొనర్చుకొని, జనులు ఇహలోకమున భద్రజీవనము చేసి కొనుచుఁ దన్ను బొందు మార్గములనుసూచించియు, ధర్మ పద్ధతులను ్రపవచించియుఁ బోవుచుండు ననియు తెలియు చున్నది. ఈ యంశములను ్రపత్యవతారపురుషునియందును మనము కాంచఁగల్గుదుము. ఏ మహనీయుఁడు మానవా తీతములగు శక్తులనుగూడ పిడికిటఁ బట్టి, అత్యద్భుతములగు నీశ్వరమహిమలను ్రబదర్శించి విశాల భూ్రజ నుద్ధరింప

ధర్మోపదేశములను జేసి యలరారునో; ఎవ్వాని సందేశములు, ఏర్పఱచిన మార్గములు చిరకాలము లోకమునకు భద్రసంధాయకములై నెగడునో అట్టివానిని అవతార పురుషుఁడని లెక్కించుకొనుట కభ్యంతరములేదు. దశావతారములే యని కాని, వింశతియే యనికాని వీనికి హద్దు లేదు. సృష్ట్యాదినుండి నేటివఱ కెన్ని యవతారములు వచ్చినవో, ఏ యే మార్గముల ధర్మసంస్థాపనము జరిగినదో చరిత్ర సంపూర్ణముగా చెప్పఁజాలదు. ఇంక నెన్నెన్ని యవతారములు రానున్నవోకూడ ఎవ్వ రెఱుంగుదురు! ఈశ్వరాంశము ఎక్కడ స్ఫుటప్రతీత మైనను అది అత్యద్భుతమై పరగఁగలదని భగవానుఁడే తన గీతయందలి విభూతియోగమున:—

"యద్య ద్విభూతిమ త్సత్వం శ్రీమదూర్జిత మేవ వా
తత్త దేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశ సంభవమ్."

"ఎయ్యది యైశ్వర్యశోభితమై శ్రీమంతమైక్రాలునో అదియెల్ల తన తేజోంశముచే నయినదని యెఱుంగు" మని యుపదేశించి నాఁడు కదా! అట్టితటి సాక్షా ద్భగవత్కళను ద్దేశించి చెప్పవలసిన దేమి!

ఈశ్వరుని యిచ్ఛాశక్తి అడ్డమాఁకలు లేనిది. సర్వతఃప్రసారముగల యీ శక్తిని మానవుఁ డెటొంగి కొనుటకే సమర్థుఁడు కాఁడన్నప్పుడు దాని గమనవిధానమును గూర్చి "అది యట్లేల జరిగినది? ఇట్లు జరుగ కుండుటకుఁ గారణమేమి?" అని ప్రశ్నించుటకు జనుల కర్హత లేదు. భక్తి భరితమైన చిత్తముతో నెవ్వఁడు తన జ్ఞానశక్తి కొలఁది ఈశ్వర విలాసము నర్థము చేసికొనఁ జూచునో, అట్టివానికి మాత్రమది భగవదనుగ్రహము కారణముగా నవగతమగు చుండును. ఈయంశమునే యుపనిషత్తు :—

"యమే వైష వృణుతే తేన లభ్యః
తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వాం."

అనుచున్నది. మాయాశబలితమైన పారమేశ్వర తత్త్వమును గ్రహింపవలెనన్న, తొలుదొల్త మాయావరణమును దాఁటవలయును గనుక, అట్టిదానిని దాఁటుటకు భగవదేక శరణుఁ డగుటతక్క మానవునకు గత్యంతరము లేదని "మా మేవ యే ప్రపద్యన్తే మాయా మేతాం తరన్తి తే" అను గీతావాక్యము నుడువుచున్నది. కావున

అవతార తత్త్వమును తత్త్వజ్ఞులగు మహనీయు లెటింగి యుపదేశించిన వడువున మన మర్థము చేసి కొ ను ట యుక్తము. సర్వశక్తియగు భగవానుఁడు స్వయముగా నవతరింపక సంకల్పమాత్రముచే నధర్మము నణఁచి ధర్మ పూరణము చేయఁగల్గినను, స్వీయమాయచే నవతరించి యట్లొనర్చుట లీల. ఆ లీలచేత సాధులు సంస్కృతులయి తమ ఈశ్వరవిశ్వాసమును దృఢపఱచుకొని ముక్తిని చూఱగొనుటకును, దుష్టులు తమ దుష్కర్మల ఫలమును అనివార్యముగా ననుభవించిలోకమునకు నీతిపాఠము నేర్పు టకును వీలగుచున్నది. సత్యసంకల్పము ఏవానిహృదయము నండేని కలిగినగాని, దానిచే ధర్మప్రచారము సాఁగదు. అట్టి సత్య సంకల్పములు సామాన్య మానవుల హృదయ ములం దంకురించినయెడల జనులు వానిపై విశ్వాసముపూని వానినాచరించుటకు పూనుకొనరు. ఒక మహోన్నతాభి ప్రాయమును వెలువరించు వ్యక్తియు మహాత్ముఁడై యున్ననేకాని, వాని యాశయములను లోకము మన్నింపఁ జాలదనుట మన కనుభవసిద్ధము. అవతారపురుషుఁడు అతీత

వ్యక్త సమస్త శక్తులను గైవస మొనర్చుకొని లోకోత్త రుఁడై ప్రకాశించును గావున, వాని యాశయముల ప్రభా వము ప్రజాహృదయములపై ప్రభుత్వము నెఱపఁ జాలును. ఈ విధములగు కారణములచేత భగవానుఁడు సైతము సంకల్ప మాత్రముచే లోకసంగ్రహము చేయక, తన జన్మ కర్మములచేతనే చేయుచున్నాఁడు. అవాప్త సర్వకాముఁ డయ్యు, తా నేకారణమున కర్మలొనగ్చు చున్నదియు భగవానుఁడే గీతలలో కర్మ యోగాధ్యాయమున 22, 23, 24, శ్లోకములలో స్పష్ట మొనర్చియున్నాడు :—

"న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి.
యది హ్యహం న వర్తేయం జాతుకర్మణ్యతంద్రితః
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః.
ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహం
సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః."

ప్రకృతిబద్ధులు ఆసక్తితో కర్మముల నొనరింతురు. అవతారపురుషులు అనాసక్తులై లోకసంగ్రహార్థము చేయుదురు.

శ్రీ కృ ష్ణు డు

ప్రత్యవతారమును ఏకాలమున, ఏ దేశమున, ఏ విధ
మగు ధర్మమును పూరింపవలయునో, దానిని పూ ర్తిచేయు
టకే వచ్చుచుండును. ఈ యంశమును గీతోపదేష్ట యని
ప్రసిద్ధి వడసిన కృష్ణుని కాలమునుండియు మనము సుస్పష్ట
ముగ నెఱుంగుదుము. కృష్ణ చరిత్రమును గమనించిన అవ
తార పురుషుఁ డొనర్చు కార్యవిధానములు, దుష్ట నిగ్రహ
శిష్ట పరిపాలనములు, ధర్మ సంస్థాపనము, సత్యప్రబోధము
తెలియఁ బడఁగలవు. సృష్ట్యాదిమకాలమున భగవానుఁడు
వివస్వంతునకు ఉపదేశించిన యోగము నష్టమై పోఁగా,
మఱల దాని నుద్ధరించి యర్జునున కుపదేశించినాఁ డనుట
గీతలో మనము కనుచున్నారము. ఉపనిషత్తులనెడి పాల
వెల్లిని మథించి యెత్తిన సిద్ధాంతామృతమే కదా గీతా
సారము. వేదాంతములలో గుప్తముగ నున్నదానిని సర్వ
జన సులభము చేయుట గీతా ప్రవక్తహృదయము. గీతోక్త
ధర్మము ఉపనిషత్ప్రతిపాద్యమే యగుటచేత క్రొత్తది
కాదు. పాలలో లీనమైయున్న నేతినివలె కృష్ణపరమాత్మ

దానిని మథించి బయట పెట్టినాఁడు. ఏయవతార పురుషుఁ
డైనను క్రొత్త ధర్మమును ఉపదేశింప నక్కఱ లేదు.
వేదోదధియందు మునిఁగియున్న యొక్కొక్క ధర్మ
ఖండమునెత్తి యేకాలమున దేని ననుసరించి ప్రవర్తించిన
మానవసంఘము అభ్యుదయ నిఃశ్రేయసముల నందఁగలదో,
అట్టి ధర్మఖండమును లోకమున కెత్తి చూపి, యద్దాని
మహిమను చాటి పోవుటకే యవతార పురుషులు, మహా
త్ములు ప్రవర్తించు చుందురు. కృష్ణుఁడు ఉపనిషద్ధేనువు
నకు గీతామృతదోగ్ధయై పరగినాఁడు. కొంతకాలము వెలి
బెట్టబడినట్లు భావింపఁబడిన స్త్రీ వైశ్య శూద్రాదులకును
(స్త్రియో వైశ్యాస్తథా శూద్రా స్తేఽపి యాన్తి పరాం
గతిమ్) అంతఃకరణముయొక్క సత్వశక్తిని బట్టి జ్ఞానార్హా
తను, మోక్షయోగ్యతను జూపి మానవసంతరణము సలిపి
నాఁడు. కృష్ణావతారమున నొనర్చిన ఘనకార్యము లింకె
న్నియో చెప్పవలసిన వున్నవికాని, వాని కిది తావు గాదు.
కృష్ణజీవిత మంతయు అలౌకిక దివ్యలీలామయ మని
గ్రహింపవలయును. ఈ యంశము ప్రజ్ఞా చక్షువుతో
తిలకించినఁగాని సత్య మని తోఁపదు.

బు ద్ధుఁ డు

కరుణానిరతుఁడగు బుద్ధదేవుని యవతారముగూడ ఆ కాలమున భారతీయ ప్రజానీకమునఁ బొదుకొనియున్న ప్రాణిహింసక దురాచారమును దూరీకరించి, శాశ్వత శాంతిసుధావృష్టిని గురియుటకే యేతెంచిన దని మనము గమనింపఁగలము. "బౌద్ధసిద్ధాంతము వైదికమతభంజకము కాదా" యని మీరు ప్రశ్నింపవచ్చును. వైదికముగాని, అవైదికముగాని లోకకల్యాణమునకు తదవతారాగమనము జరిగినదని వైదికసంప్రదాయమును ఒప్పుకొన్నది. ఇందుకు దశావతారములలో బుద్ధుని లెక్కించుటయే ప్రబల ప్రమాణము. ఇఁక బుద్ధుఁడు ఆత్మవాదియా ? అనాత్మవాదియా ? అను సంశయములను గూడ నే నిక్కడ చర్చింపఁ బూనుకొనను. కాని వైదికమతము పేరిట జరుగు దురాచారములను దూరమొనర్చి మానవ జీవితమును కల్యాణ కరమగు శాంతిమార్గమునఁ బయనింపఁ జేయుటకును, ఆచరణ రంగమున విశుద్ధ లౌకిక ధర్మమును ప్రకాశింపఁజేయుటకొఅకును ఆ మనీహాయమూర్తి యవతరించి నాఁడను

వఱకు మనకు ప్రస్తుతము. ఈ యంశమును బుద్ధుని ప్రతి పక్షులును ఒప్పుకొందురు. బుద్ధమత ధర్మసారము తదనం తరముద్భవించిన కొందఱు బౌద్ధాచార్యులచే సరిగా నర్థము చేసికొనఁబడక వికృత మొనర్పఁబడి కలుషీకృత మైనది. కనుకనే శంకరుల కాలమునాఁటి కా వికృత బౌద్ధధర్మము ఖండితమయి, బుద్ధుఁడు నిరాత్మనాది యని తేలియుండ వచ్చును. బుద్ధమతాంశములను, తత్ఖండన మండనములను "ఇది యిట్లు"ని తెల్పుట ప్రకృతము కాదు. కాఁబట్టి స్థూలముగా ఆ యవతారముయొక్క యక్కఱ లోకమున కేల కలిగెనో విచారింతము.

బుద్ధోదయమునకు పూర్వము హింసాత్మకములగు యజ్ఞములు భూయిష్ఠముగా ప్రచారములో నున్నవి. మాన వుల కీలోకమున ననుభవించు పార్థివభోగములకన్న, స్వర్గాది పరలోకములయం దనుభవించు దివ్యభోగములు ఉత్కృష్ట ములను నాశ అధికముగానుండి, వానిని బొందుటకు సాధన ములయిన యజములు నాచరించుటయందే వారు రకులయి పోయిరి. ఏ యే పారలౌకిక భోగములకే యే జంతువులను బలిపెట్టునలయునో, ఎట్టి యాగ విధానములచే ఏ యే ఇహ

మ్రత ఫలములు సిద్ధించునో, ఆయారీతులనెల్ల వేదముపదే శించుచున్నది. నిరంతర వేదాభ్యాసజడులగు ఛాందసులకు తత్ఫలాశ తక్క, వేదాంతముజోలి గాని, దాని ఫలమగు నిశ్రేయసము విషయముగాని పట్టవయ్యెను. ఇంకను "కుర్వ న్నేవేహ కర్మాణి జిజీవిషేత్ శతం సమాఃా" "అపామ సోమ మమృతా భవేమ" మానవుడు కర్మలను జేయు చునే బ్రతికినంత కాలమును గడుపవలయును. సోమపాన ముచేసి యమృతులము (దేవతలము) కావలయును. అను వేదవచనములయందు ప్రామాణ్యబుద్ధి గల కర్మఠులకు జ్ఞానముగాని, భగవంతుడు, బ్రహ్మపదార్థము అను విష యములుగాని మనసున కెక్కవయ్యెను. వేయేల, ఆనాటి వారికి పరలోకమం దాశయే కాని, ఆత్మదృష్టి, ఆత్మసాక్షా త్కారవాంఛ, జ్ఞానపూర్ణము శూన్యమని చెప్పవచ్చును. ఆ భావమునే దృఢపఱచుటకు మీమాంసక మతము పశు బంధన, అగ్నిహోత్రాది కర్మకాండమునకు పట్టాభిషేకము గట్టి నిత్యనైమిత్తిక కామ్యకర్మములే మానవున కవశ్యా నుష్ఠేయములని, ఆత్మజ్ఞాన శూన్యమై ప్రవర్తిల్లినది. ఇట్టి

తరుణమున మానవుని బుద్ధి కర్మబంధురమై పోయి, శరీర భోగములకు, వానిని బొందు సాధనముల ననుష్ఠించుటకు ఎంతగా నుద్రేకించునో చెప్ప నక్కఱ లేదు. పండితుల ఈ వైదిక హింసలేగాక, పామరుల మూఢ విశ్వాసములచే చెలరేగిన గంగానమ్మ, పోలేరమ్మ జాతరలలో జరుగు ఘోర హింసలును ఇనుమడించి యున్నవి. నోరులేని పశ్వాది జంతువులు వేలకొలది యజ్ఞ కుండముల కాహుతి యగు చున్నవి. పూర్వాచారమను మిషచే అజ్ఞానుల చేతులలోని కఱకుకత్తులకు పెక్కు సాధుమృగములు గుఱి యగు చున్నవి. ఇంకను అప్పుడప్పుడే తొఱుమూఱగు చున్న వర్ణవ్యవస్థ పూర్వకాలపు నిర్వచనమునకు దూర మగుచున్నది. గుణములను నడవడినిబట్టి యేర్పడవలసిన బ్రాహ్మణాది వర్ణవిభాగము గుణకర్మల ప్రాధాన్యమునకు స్థాన మీయక కేవలము "వారసత్వపు హక్కు"గా భుక్త మగు చున్నది. ఆ యా కులముల యందలి వారసులు తమకుఁ గావలసిన యర్హతలు లేక పోయినను, నామ మాత్రపు యోగ్యతల చేతను, కంటి కగపడు వెలుపలి

వేషము చేతను తామే యగ్రవర్ణులమని జనసామాన్యము మీఁదఁ దమ యధికార దండమును బ్రయోగించుట స్వేచ్ఛగా జరుగుచున్నది. ఈ విధమగు కారణములచే బుద్ధునికి పూర్వమున్న మానవ సమాజము కుళ్ళఁబొఅ సంసిద్ధమయి, లోకమునకు వెగటు గొల్పుచుండెను. ఇట్టి సమయమునసే విశ్వశాంతిదూతయగు బుద్ధదేవుని యవ తరణము జరిగినది.

హింసాబహుళమగు నీ జగములో సిద్ధార్థునికి శాంతిగాని, సౌఖ్యముగాని పొడకట్టలేదు. "మమాత్మా సర్వ భూతాత్మా" అని తనయందు నఖిల భూతములందు నొకభంగి సమహితత్వముతో ప్రవర్తింపవలసిన మానవాళి కీ భోగలాలసత, స్వర్గసుఖవాంఛ, వానికొఅకై నెఱపు హింసాత్మక ధర్మము నింద్యములని తోఁచినవి. ఈ చీఁకటి పరుగు లేల యన్నాఁడు. జీవహింస స్థానమున సర్వజీవ సమపేక్షితమగు జీవకారుణ్య బీజమును నాటి, ప్రేమ ఫల ములఁ బండింపఁజేసి, దయామృత ధారల వర్షించినాఁడు. బాహ్యజీవితమునకు వలసిన శాంతి భద్రతలను బొందు

మార్గములను సూచించుటేకాక, నిత్యనిర్వాణము నందు నట్టి లోపలి బాటనుగూడ నేర్పఱచి బుద్ధదేవుడు కల్యాణకరుడై యొప్పినాడు. "న హింస్యాత్ సర్వాణి భూతాని" అన్న సూత్రమును ప్రచారమొనర్చిన ఆయన యవతారము సార్థకమై ఆ కాలపు మానవ సంఘమునకు తారక మైనది. సమాజములోని క్రుళ్ళు రూపుమాసినది. శాంతి భద్రతలతో నిండిన వ్యవస్థ యేర్పడినది. లోకము కన్నులు తెఱచి పరోపకారమును, జీవకారుణ్యమును, ఆత్మజ్ఞానమును ఆదరించినది. మూఢవిశ్వాస ప్రేరితములగు కర్మలకు స్వస్తిచెప్పినది. ఆ కాలమునకే గాక, నేటికిని బుద్ధ బోధసుధ లోకమునకు అమృతత్వ ప్రదాయిని. కాని సనాతనమగు బౌద్ధధర్మము పరిక్షీణమై వికృతమగు బౌద్ధ విజ్ఞానముమాత్రము కొంతకుఁ గొంత నేఁడు నిలిచి యుండుట ధార్మికహృదయములకు విషాదము.

ఏ మతముగాని, ఏ మతాచార్యుల సిద్ధాంతములు గాని వికృతములు కాక చిరకాలము ప్రచారభూమిక యందు నిలిచి పనిచేయఁ జాలవు. అనుష్ఠానపరులగు

మహాత్ములు ఆచార్యస్థానములం దుండి, సిద్ధాంత సూత్ర ములు నాచరించుచు లోకమునకు బోధించుచున్నంతవఱకే వాని మహిమ ప్రకాశించుచుండును. ఆ యా మతసంప్ర దాయజ్ఞులు ఆచరణహీను లైనను, భోగలాలసు లైనను సిద్ధాంతములు తమ ప్రభావము నెట్లు చూపఁగలవు! ఈ సూత్రము బౌద్ధమతమునకు సంపూర్ణముగాఁ బట్టినది. బుద్ధుని యనంతరము చిరకాలమునకు బౌద్ధాచార్యులలో అభిప్రాయభేదములు, ఆచారహీనతలు ప్రబలుచున్న కొలఁది దానిపై వైదికుల దండయాత్ర లెక్కు వైనవి. వేదార్థవేత్తలగు భాట్ట, ప్రభాకర, కుమారిలాది మీమాం సక మూర్ధన్యులు బయలుదేరి బౌద్ధమును పరాభవించి వైదికమగు కర్మకాండమునకే ప్రాధాన్యమును సంపాదిం చిరి. నిత్య నైమిత్తిక కామ్య కర్మలవలననే జీవునకు మోక్షము కలుగునను వింత సిద్ధాంతమును కర్మవాదులు బయలుదేరదీసి, జ్ఞానమునకుఁగాని సన్న్యాసమునకుఁగాని ప్రాధాన్యము నీయక మఱల లోకమును కర్మబహుళమే యొనర్చిరి.

ఈ సందర్భమున నొక యంశము గమనింప దగి నదై యున్నది. జ్ఞానోత్పత్తికి సాధనమగు కర్మకలాపము (జ్ఞాన ముత్పద్యతే పుంసాం క్షయా త్పాపస్య కర్మణః) సర్వప్రధానమై శారీరక భోగములను మాత్రము సంపాదించు సాధనముగా పరిణమించినపుడు, దాని పెడత్రోవ నటికట్టు నిమిత్తమై బుద్ధరూపమున భగవానుడవతరించి దానిని ఖండించి, సురుచిరమగు నాత్మజ్ఞానమార్గమును జాటి పోయినాడు. బుద్ధుని సిద్ధాంతముగూడ సర్వకర్మ రాహిత్యరూపమున బరిణమించి, ఆచరణ రహితమగు వేషమాత్ర సన్న్యాసరూపము నంది, బౌద్ధవిహారములు విలాసమందిరములుగా రూపొందినతఱి మఱల నిత్యనైమిత్తిక కామ్యరూపమగు వైదిక కర్మసిద్ధాంతము సందు చేసి కొని వేరూనినది. అదియే ప్రబలి జ్ఞానహీనమై "కర్మణైవ ముక్తిః" అన్న విపరీతరూపమును గైకొన్నది. తొలుత వికృతమై అతిచేయబడిన యజ్ఞకర్మసిద్ధాంతమును ఖండించి కర్మసన్న్యాసమును ప్రతిపాదించుటకు బుద్ధావతార మవసరమై తన ధర్మమును నిర్వర్తించుకొన్నట్లు, తదుపరి

వికృతమైన బౌద్ధధర్మమును ఖండించుటకు మీమాంసక (వైదిక) మతము పూనుకొని, అదియు విశుద్ధసత్యమునకు దూరమై వికృతినే పొందినది. వికారము నందిన యీ వైదిక కర్మసిద్ధాంతమును ఖండించి, కర్మము ఆత్మజ్ఞానమునకు సాధన మని నిరూపించుటకు ఒక్క మహాపురుషుఁడు కావలసి వచ్చెను. ఆయనయే జగద్గురు బిరుదాంచితుఁడగు శ్రీ శంకరాచార్యుఁడు !

శంకరుఁడు

శంకరోత్పత్తికి పూర్వము మీమాంసకుల కర్మసిద్ధాంతము, బౌద్ధుల శూన్యాది వాదములు, ఆచార రహితమగు వేషమాత్ర సన్న్యాసము ప్రచారములోనున్నవి. వేదాన్తము (ఉపనిషత్తు)లయందలి పారమార్థిక సిద్ధాంతములు బహుళముగా ప్రచారములో లేవు. గౌడపాదాచార్యులు, గోవిందభగవత్పాదులు (శంకరుల గురువు) మున్నగు మహనీయులు ఉపనిషత్తులలోని యద్వైత సిద్ధాంత బీజముల నంకురావస్థకుఁ దెచ్చిరి. కాని అవి మీమాంసకుల త్రొక్కిళ్ళకు రూపఱి సిద్ధముగా

నున్నవి. ఇంకను ఒక ప్రక్క కర్మసన్న్యాసద్వేషమును ప్రబలి యుండెను. బౌద్ధుల సదాచారహీనమగు సన్న్యాసము లోకమునకు వెగటు పుట్టించుట యొకటి, సహజముగా కర్మపాశబద్ధు లగు వేదవాదరతుల కర్మ ప్రవణత రెండవది – ఇవి రెండును గలసి ఆత్మజ్ఞానమును దిగద్రొక్కుచుండెను. ఇట్టితటి బౌద్ధుల శూన్యాదివాద ములను ఖండించుటకును, మీ మాంసకుల "కర్మణైవ ముక్తిః" అను సూత్రమును తెగడ్రెంపి, "జ్ఞానా న్మోక్షః" అను వేదాన్త సత్యసిద్ధాన్తమును సంస్థాపించుటకును, అద్వైతేతర మతములను బూర్వపక్షము మొనర్చి సనాతన వేదాన్త సిద్ధాన్తాంకురములను పాదుకొనఁజేసి ఫలింపఁ జేయుటకును శంకరగురుఁ డవతరించినాఁడు.

శంకరాచార్యుని జీవితఘట్టములో ప్రముఖమైనది విశ్వరూపు (మండనమిశ్రు) నోడించియాతని కర్మపాశములు ఖండించి సన్న్యసి నొనర్చుట. ఇచ్చటనే పూర్వ మీమాంసావాద మోడిపోయినది.

"త మేవం విద్వా నమృత ఇహ భవతి,
నాన్యః పన్థా ఃద్య తేఽ యనాయ."

ఆ పరమాత్మ నెఱింగిననే ముక్తి కలదు. పరంధామమును జేరుట కింకొక త్రోవ లేదు. ఇందు ఎఱుంగుట (జ్ఞానము) మోక్షకారణము. అనఁగా ఆత్మ జ్ఞానము ముక్తి హేతువు. అట్టి జ్ఞానము కల్గుటకు, కర్మగాని భక్తిగాని సాధనములగునేకాని, అయ్యవియే సాక్షాన్మోక్ష కారణములుకావు. కావుననే భక్తికర్మలు రెండును జ్ఞానోత్పత్తికి సాధనములు. ఇంకను సర్వకర్మసన్న్యాస పూర్వక మగు నిర్మల జ్ఞాన నిష్ఠ సాక్షాన్మోక్ష సాధన మని చెప్పుటకు "జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరేణాధి గచ్ఛతి" జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసా త్కురుతేఽర్జున" "బహవో జ్ఞానతపసా పూతా మద్భావ మాగతాః" మున్నగు వాక్యములు ప్రమాణములు. శ్రుతిగాని, ఉపనిషత్తులు గాని ఆత్మనెఱింగి, లేదా భగవానుని దెలిసికొని, బ్రహ్మజ్ఞానమును బడసి మానవుఁడు ముక్తుఁడగునని చున్నవి గాని, "ఆపనిని చేసిన గాని, ఈపనిని చేసిన

గాని మోక్షము చిక్కుటలేద"ని కర్మయోగమునకు సాక్ష్యో న్మోక్షసాధనత నుగ్గడించుట లేదు. జ్ఞానసిద్ధి సందుటకు కర్మము సాధనమగునని చెప్పుటయే వాని హృదయము. కేవల కర్మము ముక్తి నీయదాల దనుటకు భగవతము లోని "కాననివాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తు వుల్ గాననిభంగి కర్మములు గైకొని కొందఱు కర్మ బద్ధులై గానరు విష్ణు"నను సూక్తి యొక్కటి చాలును. ఈ విధమగు ప్రమాణ సహాతవాద ధోరణితో శంకరులు మండనమి శ్రాది మీమాంసకాగ్రగణ్యుల నోడించి బౌద్ధాది శూన్యవాదమూను ఖండించి అద్వైత సిద్ధాంత మును, కర్మసన్న్యాసమును సంస్థాపించి, ప్రస్థానత్రయ భాష్య కర్తలై బహుళాధ్యాత్మిక గ్రంథకర్తలై కృతకృత్యులైరి. ఇట్టి జ్ఞానజ్యోతిచే కర్మతమస్సులు పటాపంచ లైనవి. సదా చారయుక్త సన్న్యాసము సంస్థాపిత మైనది. వేదములోని యజ్ఞప్రణాళికకు జ్ఞానోత్పత్తి పర్యంతము నిష్కామాచర ణము సిద్ధమైనది. దీనికిడోడుగా శంకరులు తనకు పూర్వము నుండియే ధర్మప్రచారము చేయుచున్న సావిత్రీ

గాయత్రీ సరస్వతీ పీఠముల నాదర్శముగా గైకొని, శృంగేరి మున్నగు తావుల పీఠముల నెలకొల్పి, వేదాంత ప్రచార మునకు చక్కని సంప్రదాయముల నేర్పాటు చేసిరి. ఇప్పుడు సురుచిరమగు వైదికధర్మము సుస్థాపితమై మానవ జీవితము సౌఖ్యానంద శాంతుల కిక్కడై తేజరిల్లుటకు వసతు లేర్పడినవి. చూచితిరా ! అవతార పురుషులొనర్చు ఘనకార్యములు.

రామానుజాదులు

ఇంతవఱకు సంగ్రహముగా నిరూపించిన కృష్ణ బుద్ధ శంకరుల యవతారములకుఁ గారణముగా లోకమున నేవిధమగు ధర్మగ్లాని సంభవించినదియు, ఆ యవతారపురుషు లే యే విధమగు ధర్మమును సంస్థాపించినదియు పాఠకులు అవగాహన చేసికొనియే యుందురు. ధర్మగ్లాని సంభవింపనిది ధర్మసంస్థాపనము చేయుపని భగవంతునకుఁ గలుగదు. రోగము లేనప్పుడు వైద్యునితో నక్కఱ యేమి ? వ్యాధి కలిగినపుడు వైద్యుఁడు వచ్చి రోగమును గుదిర్చి వలసిన బలమును జేకూర్చునట్లు, భగవానుఁడును అధర్మము పెచ్చు పెరిగినపుడు తా నవతరించి, యా యధర్మము

నణంచి, వలసిన ధర్మమును సంస్థాపించి పోవుచుండును.
ఆ సంస్థాపింపఁ బడు ధర్మము గూడ ఏకరూపముగా
నుండ వలయునని నిర్బంధము లేదు. జనసామాన్య
మున కెట్టి ధర్మ మవసరమో, ఏ ధర్మము ననుసరించిన
యెడల జనులు భద్రమార్గమున జీవన మొనర్చుచు కృత
కృత్యులు కాగలరో, ఇంకను ఏ రూపమగు ధర్మము నాచ
రించు యోగ్యత ప్రజలకుండునో, అట్టి ధర్మరహస్యము
లను మాత్రము చాటి ప్రజాహృదయముల నా ధర్మముల
కనుకూలముల నొనర్చి యవతారమూర్తులు విరమించు
చుండుదురు. కృష్ణుఁడు చేసిన పనియే బుద్ధుఁడు చేయవలయు
ననిగాని, బుద్ధుఁ డుపదేశించిన ధర్మమే శంకరుఁడు బోధింప
వలయు ననిగాని నియమము లేదు. రోగనిదానము నెఱిం
గిన వైద్యుఁడు దానికిఁ దగిన మందును వాడి రోగ
శాంతిని గూర్చి రోగిత్వ్యమునకు వలసిన పథ్యపానము
లను బెట్టి యాతనికి బలమును జేకూర్చునట్లు, అవతార
పురుషులును దేశకాలములకుఁ దగిన ధర్మము నుపదేశించి
లోకసంగ్రహ మొనగ్చుచుందురు. శిష్యుల యోగ్యతలను

బట్టి గురువులు వారి కా యా మార్గముల ననుసరించి బోధ సలుపునట్లు, అవతారమూర్తులును లోకస్థితి ననుసరించి ధర్మ సంస్థాపనము, ప్రబోధము చేయుచుందురని గ్రహింపవలయును.

శంకరునిచే పునఃప్రతిష్ఠ యొనర్పఁబడిన జ్ఞానము సర్వశ్రేష్ఠమును ఉపనిషత్ప్రతిపాద్యము నైనను, అద్దాని ననుష్ఠించు యోగ్యత కాలక్రమమున మానవులలో సన్న గిల్లినదని చెప్పక తప్పదు. సన్నగిల్లుటేకాక, కించిజ్జ్ఞుఁడగు జీవుఁడే సాక్షాన్నిర్గుణ పరబ్రహ్మమని చెప్పు నద్వైత మార్గమునుగూడ సూక్ష్మవిచారముచేతను, సదనుష్ఠానము చేతను నెఱుంగు శక్తి యెల్లర కుండుట అసంభవమైనది. బ్రహ్మపదార్థము జగము ఏకమే యనుటయు, జీవుఁడు బ్రహ్మమున కంటెను వేఱు కాదనుటయు సామాన్యలోకమునకు నచ్చినవికావు. ఇంకనుశంకరునిజగన్మాయావాదమును సరియయిన రీతిలో నర్థము చేసికొను శక్తిగూడ లోకమునకు లేదయ్యెను. ఇట్టిస్థితిలో జీవుఁ డీశ్వరుని యంశమని చెప్పు విశిష్టాద్వైతమును, జీవేశ్వరులకు నియతభేదమును జెప్పు

ద్వైతమును జనసామాన్యామోదమునకు పాత్రమునై తత్ప్రివర్తకులచే ప్రచారమునకుఁ దేఁబడినవి. ఈ సంస్కారమును జన సామాన్యమునకుఁ గలిగించి భక్తిమార్గమును ప్రచారము లోనికిఁ దెచ్చుటలో రామానుజాచార్యుడును, మధ్వాచార్యుఁడును గీతా భాష్యాదుల వ్రాసి కృషిచేసి యున్నారు. రామానుజుఁడు పరమేశ్వరుని బొందుటకు భక్తి ప్రపత్తులు పరమ సాధనములని నిరూపించి, భక్తియోగముచే ఆధ్యాత్మిక మార్గమును విశాల పఱచి, యెల్లజాతులకు నది తిరుగాడఁ దగిన బాటగా నొనర్చెను.

ఈ సమయము నందైనను శంకరుని యద్వైతము నకు స్థానము లేకపోలేదు. ఉన్నను ఉండవలసినంత లేదు. ప్రతిపక్షుల ఖండనములకు లోనై యది తన రూపును సంకోచ పఱచుకొన్నది. తరువాత భాస్కరాచార్యుఁడును, యాదవ ప్రకాశులును శంకరుని యద్వైత సిద్ధాంతమునే యించుక భేదముతో బోధించి యద్వైత సిద్ధికై కృషి సల్పిరి. విద్యారణ్యస్వామి వేదములకు భాష్యములు

వ్రాసియు, "వేదాన్త పంచదశి" మొదలగు నద్వైతశాస్త్ర గ్రంథములను రచించియు, శాంకర సిద్ధాంతమునకు బలమగు చేయూత నిచ్చియుండిరి. ఎవ రెంత చేసినను, ఆ చేతలప్రభావము కొంతకాలము పని చేసినమాట సత్యమే. మతములో అనుష్ఠాన పరులగు మహాత్ములు విరళమగు చున్నకొలదియు మతసూత్రముల యెడ ప్రజలకు నిరాదరణము కలిగితీరునని మనము మఱువకూడదు. అద్వైత సంప్రదాయమువిూద రామానుజాదులు చేసిన దండయాత్రకుఁదోడు ఆచారహీనులగు వేషమాత్రసన్న్యాసుల వాగాడంబరము, సదనుష్ఠానదూరమైన దుష్ప్రవర్తనము అద్వైతమువిూదను, అద్వైత సన్న్యాసులవిూదను రోఁత పుట్టించినవి. సుప్రతిష్ఠితమగు శంకరమార్గము ఖిలమై భోజనానందస్వాములు భోగానందస్వాములు బయలుదేరి నామమాత్రమున జీవించు పీఠముల కధిపతులై సనాతనజ్ఞాన సూత్రములను జిక్కుపడఁజేసి నిరంకుశపాలనమొనర్చుచుండిరి.

హృదయమునకు పూర్వస్థితి

ఇంకను గుణకర్మ (ప్రవర్తనము) లకు ప్రాధాన్య విూయక జన్మమాత్రముచేఁగల్గు జాతికే గౌరవ విూయ

బడుచుండెను. ఉత్తమజ్ఞానము ననుష్ఠించి మోక్షసంసిద్ధి నందుటకు బ్రాహ్మణుడు తక్క తదితరుడు అర్హుడు కాడను దుర్వాదములు చెలరేగెను. జాతిమాత్రముచే జీవించువారి అర్థరహితములు, ఆచారదూరములు నగు మంత్రములు ప్రాధాన్యమును బడయు చుండెను. పవిత్ర మును సార్థకమునగు వైదికవిద్య కేవలము పొట్టనింపుకొను సాధనమయి, సమాజమునకు మతవిషయిక పుష్టినిగాని, జ్ఞాన సంబంధమగు తుష్టిని గాని చేకూర్పక శుష్కమయి పోయెను. దేవుని పేరితో జరుగు మోసములు, దురా క్రమణలు చెలరేగి యుండెను. శ్రీకృష్ణుడు ప్రతిపా దించిన జ్ఞాన ప్రధానమగు నిష్కామ కర్మయోగము గాని, వేదవాదుల యజ్ఞ కర్మకలాపము గాని, బుద్ధ దేవుని జీవ కారుణ్యము, ఆత్మ భావము, సామాజిక సమతావ్యవస్థగాని, శంకరుని అద్వైతముగాని, రామా నుజుల భక్తిప్రపత్తులు, వర్ణసమైక్యముగాని, విద్యారణ్యుల ఆధ్యాత్మిక దివ్యప్రబోధముగాని యీ కాలపు జనులలో పాదుకొని పనిచేయజాలకపోయినవి. ఇందుకు అనుస్థాన

పరుఁడగు మహాపురుషుఁడు లేకపోవుట యొక కారణము. ఇట్టితటి సనాతనములగు వేద వేదాన్తములయందు జన సామాన్యమునకు గౌరవాదరములు తగ్గుటలో వింతయేమి!

ఇంతయే కాదు. మోక్షము నందవలయునన్న గృహస్థాశ్రమమును వీడి సన్న్యాసము పుచ్చుకొని తీఱవలయుననియు, యథార్థమగు సన్న్యాసజీవనమును నిర్వహించుట కష్టతర మనియు నూహించెడు జనులదృష్టిలో గార్హస్థ్యము ఐహిక భోగములకుమాత్ర మేర్పడినట్లు తలంపఁబడి నీరసముగాఁ జూడఁబడుచుండెను. ఇంత యేల? గృహస్థునికి ముక్తిమార్గము చాలదూరమను తలంపుగూడ పాదుకొని యున్నదనుట సత్యదూరము కాదు.

ఆత్మసాక్షాత్కారమునకు బలవత్తర సాధనమగు అష్టాంగయోగము (రాజయోగము, లేక పాతంజల యోగము) జ్ఞానప్రధానవాదులచే ఉపేక్షింపఁబడి పలుకుల లోనే పరమార్థ మంతయు నిమిడ్చి, చూపఁబడుచుండెను. "జీవసమాధి" అణిమాద్యష్టసిద్ధులమాట యటుంచినను, సామాన్యములును, ముముక్షువుల కత్యవసరములునగు

చుమ నియమ ప్రాణాయామాది సాధనములే సాధకులలో కఅవై పోయెను. జాత్యేమాత్రోపజీవు లగు పండితులు, వేషమాత్రోపజీవు లగు బైరాగులు కష్ట సాధ్యమగు యోగమున కెట్లు స్థానము చూపఁగలరు ? ఈ విధముగా సాధకులలో యోగమార్గము బొత్తిగనే నశించిపోయెను.

ఇంకను లోకయాత్ర సాగుటకు ముఖ్య సాధన ము, ఉపాసకుల ఆధ్యాత్మిక జీవనమునకు సోపానమును అగు పవిత్ర శిల్పముపై నిరాదరణము చూపఁబడినది. శ్రీకృష్ణుని కాలము నుండియు, ద్వారకానగర నిర్మా ణము నుండేమి, మయసభా సృష్టియుండేమి, ఇంకను నానా విధాస్త్ర శస్త్రముల నిర్మాణము నుండేమి, పూజింపఁబడిన శిల్పవిద్య, బౌద్ధయుగములో మిన్న ముట్టిన శిల్పము, యజ్ఞకాలమున యజ్ఞోప కరణములను సిద్ధము చేయుటలో ప్రభుత్వము వడసిన స్థాపత్యము, మతప్రవక్తలయు మత ప్రచారకులయు కాలములందుఁ అనేక దేవ దేవాలయాది నిర్మాణముల యందు లోకమును ముగ్ధపఱచిన శిల్పకళ, పలువురు చక్రవర్తులచేతను రాజులచేతను సామంతుల

చేతను విలాసార్థమే కాక, లోకసంతరణ సాధనముగను మన్ననం బడసిన శిల్పము ఈ కాలమున ఆదరింపఁ బడక పోవుట దేశదౌర్భాగ్యమునకును, దాస్యమునకును గుఱుతు కాదా ? ప్రాచీన శిల్పఋషుల శిల్పసిద్ధాంత రహస్యములు, అవి విశ్వశిల్పియగు భగవానుని జేర్చుట కుపకరించు విధానములు, శిల్పకళా సంప్రదాయములు విస్మరింపఁబడుటయే కాక, పైపెచ్చు తదనుష్ఠాతలగు శిల్పయోగులమీాదను, తజ్జాతిమీాదను హేళనలు నిందలు గూడ ప్రబలినవి.

పవిత్రమగు స్థాపత్య (శిల్ప) వేదము యొక్క మహిమ, శిల్పవాఙ్మయముయొక్క సభ్యత జనుల కగోచరమై యుండెను. రామానుజునకు కుడిభుజముగా నుండి శిల్పనిర్మాణముచేత మతప్రచారమునకు చేయూతనిచ్చిన జక్కనాచార్యుఁడు, "కలియుగవిశ్వకర్మ" యని బిరుదమును బడసినపదోజు, ఆతని గురువగు బమ్మోజు మున్నగు శిల్పాచార్యుల ప్రతిభను లోకమునకు జాటి శిల్ప మహిమ యిట్టిదని నిరూపించుటకు బొజ్జలు నిమురుకొనుచు భోజ

నములు చేయు నాకాలపు శుష్క-పండితుల కెట్లు సాధ్య మగును ? ఇది యంతయు ఆధ్యాత్మికాభ్యుదయమున కడ్డంకి యగుటయే కాక, లౌకికములగు శక్తులనుగూడ కుంఠీభవింపఁజేసి దేశమును నిర్వీర్యమొనర్చె ననుటలో నాశ్చర్యము లేదు. నాటి శిల్పులును నిరుత్సాహులై దేశము నకు వలసిన సాధన సామగ్రిని సిద్ధము చేయుటలో నుపేక్షనే పూనిరి. శిల్పమునకుఁ బాటిల్లిన యీ యవనతి దేశమునకు తీఱని యనర్థమును గలిగించెను.

శైవ వైష్ణవాది మతభేదములు మతద్వేషములు, కులభేదములు కులద్వేషములు, ఒక్కొక్క కులమునకు సేవయే తక్క అంతకు మించిన యుత్తమాధికారము లేదనుట, అది కారణముగా కలహాములు చెలఁగి మానవసమాజములో పరస్పర హింసాది క్రూరకార్యములు మెండగుట, ఇద్దానిచే శాంతి దవ్వయిపోవుట, ఉత్తమ జ్ఞానార్హబుద్ధులగు నిమ్నకులులు తమ సమున్నత సంస్కారములను సఫల మొనర్చుకొనఁబోవ నడ్డగించెడు స్వార్థపరుల కల్పిత స్మృతి సూత్రములు, దేవుని

పేరను, సత్కార్యములపేరను జరిగెడు ఘోరదురాచార
ములు పెచ్చుపెరిగి, హిందూజాతిని, మతమును బీభత్స
మొనర్చుచుండెను.

ఇఁక నాఁటి రాజకీయ పరిస్థితిని దిలకింతమన్న అదియు అధ్వాన్నముగనే యుండెను. కటకమునుండి కన్యాకుమారి వఱకును ఏకచ్ఛత్రముగా నేలిన కృష్ణ రాయ లస్తమించుటయు, తదుపరి రామరాజు పరిపాలన ముతో విజయనగర సామ్రాజ్య మంతమొందుటయు సంభవించెను. మహోన్నతమగు నాంధ్రసామ్రాజ్యము ముక్కముక్కలై యైకమత్యమునకు దూరమై భారతీయ సంస్కృతికి ఆంధ్రసంస్కృతికి తిలోదకము లీయ సిద్ధముగా నుండెను. ఇది యదనుగా నాంధ్రదేశము మహమ్మదీయ ప్రభువుల వాతఁబడెను. వేదవిరుద్ధములగు మతాచారములు గల వారి పరిపాలనములో హిందూజాతిస్థితి యెట్లుండిన దియు, హిందువు లెట్టి కడగండ్లకు గురియైనదియు నే నీ చిన్ని గ్రంథమున వర్ణింపఁ జాలను. మహమ్మదీయుల విషయమున గూడ హిందువులకు సహానము లేకపోయిన

దనుట సత్యదూరముకాదు. తురకలు మ్లేచ్ఛులనియు, మ్లేచ్ఛుల స్నేహము చేయరానిదనియు, హిందువులు గూడ తురుష్కులను నిందించుచుండిరి. ఈ స్థితి నొకకవి మనోహరముగా వర్ణించినాడు.

"హిందూజాతి మసీదు సీడలనె గ
ర్హింపంగ, నాత్మామృత
స్యందం బీనెడు ఘేదధేనువు తురు
ష్కావేశమున్ రేప, ఆ
డెందాలాతని కిన్క నిప్పుకల వే
డిన్ ప్రమ్గియుంగూడ స్వ
చ్ఛంద ప్రేమరసమ్ములో దడిసి పో
జాలెన్ ద్వదాదేశమై."

—శ్రీ శరభాచార్యులుగారి రత్నగర్భ.

హిందూదేశమున క్రొత్తగా తావు చేసికొన్న యిస్లామ మతము పెత్తనములోనున్న యాకాలములో మహమ్మదీయ మతప్రవక్తలు స్వమత పక్షపాతముచేత హిందూమతమును దూలనాడి, హిందూమతములో జన సామాన్యమున వేరూనియున్న "అవకతవక"లను బట్టి

తమ మత మెక్కుడని ప్రచారము చేసికొనుట, అది హిందువులకు సరిపడక పోవుట, ఇరుకక్షులవారును యుద్ధ సన్నద్ధు లగుట తటస్థించి, ఏక కుటుంబముగా నుండవలసిన మానవ సమాజములో హిందూ మహమ్మదీయ భేద ముచే చీలిక లేర్పడి రక్తనదులు ప్రవహించుట మొదలగు భయానక వృత్తములకు దేశము స్థాన మైనది.

ఈ సమయమునసే క్రైస్తవమతముగూడ దేశములో నడుగువెట్టి తన చిత్రసిద్ధాంతములను నిరూపించుచున్నది. హిందువులు మూల మూదిగలను అంటుకొనకయు, వారిని వెలిబెట్టియు పశువులకంటెను హీనముగా జూచుచుండిరి. దీనిని సందుచేసికొని క్రైస్తవ "పాదరులు" అంత్యజుల కొక విధమైన యాదరమును జూపి మత మిచ్చి, హిందూమత మును దుర్బలపఱచుచుండిరి. హిందువుల వీధులలో స్వేచ్ఛగా నడచుటకే నోచుకొనని పంచములకు ఉత్తమ మగు దైవచింతనాధికార మెక్కడనుండును? ఇట్టి యధి కారమును ధనసంపత్తితోగూడ చూపుచున్న క్రైస్తవ మతములో దూఱుటకు వారెంతగా వేగిరపడరు!

ఇట్టి తరుణమున హిందూమతము పూర్తిగా దెబ్బ
తిని తన స్వరూపమునే కోల్పోయెనన్న ఆశ్చర్యమేమి?
హిందువులకు తమ మతముపైఁ బాదనా విశ్వాసము తగ్గు
చున్నది. అన్యమతాధిక్యమునా ఒప్పుకొనలేరు. తమ
జాతియందా అనుష్ఠానపరులగు మతాచార్యులు లేక,
కపటనటనా నటకులు మెండై నమ్మికకు వీలుగాకున్నారు.
ఇట్టివారు అన్యమతవాతాహతిచే కొట్టుకొనుచున్న స్వమత
జ్యోతి నాటిపోనీయక రక్షింపఁగలరా? ఆ జ్యోతియొక్క
వెలుఁగులు వారికిఁ దక్కఁగలవా? సంశయము!

ఇఁక పీఠాధిపతు లందవలా, స్వార్థపరులై భోగలా
లసులై సంప్రదాయములనే మఱచిపోయి, తామే
యుత్తమ సంస్కార ప్రబోధముల నంది యుజ్జీవింపఁ దగిన
వారుగా నుండిరి. ఆత్మోద్ధారకులు కాని వీరు దేశోద్ధార
కులు మతోద్ధారకులు నెట్లు కాగలరు? ఇట్టి పరిస్థితిలో
ఎన్నిశక్తులనో తననుండి ప్రకాశింపఁ జేయఁగల మహా
మహిముఁడు, సర్వమత సమన్వయ మూర్తి, సర్వతంత్ర
స్వతంత్రుఁడు, సర్వజ్ఞుఁడునగు నొక్కమహనీయ మూర్తి

య వ త రిం చు ట అవసర మైనది. ఆత డెంతటి వాడు కాకున్న నింతింతటి క్లిష్టసమస్యల నన్నింటిని బరిష్కరించి లోకమునకు తారకమార్గము చూపగలడు! ఒక్క శైవాంశమున బుట్టినవాడు చాలడు. ఒక్క విష్ణ్వంశ తారము సమర్థముకాదు. ఒక్క బ్రహ్మాంశము ఉపయోగింపదు. త్రిమూర్త్యాత్మకుడు, లేదా, మూర్తిపంచకాత్మకుడు నగు విశ్వకర్మభగవానుడే యవతరించి ధర్మసంస్థాపనము చేయవలయును. అందుకే "మూడు మూర్తుల యంశముల నభిన్నత దాల్చి" లీలతో సర్వయోగీశ్వరచక్రవర్తి (శ్రీ) వీరగురుమూర్తి యవతరించినాడని యొక కవీంద్రుడు పలికినాడు. ఆయన లీలావిశేషములు, అవతారతత్త్వములు, మాహాత్మ్యములు వాచామగోచరములు. తత్త్వజ్ఞులవారు వానిని బహుధా కీర్తించి యున్నారు.

బ్ర హ్మ గు రుఁ డు

"ఆట త్రిమూ ర్త్యంశ లిమిడి ఐక్యము భజించుఁ;
ఆట త్రికాలజ్ఞ ధిషణ లాస్యమ్ము సేయు;
అట హిరణ్మయ రోచిస్సు లలలు వాఁయు;
"ఏక మేవాద్వితీయ" మా యిద్ధ మూ ర్తి!

—శ్రీ శరభాచార్యులు గారి రత్నగర్భ.

అనేకులగు నవతారపురుషులయు, మహాపురుషు లయు జీవితములను మనము చదివియుందుము. అవతార పురుషులలో రామ కృష్ణాద్యవతారములు పుట్టినప్పటి నుండియు అనేకములగు మహామహిమలకును, అలౌకిక సంఘటనలకును ఆకరము లయినప్పు మనకుఁ దెలియు చున్నది. అందును రామావతారము నందుకన్న, కృష్ణావ తారమునందెక్కువగా మహిమలు, లోకాతీత కార్య ములు వర్ణింపఁబడినవి. ఇందుకుఁ గారణము రాముఁడు మాయాసంవృతుఁడై వసిష్ఠాదుల ప్రబోధముచేఁ దెలివి నందినవ్యక్తి యగుటయు, కృష్ణుఁడు పుట్టినప్పటినుండియు అలౌకిక దివ్యస్వభావమును బ్రదర్శించిన గీతోపదేష్ట యగు నుత్తమాచార్యుఁడగుటయు నని చెప్పుచుందుము.

అనఁగా రాముని లో దివ్యత్వ మనుష్యత్వములు కలసి యున్నవనియు, కృష్ణుని లో కేవల దివ్యత్వమే మూర్తీభవించిన దనియును తత్త్వజ్ఞుల వ్యాఖ్యానము. కావునన్ రామచంద్రుఁడు మనుష్యస్వభావమునకు సన్నిహితుఁడగుటవలననే ప్రతిమానవుఁడును రామమూర్తివలె నడచుకొనవలయుననియు, కృష్ణునివలెనడచుకొనక యాతని యుపదేశముల ననుసరింప వలయుననియు "రాముడు చేసినట్లును కృష్ణుఁడు చెప్పినట్లును ప్రవర్తించిన మానవుఁ డిహ పరములు సాధింపఁజాలు"నని చెప్పుచుందురు. రామచంద్రుని వంటి యాదర్శమానవుఁడు దుర్లభుఁడు. ఆతని కుటుంబము వంటి యాదర్శకుటుంబము సుదుర్లభము.

బుద్ధావతారములో కృష్ణునిజీవితమునందలి మహిమలుకాని, అలౌకిక సంఘటనలుగాని, అంతగా నున్నట్లు తోఁచదు. అట్టివి లేకున్న ఆతఁడవతారమూర్తి కాజాలఁడని, తరువాతివారు బుద్ధునిజీవితమునుగూడ మహిమలకుఁ బుట్టినిల్లుగాఁ జేసినట్లు పలుగ్రంథములు చాటుచున్నవి. ఇదియును గొంత సత్యము కావచ్చునుగాని,

బాల్యముసుండియు మహిమలతోడను, అణిమాది సిద్ధుల తోడను నిండినట్టి భక్తులయు, సిద్ధపురుషులయు జీవిత ములు పెక్కులు మనకు పరిచితము లగుటచేత, మహిమలు కేవలము కల్పితములని త్రోసివేయఁజాలకున్నాము. ఈ మహిమలను సిద్ధులనుగూర్చి యోగశాస్త్రములో నిట్లు కన్పట్టుచున్నది.

"జన్మౌషధి మంత్ర తప స్సమాధిజా స్సిద్ధయః"

—పాతంజల యోగసూత్రము.

అణిమాది సిద్ధులు కొందఱికి జన్మముచేతను, కొందఱికి మంత్రములచేతను, తపస్సుచేతను, సమాధి (యోగము) చేతను సిద్ధించునని పై సూత్రము చెప్పుచున్నది. కాని అవతారపురుషులవిషయమునను, పూర్వ జన్మమునందే యోగసిద్ధిని బొందినవారివిషయమునను జన్మముచేతనే యట్టివారి కవి కల్గుచున్నవనుట సత్యము.

సిద్ధులగువారివిషయ మటుంచినను, స్వప్రయత్నము చేతను, చిన్నప్పటినుండి చేసినసాధనముచేతను కృత కృత్యులయి లోకమునకు దివ్యసందేశముల నిచ్చి, తమ

చూపిన మార్గముల జనతను నడపించిన మహోవ్యక్తులను గూడ పలువురను మన మెఱుంగుదుము. ఇట్టి వీరిని మహా పురుషులని వాకొనుట కభ్యంతర ముండదు. వీరి జీవితము లందు అలౌకిక సంఘటనలు, సిద్ధులు, మహిమలు అబ్బు దుగాఁ గన్పట్టుచుండును. పరమేశ్వరుని కృపావిశేషమును బట్టి అనసరము ననుసరించి యవి కలుగుచుండునేమో కాని, బాల్యమునుండియు నవ్వాని యుదయము కన్పట్టదు.

రెండు తెఱంగులుగా నున్న వీరి జీవితరీతులను బట్టి చూచిన మన కథానాయకుని మనుగడ మొదటి తరగతికే చెందుచున్నది. వీరబ్రహ్మేశ్వరస్వామి జీవిత ములో పుట్టుక దగ్గఱనుండి సమాధిపర్యంతమును లోకోత్త రములగు మహిమలను, అలౌకిక దివ్య సంఘటనములను, అతిలోకములగు సిద్ధులను మనము చూడఁగల్గుదుము. ఇందుఁ గొన్ని కల్పితములని యెత్తివేసినను, త్రోసి పుచ్చరాని ప్రమాణములతోడను ఆధారములతోడను గూడియున్న వెన్నియో మహిమలు, అలౌకిక కార్య ములు మనకు గోచరించుచున్నవి. ఆకారణముచేత కృష్ణ

జీవితమునువలె వీరగురుని జీవితమునుగూడ మహిమా
ప్రదర్శన విషయమున నేటి లోకము విశ్వసించుటలో
ముందంజ వేయఁజాలదేమో. భక్తలోకమునకును ఉత్తమ
జిజ్ఞాసువులకును ఇది యాశ్చర్యకరము కాదుగాని, నవ
నాగరికతా వాసితులకు మాత్రము దురవగాహమే.

అట్టివానిలో మొట్టమొదటిది వీరదేశికుఁడు
అయోనిసంభవుఁడనుట. ఇంతవఱకే న్యగ్రోధాని అయోని
సంభవుఁడగుట వినలేదు. ఇది ఊహా కందనిదిగ, నమ్మఁ
జాలనిదిగఁ దోఁచును. మనుష్య సృష్ట్యారంభమున
అయోనిసంభూతి యనునది కుదురునేమో కాని, యిటీ
వల నే యవతారపురుషుని విషయమందును అట్టిది విన
లేదు. సృష్ట్యారంభమున సయితము మనుష్యసృష్టి విష
యమున పరిణామవాదము ననుసరించి చూచినచో,
అయోనిసంభవత్వమునకు తావుండదు. అయినను పలు
వురు పెద్ద లీ మహావ్యక్తి అయోనిసంభవుఁడనుటలో
గాఢమగు విశ్వాసమునే కలిగియున్నారు. కవిశేఖర వడ్డే
పాటి నిరంజనశాస్త్రిగారు "శూన్యోత్పత్తిం దత్త మత్రై

ర్మహాష్టే" అనియు, "తలిదండ్రు లెవ్వరో తెలియకుండ స్వయంభు వైనవాఁ డీ చిన్ని యర్భకుండు" అనియు గానము చేసియున్నారు.

యోనిసంభవుఁ డనుటకును ఆధారములు లేకపో లేదు. సంతానార్థులగు విశ్వబ్రాహ్మణ దంపతులు కాశీ మున్నగు పుణ్యక్షేత్రములను దిరుగుచుండఁ గొంతకాల మున కాగృహిణి గర్భవతియై సరస్వతీ నదీ తీరమున నున్న *అత్రిమహర్షి యాశ్రమ సమీపమునఁ బ్రసవించె ననియు, ప్రసవించిన మఱుక్షణముననే బాలకుని తండ్రి చనిపోవు టచే ఆ పతివ్రతాతిలక మా శిశువును అత్రిమహర్షి కప్ప గించి తానును భర్త ననుగమించె ననియు, నీబాలకుని పాపాగ్ని పీఠాధిపతులగు వీరభోజయాచార్యులవారి కప్ప గించునప్పుఁ డత్రిముని చెప్పును. దీనినిబట్టి చూచిన వీర గురుఁడు అయోనిసంభవుఁడు కాఁడని తేటతెల్ల మగు చున్నది. వీరగురు భక్తపరంపరలోను, వేదాన్త సంప్ర

* ఈ అత్రిముని సప్తఋషులలోనివాఁడు కాఁడు. ఆ పేరుగల మఱియొక మునీంద్రుఁడు.

దాయజ్ఞులలోను పలువురి రెండవ మతమునే యం గీక రించి యున్నారు.

శైవము

గురుదేవుడు శైవమున వీరనారాయణ, వీరప్ప యను ముద్దుపేరులతో సరస్వతీనదీతీరమున నున్న యత్రి మునీంద్రు నాశ్రమంబున ననేక లీలలు ప్రదర్శించెను. అయిదాఱు వత్సరముల ప్రాయము గలవాడయ్యు "అంభోజ గర్భాదు లభ్యసింపగలేని" అనన్యసాధ్యమగు నతీంద్రియ యోగమార్గమువలన పరబ్రహ్మమొక్క సాకార నిరాకారములను సందర్శించి, తనత త్త్వజ్ఞత్వమును జాటెను. అనుపనీతుడగు నా చిఱుపాపయొక్క యద్భు తానుభవములకు సాధకావస్థలోనున్న యత్రి యచ్చెరు పడి యాతని కారణజన్మతను దెలిసికొని, ఆజన్మబ్రహ్మ వేత్తయగు నా కుట్టడు లోకోద్ధరణమునకై జనించిన మహోవ్యక్తి యని గ్రహించును. వీరగురుని యవతారము వేదోద్ధరణము, శిలోద్ధరణము గూడ నొనరింప కలిగినది కావున, ఆ శైశవక్రీడలయందే యాతడు వేదాంతప్రజ్ఞతో

బాటు శిల్పకళా కౌశలమును గూడ లోకోత్తరముగా
బ్రకటించు చుండెడువాడు. ఆతని యాటవస్తువు లన్నియు
స్వశక్తిచేతనే స్వయముగా గల్పింపబడుచుండెడివి. ఇట్టి
పట్టుల మానవరూపమును దాల్చిన ఆది విశ్వకర్మయా
యాతడని మహర్షి యాశ్చర్యమంది తనశిష్యుల కవ్వాని
మహిమలను ఉగ్గడించుచుండెడువాడు.

వీరనారాయణుడ త్రిమున్యాశ్రమమున శైశవలీల
లను జూపుచున్న సమయమునందే సందికొండయందలి
*పాపాగ్ని పీఠాధిపతులగు వీరభోజాచార్యులను శ్రీ వారి
ధర్మపత్ని వీరపాపమ్మాయు సంతానార్థులయి నానాపుణ్య
తీర్థములఁ బర్యటించుచుండిరి. ఉత్తమ వ్రతులై వైదికధర్మ
మార్గమున పాపాగ్నిపీఠాధ్యక్షత వహించి ప్రజాపాలనము
సేయు వీరికి సంతానము లేదయ్యెను. ఆ కొఱంతఁ బాపు
కొనుటకై తపస్సులు దానములు సేయుచు, శ్రీశైలాది
పుణ్యక్షేత్రముల సేవించుచు తుదకు జగన్నాథమును జేరి
యా దేవు నర్చించి, యటనుండి సరస్వతీ తీరమున నున్న

* ఈ పీఠమునకు పాపఘ్నీపీఠ మని గూడ నామాంతర మున్నది.

యత్రిమునీంద్రునికడకుఁ జేరుకొనిరి. అత్రిమహర్షియు నా పుణ్యదంపతుల సచ్చరిత్రము నుపలక్షించి యవ్వారి ప్రార్థన నంగీకరించి తనవద్ద నున్న వీరనారాయణ యను నీ బాలు నా దంపతుల కర్పించి, యవ్వాని జన్మవృత్తాంత మును సాంగోపాంగముగా వివరించి చెప్పెను. ఇంకను అమ్మహత ప్రభావ సంపన్నుఁడగు నీ బాలుఁడు మనుష్య మాత్రుఁడు గాఁడనియు, లోకోత్తర చరిత్ర గలిగి, లోకము నుద్ధరింపఁ బుట్టిన మహాపురుషుఁడు గావున, నిట్టి కారణజన్ముని యాధిపత్యమున పాపాగ్నిమఠము పాప మున కగ్నియేయై పుణ్యఫలములఁ బంపించి ప్రజాసంతరణము సేయఁగలదని యానతిచ్చి పంపెను.

పాపాగ్ని మఠాధిపతులగు నాదంపతు లిరువురును స్వస్థానమున కేతెంచి పిల్లవాని నల్లారుముద్దుగాఁ బెంచుచు "బ్రహ్మవర్చసకామస్య కార్యం విప్రస్యపంచమే" (బ్రహ్మవర్చస్సును గోరు విప్రునికి అయిదవయేట ఉపనయనము చేయువలయును) అను మనువచన ప్రకార మా బాలున కొక్కశుభముహూర్తమున నుపనయనము గావించి వేద

శాస్త్రాదులను జదివింపఁజేసిరి. సహజజ్ఞాన విలాసుఁడగు నాతనికి వేదశాస్త్రవిజ్ఞాన మేమికష్టము! అచిరకాలము ననే సర్వవిద్యలయందును సర్వశిల్పకళలయందును గుశలుఁడై త్వష్టపుత్రుఁడగు విశ్వరూపుడో యన నాబాలుఁడు తే జ రి ల్లు చు ం డె ను.

వీరనారాయణ వీరభోజాచార్యులకు దత్తపుత్రుడయిన పిమ్మట వీరంభట్లు, వీరంభట్లయ్య యను పేళ్లతో విలసిల్లుచుండెను. ఇట్లు కొంతకాలము గడచిన యావల వీరభోజయాచార్యులు పరమపదము నలంకరించెను. మహాపతివ్రతాశిరోమణి యగు వీరపాపమ్మ భర్తృదేవు ననుసరింపఁ దలంచియుఁ గుమారుని పాలన పోషణములకుఁ దగువారు లేమిఁజేసియు, ఆ యర్భకుని తెలివితేఁటలకు, విద్యావివేకములకుఁ దగిన చేయూఁత దానే యగుట వలనను భర్తృ మరణ దుఃఖమును దిగ మ్రింగి జీవించియేయుండి యాబాలకుని యభ్యుదయము నాకాంక్షించు చుండెను. "రత్నం సమాగచ్ఛతు కాంచనేన" అన్నట్లు సహజముగా మహాపురుషుఁడగు వ్యక్తికి

అనుకూలమగు దేశ కాల వస్తువులు, పరిసరములు చేకూ
రిన నాతఁడెంతగా శోభింపడు ! అష్టాంగయోగాభ్యాసము
నకు, తపశ్చర్యకు అనుకూలమగు మఠ నివాసముచేత
వీరంభట్లయ్యగారి ఆధ్యాత్మిక సాధనలు, యోగానుష్ఠాన
ములు వసంతకాలమున వృక్షములవలె చిగిరించినవి.

త ప స్సు

వీరంభట్లయ్య పదిరెండేండ్లవాఁడయిన తరువాత
మాతృసంఘమున కాదర్శ ప్రాయ యగు 'తల్లినిఁజేరి
"అమ్మా ! నేను కొంతకాలము తపోవృత్తితో కాలము
గడపఁదలఁచి యున్నాను. తపస్సునకు గిరికందరారణ్య
ప్రదేశములు ఉచితములయినవి. అనంతరము నానాదేశ
సంచారము చేసి యార్యపుణ్యతీర్థముల సంచరించు నిచ్ఛ
గలదు. కావున నాకు సెలవిచ్చిసచో, నాధర్మమును నిర్వ
హింప నేగుదు." నని యడిగెను. అందుల కా ప్రియమాత
యుద్విగ్నయై "కుమారా ! ద్వాదశ వర్ష ప్రాయుఁడవగు
నీ వేడ ? మహాయోగి దుర్లభమగు తపశ్చర్య యేడ ?
అందును పర్వత గుహాలయందు తపమా ? అరణ్యసంచర

ణమా ? ఇందులకు నే నంగీకరింపఁజాల. పవిత్రమును ప్రశాంతమును నగు మఠమునకన్న నీకు తపోనుష్ఠాన యోగ్యప్రదేశ మెక్కడ లభించును ? కావున నీతలంపును మార్చుకొని మనమఠమునందే తపశ్చర్య నిర్వహింతువు గాక ! దేశసంచారమన్న, ఇప్పుడే చేయనలసిన యక్కఱ యేమి ? అది యెప్పుడేని చేయవచ్చును." అనెను. అందు కాబాలుఁడు "తల్లీ! నీవు పుత్రమోహాలాలసవై యిట్లాడు చున్నావుగాని నా శక్తిసామర్థ్యములను, వాని నినుమ డింపఁజేయు సత్యసంకల్పములను నెఱింగి పల్కుటలేదు. నేను బాలుడనని నీవు భయంపడ నక్కఱలేదు. విశ్వకర్మ భగవాను ననుగ్రహముచేత నాకు పర్వతకందరములైనను ప్రాసాదరాజములు కాఁగలవు. మహారణ్యము లయినను లీలోద్యానము లగును. సింహశార్దూలాది ఘాతుకమృగ ములును ప్రియమిత్రములై పరిచరించును. కావున ప్రాణి సహజమగు మోహపాశమును దెగఁద్రెంపి, నా గమన మున కియ్యకొనుము."అని పలుమాఱు ప్రార్థించెను.

అందులకు వీరపాపమ దుఃఖసంతప్త చిత్తయై "నాయనా! ఏ ఏ లీలలను జూచి మీతండ్రిగారి మరణ దుఃఖమునుగూడ దిగమ్రింగితినో, ఏ నీవు పీఠాధిపతివై ధర్మప్రచారము సల్పుదువని యూహించితినో, అట్టి నిన్ను వదలుకొనఁజాలను. వేఱొకచోట నీవుండుట కంగీకరింపఁ జాలను. నీ వీ పీఠమున కధిపతివై రాజువలె ధర్మముగా శిష్యపాలనము సేయుము. మఠము నాశ్రయించినవారి పూజాపురస్కారముల నందుకొనుము. మనకు పలువిధ ములగు కొన్కలు కట్నములు లభింపఁగలవు. ఏ కొఱంత యులేక హాయిగా కాలమును వెళ్ళఁబుచ్చెదము." అనియెను.

అందులకు వీరంభట్లయ్య "తల్లీ! అట్లనకుము. "ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్" అని విన లేదాకి భూమండలమునం దంతటను పర్యటించి ధర్మోపదే శము లొనర్చి సాధుసంతరణము చేసి మానవమండలికిఁ గల్యాణమును పంపాదింపనెంచు నాకీ గృహనివాస మెంతటిదికి నిజధర్మమును గోల్పోయి, లోకులచే

గర్వింపఁబడుచు సనాతన ధర్మమునకుఁ దలవంపులు చేకూర్చుచున్న పీఠములను సంస్కరింపనున్న నాకీ యొక్క పీఠము నంటిపట్టుకొని యుండుట యుచితమా ? సర్వ మానవ సంఘములను సంసేవించి, వారిపూజా పురస్కార ముల నందవలసిన నాకు ఒక్క మఠము వారిమన్ననలను గైకొనుటయే కర్తవ్యమా ? పాపాగ్ని పీఠాధిపత్యమున కెవ్వరినేని నియోగింపుము. నాకు సెలవిమ్ము. ప్రాకృత సంబంధమగు నీ పుత్ర మోహమును పటాపంచలు సేయుము. నా పితృపాదు లుపదేశించిన యాధ్యాత్మిక జ్ఞానము ననుసంధింపుము. మైత్రేయివలె ఆత్మ ద్రష్టవ్యము శ్రోతవ్యము, మంతవ్యము, నిధిధ్యాసితవ్యము నని యెఱుంగుము. పూర్ణయోగము ననుష్ఠింపుము. ఏల బేలవయ్యెదవు? ఈశ్వరుఁడు భక్తుల కర్తవ్యములను దానే నిర్వహింపఁగలఁడని విశ్వాసము పూనలేవా ? పిచ్చితల్లీ ! ధ్రువ ప్రహ్లాదాదులు బాలురు కారా ? దుష్కరమగు తపశ్చర్యకును, కష్టసహిష్ణుతకును వారు వెనుకంజ వేసిరా ? అట్టి వృత్తాంతముల

నెఱింగిన నీవేల సందియ పడెదవు ? కావున నన్నాశీర్వ
దించి పంపు"మని ప్రార్థించి తత్త్వ బోధముచేత నామె
యజ్ఞానపుం బొరను తొలగించి, యా పరమసాధ్వీ
రత్నముచే మేల్మిదీవనలఁ బడసి మన వీరంభట్లయ్య
పాపాగ్నిమఠమునుండి పయన మాయెను.

వీర యోగీంద్రుని జీవితములో నెన్నఁదగిన
ముఖ్యాంశములలో నిది యొకటి. ఈతఁడు సామాన్య
విద్యాబుద్ధి వివేకములు గల వ్యక్తిమాత్రుఁడే యైన
యెడల అయాచితముగలభించిన పీఠాధిపత్యమును చేఁజేతఁ
బోఁగొట్టుకొనునా ? ఎల్లపీఠాధిపతులవలెఁ దానును అధి
కారముద్రను జేఁదాల్చి యూరేఁగఁ జూడఁడా ? ఆతని
భావిలక్ష్యము, భవిష్యత్కర్తవ్య నిర్వహణము ఆతనికిఁ
దోఁచియుండుటచేతనే లోకోత్తరమగు తత్త్వబోధచేత
తల్లిని సమాధానపఱచి, సమాధానపఱచుటయే కాదు,
ఆమెకు సంతరణమార్గమునుగూడ నుపదేశించి, దుఃఖ
దూరనొనర్చి తపోనుష్ఠానమునకును దేశ సంచారము
నకును బయలెల్వడలెను.

వీరగురుఁ డీ ప్రకారము బయల్వెడలి దక్షిణ దేశమునందలి రామేశ్వరమున కేగి యందలి భక్తులకును, యోగులకును, ముముక్షువులకును ననేక సదుపదేశము లొనర్చి, ధనుష్కోటి, చిదంబరము మున్నగు పుణ్య క్షేత్రములందుఁ దిరుగాడుచు, నందందుఁ గల మానవ సంఘములను భక్తకూటములను జానుతెనుంగునం గల తన వేదాంత వాక్యసమూహముచేఁ బ్రబోధించుచు భక్తి జ్ఞాన కర్మయోగములను బ్రచారము చేసెను. కొంతకాల మిట్లు గడపి తుదకు హరిహర పురంబునకు వచ్చి యందలి విశేషముల నారసి యుక్తమగు నొక పుణ్యప్రదేశమున తపోదీక్షవహించి నియమకృశదేహుఁ డగుచు కఠోరతప మాచరించెను.

వీరగురుని దేశాటనము మానవుఁడైనవాడు విద్యాబుద్ధులు సంపాదించి నానాదేశములఁ బర్యటనము సల్పి తా నెఱిఁగిన జ్ఞానమును బ్రచారము చేయవలయు ననియుఁ, దనకుఁ దెలియని యంశముల నెఱుంగవలయు ననియుఁ దెల్పుచున్నది కదా !

మనుజుని మహిమను, శక్తిని ఇనుమడింపఁ జేయు సాధనములలో తప మొక్కటి. అతీంద్రియార్థములను గూడ సుప్రత్యక్ష మొనర్చుటకును, మర్త్య ధర్మములో నుండిన మానవుని దివ్యధర్మములోని కుద్ధరించుటకును తపమువంటి గరిష్ఠ సాధనము వేఱొండు లేదు. ప్రాచీను లగు మహర్షులు తపోనుష్ఠానముచేతనే లౌకికాలౌకిక ధర్మముల నెఱింగి ఆత్మజీవితమునే గాక, లోక జీవితమును గూడ సంతరింపఁజేయఁ గల్గిరి. పుటము పెట్టుటచేత బంగారము మేల్మిమై తేజరిల్లునట్లు, ఉత్తమ సంయమ ముతోఁగూడిన తపస్సుచేత అంతఃకరణము గూడ విశుద్ధ మయి బ్రహ్మసాక్షాత్కార యోగ్యస్థితి నందును. కావు ననే వరుణభగవానుఁడు బ్రహ్మోపదేశము చేయుమని తన్ను ప్రార్థించిన ప్రియసుతుఁడగు భృగువునకు తపస్సుచే బ్రహ్మమును జిజ్ఞాస యొనర్పు (తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ) మని బోధించి యున్నాఁడు. గరిష్ఠమగు తపమువలెనే ప్రభావము నెఱింగియుండిన వీరగురుఁ డీ తపశ్చర్య చేత

నొక యుత్తమాదర్శము ననుష్ఠించి లోకమునకు పాఠము నేర్పియున్నాఁడు. తపఃప్రభావమును ముండకశ్రుతి యిట్లు వక్కాణించుచున్నది.

"తపఃశ్రద్ధే యే హ్యుపవసన్త్యరణ్యే
శాన్తా విద్వాంసో భైక్షచర్యాం చరన్తః
సూర్యద్వారేణ తే విరజాఃప్రయాన్తి
యత్రామృతఃస పురుషో హ్యవ్యయాత్మా."

—ముండకోపనిషత్తు.

"ఇంద్రియ విషయములకు లోఁబడనివారై నిర్జన ప్రదేశములందుండి తపశ్శ్రద్ధల ననుష్ఠించుజ్ఞానులు సూర్య ద్వారమున తమ పుణ్యపాపరూప కర్మములు నశించి పోఁగా, అవ్యయుఁడు అమృతుఁడునగు పరమపురుషుఁ డుండు పదమును పొందఁగలుగుచున్నారు."

బసగానపల్లె నివాసము

వీరదేశికుని జీవితములోఁ బేర్కొనఁదగిన యంశ ములలో శ్రీమతి గరిమిరెడ్డి అచ్చమాంబ గారియింట నాతఁడు సేవకవృత్తితో నడపిన లీలావిశేష మొకటి.

వీరంభట్లయ్య హరిహరపురములో తపోవృత్తినున్నప్పుడు కాశీపుర నివాసియగు ఆనందభైరవయోగి యను నొక క్షత్రియుడు వచ్చి యా గురునిచేత యోగరహస్యము లను మంత్రవిశేషమును దెలిసికొని పోవును. తరువాత గురుడు ఉత్తరదేశమున బర్యటించు నుత్సాహముతో కాశి, ప్రయాగ, మున్నగు క్షేత్రములందు దిరిగి యచ్చటచ్చట గల భక్తులకు మునులకు దత్త్వరహస్యములను జాటుచు కాలజ్ఞాన విశేషముల నుగ్గడించుచు మఱలివచ్చి శ్రీశైలము, మహానంది, యాగంటి మున్నగు పుణ్యక్షేత్రములను దర్శించి విజ్ఞానప్రచార మొనర్చుచు గడపు బనగానపల్లె చేరెను.

బనగానపల్లెలో సుప్రసిద్ధమగు కాపుకుటుంబము శ్రీ గరిమిరెడ్డి వేంకటరెడ్డిగారిది. వేంకటరెడ్డిభార్య అచ్చమాంబ పరమసాధ్వి; అతిథ్యభాగ్యతుల నర్చించుటయందాసక్తి గల యుత్తమాలగన. దైవపూజా పురస్కారములను విశేషముగా జేయుచు యోగులన్నను, సాధువులన్నను సేవాశుశ్రూషలు నెఱపుచుండును. గురుదేవుని

ఈ యమ నుద్ధరించి యీమెకుఁ దత్త్వోపదేశముచేసి ఘోర
మైన యొక సనాతన ధర్మమును ఉద్ధరింప వాంఛ గలిగినది.
గోపాలకుఁడై యీమెయింట నూడిగము సేయ నీమె
నంగీకరింపఁ జేసినాఁడు. కృష్ణదేవుఁడు గోపాలనము
నెఱపి భారతీయులకు "గోమాత పూజనీయ" యని
నిరూపించినట్లు, వీరగురుఁడును గోపాలనాయోగము పూని
యీ మహోదర్శమునే మఱల చాటఁబూనెను. గోక్షీర
ములుమాత్ర మాహారముగాఁ జేసికొని గోవులను దోలు
కొనిపోయి యొక్కచో నిల్పి, తా నొక కొండగుహలో
కాలజ్ఞానమును వ్రాసికొనుచు గూర్చుండుట గురుదేవుని
దినచర్య. ఈ యుదంతము రెడ్డిదంపతుల చెవి సోకినది.
వారు వీరప్ప కార్యవిధానమును బరికింప నొకనాఁడు ఆ
పర్వతకందరమును దటిసి చూచిరి. గుహాంతర్భాగమున
వీరయోగి పద్మాసన స్థితుఁడై యేకాగ్రదీక్షతో తాటి
యాకుల మీఁద నేమేమో వ్రాయుచుండెను. ఆతని
చుట్టును అలౌకికమగు నొక దివ్యతేజ మావరించి
యున్నది. బాలుఁడీ రెడ్డిదంపతులకు బ్రహ్మగను,

విష్ణువుగను, శివుడుగను, పంచముఖుడుగను క్షణమున
కొకరీతిగా దోచుచుండెను. ఈ యలౌకిక సంఘటనము
నకు వా రాశ్చర్యభరితు లైరి. నూతనములగు జ్ఞాన బల
శక్తులు వారిలో రేకెత్తినవి. ఎట్టకేలకు సమీపించి
ఆ త్రికాలవేత్తను స్తోత్రముచేసి ఆయన కారుణ్యమునకు
పాత్రు లైరి. అస్థలగు నాదంపతులకు గురుస్వామి మం
త్రోపదేశము చేసి, యోగమార్గములను ఉపదేశించి
ధన్యజీవుల నొనర్చెను. "శూద్రులకు మంత్రాధికారము
లేదు." అను సంకుచిత సంప్రదాయమును గ్రుడ్డిగా అను
సరింపరాదనియు, శూద్రునకుగాని, బ్రాహ్మణునికిగా
గాని హృదయసంస్కారమును బట్టియు, యోగ్యతను
బట్టియు, బ్రహ్మవిద్యాధికారము చేకూరు ననియు, ఈ
యంశముచే గురుదేవుడు బోధించి యున్నాడు. గురు
దేవుని యీ సదాశయము ప్రకృత దంపతుల విషయము
నందే కాక, సిద్ధప్ప విషయమునను, ఇంకను గాఢముగ
మాదిగ కక్కని విషయమునను గూడ దెల్లము కాగ
లదు. కక్క డంత్యకులజుడైనను హృదయసంస్కారము,

సాధన చతుష్టయసంపద గలవాడు గావున, బ్రహ్మాను గ్రహామునకు బాత్రుడైవీరగురునిచే బ్రహ్మోపదేశము నంది కృతార్థుడైనాడు. ఈ యంశమునకే హృదయ ముప్పొంగి యొకసారి యిట్లు పాడుకొన్నాను.

కులమునకుఁ గాక యోగ్యతకును గుణమ్మున
నకును మన్నన యొసఁగి యంత్యజుని కేని
ఔపనిషదార్థ పీయూష మందఁ జేయు
నట్టి దేశికు చరణమ్ము లాశ్రయింతు.

గురుదేవుడు పై యంశమునే పలుతావుల నుగ్గ డించి, నవాబుల యాస్థానములందును ఉపన్యసించెను. ఆదిశంకరులు సైతము కాశీనగరమున, తత్త్వజ్ఞుడైన చండాలునితో సమావేశమైన సందర్భమున, తన యజ్ఞాన పుంబొర వీడిపోవ "చండాలోఽస్తు స తు ద్విజోఽ స్తు గురురి త్యేషా మనీషా మమ" అని గానము చేసినాడు గదా! కులములయొక్క మూలతత్త్వము తెలియనప్పుడు ఎంతటివారేని పొరపాటు పడుట వింతకాదు.

గురుమూర్తి బనగానపల్లెలో నుండి కాలజ్ఞాన రచన మొనర్చు సమయమునందే అన్నాజయ్య యను

నొక బ్రాహ్మణభక్తుడు ఆయనకు శిష్యుడుగా చేరెను. అన్నాజయ్య బ్రహ్మవిద్యాధికారి యని తెలిసికొన్నగురు మూర్తి ఆయన సేవాశుశ్రూషలకు మెచ్చి, ఆయనకు మంత్ర యోగాదుల నుపదేశించి, పెక్కు కాలజ్ఞాన రహస్యములను గూడ బోధ చేసెను. వీరగురు నాశ్రయించి అచిరకాలములోనే కృతార్థులైనవారలలో అన్నాజయ అగ్రేసరుడందురు.

గురుదేవుడు బనగానపల్లెలో నేలమఠమును స్థాపించి, అందొక శివలింగమును గూడ ప్రతిష్ఠించినాడు. పిమ్మట అచ్చమ్మగారి యింటనే తాను వ్రాసిన కాల జ్ఞానగ్రంథముల నన్నింటిని భద్రపఱచి వెడలి పోయెను. ఆ సమయమునసే కడపమండలము నందలి దువ్వూరు గ్రామమునందును గొంతకాలము నివసించి అక్కడి భక్తుల కోరికమీఱ, ఆ యూరిలో కాళికాదేవిని గూడ స్వయముగా ప్రతిష్ఠించినాడు.

గృ హ స్థా శ్ర మ ము

యాతులకే గాని ముక్తి గృహస్థతతికి
దూర మనెడు నపోహము దొలఁగఁ జేసి
గేస్తు ధర్మమ్ము ప్రకటించు గృహివరేణ్యుఁ
డెప్పుడు వసియించుఁగాత నా హృదయసీమ.

గురుదేవుఁ డింతవఱకును బ్రహ్మచర్యాశ్రమమునఁ
యున్నట్లు పాఠకులు గ్రహించి యుండవచ్చును. తనజీవిత
ములో గార్హస్థ్య ధర్మమునుగూడ నాచరించి చూపినఁ
గాని లోకమునకు పరమాదర్శమును జూటినట్లుగాదు.
ఆ కాలమువఱకును శంకరాదులేమి, బౌద్ధులేమి, మును
ఱువులకు సన్న్యాసాశ్రమమే సమాశ్రయింపఁ దగినదని
ప్రచారముచేసి, జనులకు గార్హస్థ్యము నెడ నిరసన భావ
మును గలిగించి యున్నారు. అది కారణముగా గృహ
స్థుడు కేవలము కామారాధకుఁడయి ధర్మపత్నిని
కామోపకరణముగా భావించి, గృహస్థాశ్రమముయొక్క
ఉత్తమోత్తమ లక్ష్యము నుండి జారిపోయెను. ప్రజా
సమూహములోనున్న యీ గార్హస్థ్య నిరసనభావమును

బోగొట్టి యద్దాని పూజ్యతను లోకమునకు ఆచరణ పూర్వకముగా నిరూపించుటకొఱకు, ఆజన్మబ్రహ్మవేత్త యయ్యు బ్రహ్మము గృహస్థుఁ డైనాడు. సనాతన ఋషులు సయితము సర్వజ్ఞులయ్యు గృహస్థులగుట ఉత్తమ మానవ సమాజమును సృష్టి సేయుటకే యని మన సుశిక్షిత దృష్టికిఁ బొడకట్టఁగలదు. ఖిలముక్తాని ఋషిమహోపర్వములను బ్రకటించుటకే వీరగురుని యవ తారము గావున, ఆతఁడు పెదకొమెర్ల నివాసియు అనూచాన వంశమున నవతరించినవాఁడును నగు శివ కోటయ్యగారికి దైవానుగ్రహమువలనఁ గలిగిన గోవిం దమ్మను బెండ్లిచెయ్మె గృహస్థుఁ డాయెను. గోవిందమ్మ సుగుణముల రాశి; పతిసేవావ్రతమే జన్మతారకమని భావించి చరించు పుణ్యసాధ్వి. ఇట్టి యతివలమిన్నతోడి గురుదేవుని కాఁపురము దివ్యసౌఖ్యములకు నివాస మగుట ఆశ్చర్యము కాదు.

వీరగురుని ఈ వివాహ సంఘటనముగూడ విచి త్రముగానే జరిగినది. బాల్యవివాహములు జరుగు నా

కాలములో గోవిందమ్మగారి పెండ్లి రజస్వలానంతరమే యయినది. ఆమెతండ్రి సర్వసంపదలతోనిండిన సంబంధము తేవలయునని ప్రయత్నించుచుండువాఁడఁట. ఆమె "తనకుఁ దగిన వరుఁ డెవ్వఁడో తనకుఁ దెలియు ననియు, అట్టి మహాపురుషుడు వచ్చువఱకును దాను పెండ్లి చేసికొన ననియు" పట్టుపట్టి కూర్చుండినదఁట. ఇట్లు కొంతకాలము గడచుటయు, తుద కామె రజస్వలయఁగుటయు, కులము వారాక్షేపించుటయు, సంబంధములు రాకపోవుటయుఁ గూడ సంభవించెను. ఎట్లు జరిగినను ఆమె మాత్రము చలింపక దైవనిర్ణయము నెఱింగిన దానివలెనే తలిదండ్రులను, బంధువులను ఊఱడించుచు, తనకుఁ దగిన వరుని దైవమే నిర్ణయించి పంపునని చెప్పుచు కాలక్షేపము చేయుచుండెను. అప్పటికే వీరబ్రహ్మముగారు మహానుభావుఁడని దేశమున ఆయనపేరు మాఱుమ్రోగి పోవుచుండెను. ఇట్టి స్థితిలో ఒకనాఁడు వీరగురుఁడు శివకోటయ్యగారి యింటికి వచ్చుటయు, ఆ మహాపురుషునే తనకుఁ బెండ్లి చేయుఁడని గోవిందమ్మగారు తలిదండ్రులను ప్రార్థించు

టయు జరిగినది. ఇల్లు వాకిలి లేని ఒక బైరాగివానికి తమ గారాబు కొమరిత నిచ్చుటకు ఏ తలిదండ్రులైనను ఒప్పుకొందురా ? శివకోటయ్య దంపతులు మొట్టమొదట ఆ సంబంధమునకు అంగీకరింపరైరి. అయినను కన్య పట్టుదలవలన చిట్టచివరి కొప్పుకొనక తప్పినది కాదు. దీనికిదోడు బ్రహ్మగురుడు మహానుభావుడని విని యున్నారు. కావునను "ఈ సంఘటన మెందుకు జరుగు చున్నదో" యనుకొని వారు కూతుముద్దు చెల్లించిరి. గోవిందమా వీరబ్రహ్మయోగుల దాంపత్యము పార్వతీ పరమశివుల కల్యాణమువలె జగత్కల్యాణ కారకమై యొప్పినది.

ఉత్తమ గార్హస్థ్యధర్మమును సతీపతు లిరువురును నిర్వహించి లోకమునకు గరిష్ఠాదర్శములను నిరూపించిరి. రెండవ రామచంద్రమూర్తివంటి భర్తకు నీడవలె మెలగుచు, ఆయన రెండవ హృదయమో యన ప్రవర్తించుచు ఆత్మనాథుని మంత్రయోగజ్ఞానాది బోధాచరణములలో ఆయనతో సహకరించుచు గోవిందమ్మ అచిరకాలమునసే

అతిథ్యభ్యాగతులకును, శిష్యవర్గమునకును, బంధుకోటి
కిని, వేయేల, సర్వ ప్రజానీకమునకును ఆరాధనీయురా
లయ్యెను. ఇటీవలి కాలమున మనవారు రజస్వలానంతర
వివాహముల ప్రాముఖ్యమును గుర్తింపగా, బ్రహ్మ
గురుడు అలనాడే వాని యావశ్యకతను గుర్తించి స్వయ
ముగా ఆచరణలో పెట్టి ఒక యుత్తమ సంస్కారమును
జాటియున్నాడు. అచిరకాలమునసే ఆపుణ్యదంపతులకు
క్రమముగా విశ్వకర్మదేవుని తనూభవులగు పంచ
ఋషులాయనునట్లు గోవిందయ్య, సిద్ధలింగయ్య, శివరా
మయ్య, ఓంకారయ్య, పోతులూరయ్య, అను నైదుగురు
పుత్రులును, వీరనారాయణమ్మ యను నొక పుత్రికయు
ఉదయించిరి.

శిల్పయోగము

అల సనాతన ఋషిధర్మ మైన శిల్ప
కర్మయోగమునఁ బూని నైష్కర్మ్య సిద్ధిఁ
జాలె నే కర్మకుశలుఁడా సంయమీంద్రుఁ
డొసఁగి ప్రోచుత సత్క్రియా యోగదీక్ష.

గృహస్థుఁడైన మన గురుదేవుఁడు ధనోపార్జనకు సాధనముగా ఁ దన కాబాల్యమునుండి యలవడిన వేద విద్యను (పౌరోహిత్యము) సాధనముగాఁ జేసికొన్నచో అనాయాసముగా పప్పు బియ్యముల నాకర్షించుటతో జీవితసమస్య పరిష్కారమై పోయెడిదే. కాని అంచు కాతఁ డియ్యకొనలేదు. ఉత్తమధర్మమగు శిల్పకర్మ నాచరించి కుటుంబభరణలీల నాతఁడు జరిపెను. సర్వశిల్ప కళాగుఱుడగు నాతనికి చేతగాని శిల్పవిద్యలేదు. అయి నను ఆ దేశమున కవసరములైన కమ్మారమును, వడ్రంగ మును, శిలాశిల్పమునే యాతఁడనుష్ఠించి వెలుఁ గొందెను. బ్రహ్మదేశికుఁడు నివసించిన ప్రదేశము పర్వత మయ మగుటంబట్టి, ఱాలనుండి యినుమును దీసి కమ్మారమును జేయుటకును, ఱాలతో దేవమూర్తి దేవ మందిరాది నిర్మాణము లొనర్చుటకునే యాతఁడెక్కువ శ్రద్ధ చూపినట్లు తెలియుచున్నది. ఇంకను దారుకర్మను గూడ ఎక్కువగా ప్రోత్సహించి భవనాదినిర్మాతలకు గూడ నాతఁడు నూత్నచైతన్యమును జేకూర్చి భవన

నిర్మాణకళ నుద్ధరించెను. "శిల్పమధ్యయనం నామ వృత్తం బ్రాహ్మణ లక్షణమ్". అను సూక్తికి గురుదేవుని జీవి తము లక్ష్యభూతమై యొప్పినదని చెప్పుట వింతకాదు. ఎంతయో దూరదృష్టిగల గురుదేవుడు భావిభారత సమ స్యలను దన దివ్యజ్ఞానములో బ్రత్యక్షింప జేసికొన్న మహనీయుడు డగుటచేత సారస్వత విద్యలకు గర్మ విద్యల తోడ్పాటున్నదిగాని, మానవజీవితము ధర్మార్థము లనెడి పురుషార్థములను సాధించుటలో సమర్థముకాదని యెంచి, తదాచరణమును స్వీయజీవితమున నెలకొల్పి నాడు. గురుదేవుడు కేవల వ్యక్తిమాత్ర జీవిత నిర్వహ ణమునే దృష్టిలోనుంచుకొని తాను ఆదర్శములను జూటలేదు. విశ్వకుటుంబియగు గురుని విశాలహృద యములో "సుజల, సుఫల, మలయజ శీతల, బహు కోటి కంఠ కలకల నినాద కరాళ"అయిన విశాలభారత మాత ప్రతిఫలించినది. అన్యపాలనమునకు లోబడి అర్ధ సిద్ధిలో వెనుకంజ వేయనున్న హిందూదేశమునకు శిల్పపరి శ్రమల దార్ఢ్యమున్నదిగాని కృతకృత్యత లేదని యా

మహానీయుడు ఈ యుత్తమాదర్శమును నడపెనని గ్రహింపవలయును. విశాలభావముతో ఆలోచించినచో ఒక్క భారతదేశమునకే గాక, యే దేశమునకైనను, ఏ జాతికైనను, ఏ ప్రజకైనను, ఈ శిల్పకర్మానుష్ఠానము ఆవశ్యకమై జీవితమున అర్థపుష్టిని జేకూర్చు నుత్తమ సాధనమై చెన్నొందును గావున, విశ్వమానవ ధర్మమునే గురుదేవుడు స్వయ మనుష్ఠించి ప్రబోధించినాడని తెలియగలము. భారతదేశములో శిల్పలక్ష్మి తాండవించునప్పుడు మన యైహికాముష్మిక విభూతు లెట్లు వెల్లివిరిసినవో మన దృష్టిని భూతకాలమునకు మరల్చిన దెలియగలదు. ఈ యంశమునే వీరబ్రహ్మము పెక్కు రగు నవాబులకు నచ్చజెప్పి వారిచే శిల్పవిద్యాదేవిని ఆరాధింపజేసినాడు. మొన్నటివఱకు మన గాంధిమహాత్ముడు సైతము సారస్వతవిద్యలకు వృత్తి విద్యల తోడ్పాటునే చేకూర్చి దేశకల్యాణమును సాధింప జూచియున్నాడను విషయమును పాఠకులిచ్చట గమ

నింపవలయును. ఈ సందర్భమున గురుదేవుని బాల్యకాల
మందలి లీలావిశేషము నొకదానిని మనము స్మరింతము.

మూర్తిపూజ

శిలాశిల్పమునఁ గడునేర్పరియగు వీరగురుఁడు
పూజోచితమగు శిలతో వీరభద్రవిగ్రహము నొకదానిని
నిర్మించి, యద్దానికి ప్రాణప్రతిష్ఠ చేసి చైతన్యము నందు
బ్రవేశపెట్టెను. ఆ విగ్రహము కుముద్వతీనది (కుందునది)
లోఁ బడి ప్రవాహవేగమున "అల్లాడుపల్లె" యను
గ్రామమువద్దకుఁ గొట్టుకొని వచ్చెను. ప్రతిదినము ఆ
విగ్రహమునుండి యొకబాలుఁడు వచ్చి యాగ్రామము
నందలి బాలురతో నాడి, సాయంకాలము కాఁగానే
మఱల నదిలో మునిఁగి యంతర్ధానుఁడై పోవుచుండు
వాఁడు. ఇట్లు కొంతకాలము గడచిన పిమ్మట ఆ వీరభద్ర
స్వామి యూరి పెద్దకాఁపునకు స్వప్నమున నగపడి
తన్నొక దేవాలయమున ప్రతిష్ఠించి పూజింపవలసిన
దనియుఁ, దన భక్తుల కామితార్థములను దాను పూరింతు
ననియుఁ జెప్పెను. తరువాత ఆదేవుని యాజ్ఞానుసార

మట్లు జరుగగా, వీరబ్రహ్మగురుడి యుదంతము నెటింగి యల్లాడుపల్లెకు వచ్చి యా దేవుని గొంతకాల ముపా సించి విగ్రహారాధన మహత్వమును, బ్రయోజనములను ఎల్లవారికి నుపన్యసించెను. మన మెఱింగినంతలో వీరదేశి కుడు తనకు దేశికునిగాభావించినది ఈవీరభద్రస్వామినే. నేటికిని అల్లాడుపల్లెలో నీ వీరభద్రస్వామి పూజా పుర స్కారముల నందుచు భక్తుల వాంఛితార్థములను దీర్చు చున్నాడు. బ్రహ్మశిల్పి అయస్కారవృత్తి (కమ్మరము) నాచరించుటచేత ఇహలోక జీవన నిర్వహణ సాధనమును, వీరభద్రస్వామిని నిర్మించి ప్రతిష్ఠించి పూజిం చుటచేత పారలౌకిక సాధనమును నిరూపించినాడు. హిందూదేశమున అనాదిసిద్ధముగా విగ్రహారాధనముండి యాస్తిక్యము నుద్ధరించు చున్నదిగదా! జనసమూహము నకు అన్నవస్త్రములను జేకూర్చు కృషికార్యముల కత్యంత ముపకరించు కమ్మరమును, వడ్రంగమును బ్రోత్సహించు టలో గురుదేవుని సూక్ష్మదృష్టి అన్నవస్త్రసంపాదనములో నెట్లు లగ్నమయినదో యూహించి చూడుడు. ప్రతిమా

ని ర్మాణ మొనర్చి యుపాసనము చేయుటచేత సనాతన శిల్పబుషుల. ఉత్తమాదర్శము నాచరించి చూపెను.

యో గో ద్ధ ర ణ ము

ఘనతరాష్టాంగ యోగమ్ము కాలిపోయి
శుష్క వేదాంతమున యోగశూన్య మయిన
జగమునన్ యోగమార్గ సంస్థాపన మ్మొ
నర్చు యో గీ శ్వ రు డు శరణమ్ము నాకు.

గీతాచార్యుడు "ఆత్మసంయమయోగము" లో ప్రాణాయామాదష్టాంగ యోగము నుపదేశించి యంత మున దాని మహత్త్వమును గూర్చి చెప్పుచు——

"తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః
కర్మిభ్య శ్చాధికో యోగీ తస్మా ద్యోగీ భవార్జున!"

ఈ యోగము ననుష్ఠించిన యోగి తాపసుల కంటెను, జ్ఞానులకంటెను, కర్మఠులకంటెను అధికుడని నుడివి యుండెను. అనుభవరహితమగు పుస్తకజ్ఞానమును ప్రకటింపవచ్చును. కర్మము లొనర్పవచ్చును. శరీరమును కృశింప జేయుచు చాంద్రాయణాది తపముల నాచరింప

వచ్చును. కాని, సదాచరణ సాధ్యమగు యోగమును త్రికరణములను, ప్రాణ మనశ్శక్తులను వశము చేసికొని యనుష్ఠించుట కష్టము. అందును ధ్యాన,ధారణ, సమాధు లనెడి త్రికమునం దధికారమును సంపాదించి, కృత కృత్యుడై సంయమవ్రతముచేత అతీతాచ్ఛత శక్తులను గైవసము చేసికొని యాత్మేశ్వరుడై ప్రకాశించుట యరిది. మన సనాతన మహర్షి లిట్టి యోగమును ఉగ్గుఁ బాలతో నాచరించెడివాఁడు. ముఖ్యులు యా శ్రమములం దును, కులపతుల విద్యాశాలలందును యోగాభ్యాసాది సదనుష్ఠానము లెట్లు నిర్వర్తింప బడెడివో సంస్కృత వాఙ్మయముచేఁ దెల్లముకాఁగలదు. ప్రాచీనులుఁ యోగము నందు శ్రద్ధ కలవారగుటచేతనే మనము నమ్మఁజాలనట్టి యత్యద్భుత శక్తులనుగూడ పిడికిటఁ బట్టి లోకసంతరణ మొనర్చి ధన్యులైరి. యోగము పండినపుడు యోగీశ్వరుఁ డందెడి ఫలములను, యోగానుష్ఠాన మార్గములను సాతంజల యోగసూత్రాది గ్రంథములు విస్తరముగ ఉగ్గడించు చున్నవి.

వీర దేశికు డవతరించి యొనర్చిన మహాకార్యము లలో యోగానుష్ఠాన ప్రబోధ మొకటి. ఏ కర్తవ్యము నైనను గురుదేవుడు స్వయ మనుష్ఠింపక లోకమునకు బోధింపడని పాఠకులు మఱువరాదు. అభీతిబోధాచరణ ప్రచారములు నాల్గును అమ్మహానీయుని జీవితమునందు సముచితస్థానము నాక్రమించుకొన్నవి. ఆజన్మసిద్ధుడగు నీ యోగీశుడు యోగమార్గములో మెట్టని ఘట్టము లేదు. పరకాయప్రవేశమేమి, జీవత్సమాధియేమి, అణి మాద్యష్టసిద్ధులేమి అన్నియు అవసరమైన ఘట్టములం ప్రబదర్శించినాడు. చిత్త మేకాగ్రమై ధ్యేయవస్తువును ధ్యానింప సమర్థమగు వఱకైనను ముముక్షువు యోగా భ్యాసము సేయకున్న, అట్టివానికి ముక్తి సులభసాధ్యము కాదని గురుదేవుడు తన తత్త్వ వాఙ్మయములో చాటి చెప్పినాడు. తన్నాశ్రయించిన శిష్య ప్రశిష్యుల కెల్లర కును బాల్యమునుండియు యోగవిద్యను గఱపి, ఉత్తమ యోగీశ్వరులనుగా నొనర్చినాడు. యమ నియమముల ననుష్ఠింపని వారిని శిష్యులనుగా జేర్చుకొనుటకే గురు

దేవుడంగీకరించువాడుకాడు. ఆయమ నియమములు సిద్ధింపనివారికి ఆసన ప్రాణాయామముల నేర్పువాడు కాడు. నిక్కమాలోచించినచో, యోగములో మొదటి యంగము లగు యమ నియమముల నాచరించుటచేతనే సాధకుడు గొప్ప గొప్ప ఫలములను బడసి, ఎంతయో ఆత్మసంస్కారము నందడాలు నని యోగశాస్త్రమును, యోగీశ్వరుల యనుభవమును చాటుచున్నవని తెలియగలము. అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము అను అయిదును యమమున కంగములు. అహింసావ్రతపాలనమునలన సర్వభూతమైత్రి చేకూరగలదు. సత్యవ్రతానుష్ఠానముచేత వాక్సిద్ధి కలుగును. ఇంకను శాపానుగ్రహ సామర్థ్యము సహితమబ్బును. అస్తేయ మనగా దొంగతనము లేమి. దాని చేత సర్వరత్న సంప్రాప్తి కలుగగలదు. బ్రహ్మచర్యము వలన తేజో వీర్య శక్తి లినుమడించును. అపరిగ్రహము వలన పూర్వోత్తర జన్మజ్ఞాన ముదయించును. శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణి

ధానము అనున వైదును నియమమునకు అంగములు. శౌచము ననుష్ఠించుటచేత దేహ మనో నైర్మల్యము, సత్త్వశుద్ధి, సౌమనస్యము, ఏకాగ్రత అను గుణములు కలుగుచున్నవి. సంతోషము ననుష్ఠించుటచేత అనుత్తమ సుఖలాభము చేకూరుచున్నది. తపస్సువలన శరీరేంద్రియములు పరిశుద్ధము లయి ఈశ్వర సాక్షాత్కార యోగ్యతను గూర్చుచున్నవి. వేదశాస్త్రాది గ్రంథములను, మంత్రములను పఠించుటయే స్వాధ్యాయము. అద్దానిచే ఇష్టదేవతా సందర్శనము సిద్ధించును. సర్వము బ్రహ్మమయ మని భావించి, అహంకార మమకారములను వీడి, ఈశ్వరార్పణ బుద్ధితో కర్మము లాచరించుట ఈశ్వర ప్రణిధానము. ఈ ఈశ్వర ప్రణిధాన మను నియమాంగము ననుష్ఠించి నందువలన శీఘ్రకాలమున సమాధినిష్ఠ సిద్ధించుచున్నది. అహింస మొదలగు నీ పది యంగములును మనస్సుచేతను, వాక్కుచేతను, కాయము చేతను, అనుష్ఠింపఁదగినవై యున్నవి. త్రికరణముల చేతను వీని నాచరించిననే అవి సత్ఫలముల నొసంగగలవు.

యమ నియమములనెడి రెండంగముల సదనుష్ఠాన మాత్రము చేతనే సాధకుడెంత సంస్కారమును బొంది పవిత్రుడగుచున్నాడో చూచితిరా!

సాధకుడు యమ నియమానుష్ఠానములో కృతార్థుడైన పిమ్మటనే ఆసనమునకు, ప్రాణాయామాచరణమునకు అర్హుడగుచున్నాడు. అటుపిమ్మటనే ప్రత్యాహారమున కర్హత. ఆ తరువాతనే యోగమునకు అంతరంగములని చెప్పబడిన ధారణా ధ్యాన సమాధుల ననుష్ఠించు యోగ్యత కలుగుచున్నది. సాధనచతుష్టయ సంపత్తి లేనివానికి బ్రహ్మజిజ్ఞాసాధికారమెట్లులేదో, అట్లే యోగవిషయమునను పూర్వ పూర్వములగు నంగముల ననుష్ఠింపని వానికి ఉత్తరోత్తరాంగముల నాచరించు యోగ్యత లేదని సాధకులు గ్రహింపవలయును. ఇది యంతయు మహారహస్యమగు యోగప్రణాళిక. దీనిని శాస్త్రాధారముచేతను, యోగసిద్ధులగు సద్గురువుల యను గ్రహముచేత మాత్రమే గ్రహింప వీలగు చున్నది. శాస్త్రాధ్యయన మున్ననూ, గురువుల మార్గదర్శకత్వము

లేకుండ యోగము ననుష్ఠింపరాదు. అది యనేకా
నర్థములకు దారి తీయును. ప్రాణాయామములో అనేక
భేదము లున్నవి. ఒక్కొక్కసాధకునికి ఒక్కొక తీరు సరి
పడుచుండును. అందఱకు ఒకటే మార్గము ప్రయాణింప
దగినదికాదు. అందుకే శిష్యుల యోగ్యతలను, మనశ్శో
రముల స్థితి గతులను ఎఱింగిన సద్గురువుల మార్గదర్శక
త్వము అవసరమని చెప్పవలసి వచ్చినది.

ఈ అష్టాంగయోగమును, సంయమమును, దానిచే
గల్గు సిద్ధులనుగూర్చి నేను రచించిన *సిద్ధప్పచరిత్రములో
కొంతవఱకు వ్రాసియున్నాను. నేఁడు నష్టప్రాయములైన
యోగశాస్త్ర రహస్యములనుగూర్చి చేయవలసినదియు,
వ్రాయవలసినదియు ఎంతయో ఉన్నది. ఎంత వ్రాసినప్ప
టికిని యోగ మనునది అభ్యాసమును వైరాగ్యమును
ముఖ్యముగా అపేక్షించుచున్నది. ఆచరణశూన్యములైన
శుష్కోపన్యాసములచేత ఫలము సిద్ధింపదని తెలియ
వ ల యు ను.

*ఈ గ్రంథమును సత్తెనపల్లిలోని శ్రీ జవంగుల నాగభూషణ
దాసు సన్నువారు ప్రకటించినారు.

అనేకులగు బ్రహ్మజ్ఞానులేమి, భక్తులేమి సాధారణ మానవులవలెనే మరణించుచుందురు. ఇట్టి వారిని గూర్చియే 'ఉమర్ ఖయ్యాం' అను పారశీక కవీంద్రుడు ఇట్లు వచించినాడు—

"అఖిల వేదాంతశాస్త్ర తత్త్వాబ్ధి లీది
పరమ విజ్ఞాన దీపకా పండితుండు
కాళరాత్రిని మార్గంబు గానలేక
అల్ల పామూలు కత సెప్పి యంతరించు."

—శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారి తెలుగు

కొందఱు మాత్రము తమ దేహావసాన సమయమును గుర్తించి, ఆత్మీయులైనవారికి ఆ ప్రాణప్రయాణ కాలమును దెలియఁజేసి పరమపదము నలంకరించుచుందురు. ఇట్టివారి సంఖ్యగూడ తక్కువే యనవచ్చును. యోగము పండిన సంయములకు తమ యాయుఃప్రమాణము తెలియును గావున, వారద్దానిని సూచింపఁగలరు. తక్కిన వారికి ఆజ్ఞానము లేకున్నను, వారు నిరంతర దైవధ్యాన పరాయణులై యుందురు గావున,

"అంతకాలే చ మా మేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః."

"మరణకాలమున నన్ను స్మరించుచు శరీరత్యాగము చేసిన వాడు నా భావమునే-అనగా దైవభావమునే పొందును" అను గీతాప్రమాణమునుబట్టి వారికిని ముక్తి లభించు ననుటలో ఆక్షేపము లేదు. కాని వీరయోగీశ్వరుని స్థితి యట్టిది కాదు. ఆయన కేవలము భక్తమాత్రుడు గాని, యోగిమాత్రుడుగాని, జ్ఞానిమాత్రుడుగాని కాడు గదా! ఆతడు యోగోద్ధారకుడగు మహానుభావుడు. ఆజన్మ బ్రహ్మజ్ఞానియే కాక, సాక్షాద్విరాట్పురుషుడగు పరబ్రహ్మము. ఇట్టని కాలజ్ఞానాది గ్రంథములు వాకొను చున్నవి. ఆ మహానుభావుని లీల లన్నియు ఈయంశ మునే చాటుచున్నవి. ఆ దేవుని ఉపాసించి తత్త్వ మును సాక్షాత్కరింప జేసికొన్న ఉపాసకులును అట్లే చెప్పుచున్నారు. ఇంతయేల, ఆయనయే స్వయముగా తన కాలజ్ఞానగ్రంథమున తన దివ్యావతార మహిమను వక్కాణించియున్నాడు గదా! కనుకనే జగద్విముక్తి కోస

మాయన తపోలోకమున కేగుచున్నాడా యనునట్లు ప్రాణములతో నుండియే దివ్యసమాధిలో ప్రవేశించి నాడు. నేటికిని ఆ మహాపురుషుడు ఆ సమాధిలో నున్నాడనియే పలువురి విశ్వాసము. నేటి మాటసంగతి మనకు దెలియకున్నను, గురుదేవుడు సమాధినిష్ఠ వహించిన సదవత్సరమువఱకును చెక్కుచెదరక జీవము లతో నిలిచియున్నాడని తరువాత దెలిసికొనగలము. అన్నపానీయములు లేక సంవత్సరకాలము సమాధిలో సజీవుడై యున్న యోగీశ్వరుడు చిరకాలమువఱకు ఉండుటలో ఏమి ఆశ్చర్యము ? కనుక, ఆ బ్రహ్మగురుని దివ్యలీలలు వాచామగోచరము లనుటకన్న "ఇద మిత్థ" మని చెప్పుటకు వీలుగాకున్నది. బ్రహ్మముగారికిని, తదితర మహాపురుషులకును ఉన్న ప్రధానభేదము లిట్టివే పెక్కులు పొడకట్టుచున్నవి. బ్రహ్మముగారి వలెనే ఆయనభార్య యగు గోవిందమ్మగారేమి, మనుమరాలగు ఈశ్వరమ్మగారేమి, ప్రధాన శిష్యుడగు సిద్ధప్పయేమి, సిద్ధప్పగారి శిష్యుడగు కరణము గోవిందయ్యగారేమి,

ఇంకను పెక్కుఁరు శిష్య ప్రశిష్య సంతానమేమి, తమ ఆయుఃప్రమాణమునెఱింగి, ప్రాణప్రయాణసమయమును తెలిసికొని, ఆ సంగతిని అగ్ష్టా లగువారికిఁ దెలిపి, జీవ త్సమాధినిష్ఠ వహించి తద్గురుసంప్రదాయమును పోషించిన వారే ! ఈ విధముగా వీరబ్రహ్మగురుఁడు నష్టమైన యోగము ననుష్ఠానపూర్వకముగా సముద్ధరించి మహా యోగోద్ధారకుఁడై ప్రకాశించినాఁడు.

మ త సా మ ర స్య ము

హైందవ మహమ్మదీయ సఖ్యమ్మ్మకొఱకు
సర్వ మానవ ధర్మంబు చాటిచెప్పి,
"అలకింపుఁ డమృతపుత్రు లంద" ఱనెడి
విశ్వ ధర్మ నిర్ణేత భావింతు నెపుడు.

వీరయోగీంద్రుని జీవితములోని ప్రముఖఘట్టము లలో నొక్కటి సిద్ధోపదేశము. సిద్ధప్ప మహమ్మదీయ మతమునకుఁ జెందిన బాలుఁడు. అయినను పూర్వజన్మ కర్మపరిపాకము ననుసరించి యాతనికి హిందూమత ధర్మ్ర ములు, సిద్ధాంతములు నచ్చినవి. 'ముడుమూల' కాఁపు

రముగా గల యీ బాలునకు అనతిదూరములో "కంది మల్లయ్యపల్లె" యందుండి యద్భుతచరిత్రుఁడై తేజ రిల్లుచున్న గురుదేవునందు చిత్తము హత్తుకొన్నది. తనకుఁ బొడమిన సంశయములను ఇస్లాముమతము కంజెను, హిందూమతమే సరసముగాఁ దీర్చజాలుట చేత ఆతఁడు గురుదేవుని చరణసన్నిధికే యాకర్షింపఁబడెను. అగ్రజాత్యభిమానముచేతను, లోకోత్తరమహనీయుఁడు తండ్రియగుటచేతను అన్యజాతులను నీరసముగాఁ జూచెడి బ్రహ్మముగారి పుత్రులు సిద్ధుని శిష్యత్వమునకు ప్రతి కూలు రైరి. మ్లేచ్ఛుని శిష్యునిగా నంగీకరింపఁ దగదని తల్లికిని దండ్రికిని అడ్డు చెప్పుచు సిద్ధుని వెడలనడపఁ బలురీతులఁ బ్రయత్నించిరి. కాని లాభము లేకపోయినది. బ్రహ్మగురుని బోధసుధ కుమారుల యభిప్రాయములకుఁ గృతకృత్యతను గూర్పలేదు. మానవుని గుణములకును ప్రవర్తనమునకునే ప్రాధాన్య మొసంగవలయును గాని, స్థూలదృష్టితో కల్పితములగు వెలుపలి భేదములకు స్థాన మిచ్చి, యున్నతికి రాఁదగినవారిని అణఁచివేయ రాదని

పక్షులుగూడ ప్రత్యక్షముగ సంభాషించు నప్పటికి పరమ మిత్రులై దాసానుదాసు లగుచుండెడువారు. ఇయ్యది వారి యుదారాశయముల మహిమము, వారి సమన్వయ శక్తిలోని ప్రభావము, వారొనర్చిన తపస్సులకు ఫలము కాదని యనఁజాలుదుమా ?

ఎవని యానతి యవన మహీశు లేని
ఆలరు లెత్తుగా శీర్ష ములందుఁ దాల్చి
పాలన మొనర్తు ధార్మికప్రభుత నెఱపి;
అట్టి గురునందు నా చిత్త మలరుఁగాక.

మానవులలో సాధారణముగానుండు నవగుణము లలో జాతిమతాంతరాసహన మనున దొకటి. ఉన్నత జ్ఞానోదయము కానంతవఱకును ఈ గుణమునుండి నరుఁడు విముక్తుఁ డగుట కష్టము. తనకు భిన్నజాతివానిని, భిన్న మతమువానినిగూడ తన సోదరునట్లు ప్రేమించు బుద్ధి దైవీ సంపద నొంది పుట్టినవారికిఁ గాని కలుగనేరదు. చరిత్రను బరిశీలించినయెడల ఆ యా కాలములం దా యా మతముల యున్నతికోసమై మానవసమాజ

మున రక్తనదులు స్రవహించుట, ఆ యా జాతుల యనైక మత్స్యము చే ప్రాణిజగము పీనుగు పెంటల కాకర మగుట మనము గమనింపఁగలము. జాతి మత వ్యర్థ ద్వేషములు నశించి దేశము కల్యాణమార్గమున పయ నించిన శుభదినములు కొలఁదిగమాత్రమే యుండగలవు. అట్టిది బుద్ధయుగములో కొంతకాలము గలదు. అద్వితీయ మగు ఆత్మప్రభావసంపదను డక్కఁగొన్న మహాపురుషుల కైనను ఈ మతసామరస్య సంపాదనము దుస్సాధ మైనట్లు చరిత్రపరిశీలనముచే మన మెఱుంగఁగలము. అయినను అట్టి వారి ప్రబోధవాణి జగమునకు అప్పుడప్పుడు అవసర మగుచున్నది.

సిద్ధప్ప తన మతమును వీడి వేదమతము నవలంబించుట ఆకాలమున "సిద్ధవటము" నవాబు సహింపలేక పోయినాఁడు. తాను పాలకుడైయుండఁగా పాలకవర్గమునకుఁ జెందిన జాతివాఁడిట్లగుటకు ఆతఁడు అసూయపడి ప్రతివిధాన మాలోచించెను. సిద్ధుని తనయెదుటికి రప్పించుకొని మతము మార్చుకొనుటకుఁ గల హేతువుల

నడిగినాడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడగు సిద్ధకుమారుడు సహజ వాగ్విలాసముతో ఉపనిషన్మతమునందలి పరమ సత్యసిద్ధాంతములను హృద్యముగా నుపన్యసించి, నవాబు హృదయము నాచికొనెను. పూర్వజన్మ సంస్కారము లనుబట్టియు, మనఃపరిపాకము ననుసరించియు ఒక వ్యక్తి స్వాభ్యుదయముకోసము ఇష్టమగు మతము నవలంబించుట దోసము కాదనియు, నరునకు సర్వసంశయములను ఛేదించి పరమాత్మ సాక్షాత్కార ద్వారమున ఆత్మ శాంతినిగూర్చు మతము ఏదైనను ఆరాధ్యమే యనియు, మతమును ఐహిక ప్రయోజనమాత్ర సాధనముగా భావించుకొన్నప్పుడే రాగద్వేషములు కలిగి సంఘమున 'కల్లోల' మారంభ మగుననియు అనేకోదాహరణము లతో నాతనికి నచ్చజెప్పి యంగీకరింపఁ జేసెను. ఎట్టకేలకు సిద్ధోపదేశముచేత సంతుష్టుడైన నవాబు తన్మయుడై వీర గురుదేవునిగూడ రావించి పూజలు సల్పి, సర్వ మత జాతి సామరస్య సిద్ధాంతములను ఆయనచే నుపదేశింపఁ బడెను. నవాబు ఆ సద్గురూత్తముని బోధకు సంతసించి

మడులో, మాన్యములో, అగ్రహారములో కోరుకొమ్మ నెనుగాని, గృహస్థసన్న్యాసి యగు గురుదేవుఁడు అట్టి వానిని గోరక, కందిమల్లయపల్లెలో మఠమున కనువగు నేలను మాత్రమే ఆతని ప్రార్థనమువలన నంగీకరించెను.

వీరేశ్వరుని దినచర్యలలో తెలుఁగునేల నాలుగు చెఱఁగులఁ దిరిగి ధర్మప్రబోధ మొనర్చి యావల యావ ద్భారత పర్యటన మొనర్చుట యొకటి గావున, అమ్మహా నుభావుఁ డొకసారి సశిష్యుఁడై కర్నూలునవాబునొద్ద కేగి యాధ్యాత్మికోపదేశముల నొనర్చెను. అందు ముఖ్య ముగా వేదాన్తము బోధించుచున్న పునర్జన్మసిద్ధాంతము, కర్మవాదము, జన్మరాహిత్యము, ముక్తి, తత్సాధనము లగు భక్తి జ్ఞాన కర్మ యోగమార్గములు అనువానిం గూర్చి కర్నూలునవాబు నాస్థానములో మహాల్వీలకును వీరదేశికునికిని కొన్నిదినములు అద్భుతములగు వాదోప వాదములు జరిగెను. మహామహిమాభిశోభితుఁడును సహజానుభవజ్ఞాన విలాసుఁడును నగు గురుమూర్తి నవాబునకు గల్గిన సందేహముల నన్నింటిని దూరీక

రించుచు, వేదాన్త సిద్ధాంతమును ఆతని బుద్ధికెక్కునట్లు బోధించెను. తుట్టతుదకు గురుశిష్యులిద్దఱును రాజధర్మములను, మానవధర్మములనుగూర్చి బోధించి మానవ సంఘమునలో శాంతి, అభ్యుదయము, స్నేహము నెల కొనుటకు దగిన పాలనా విధానములనుగూడ నవాబున కెఱుక చేసిరి.

పుష్పగిరిపీఠసంస్కరణము

గురుదేవుని యవతారోద్దేశ్యములలో పీఠాధిపతులను సంస్కరించి, పీఠములను ధర్మ జ్ఞాన ప్రబోధకము లుగా నొనర్చుటొక్కటి యని పాఠకులకు ఇప్పి యుండ వచ్చును. ఆ కాలమున అతిసనాతనములగు గాయత్రీ, సావిత్రీ, సరస్వతీ పీఠములును, శ్రీ శంకరభగవత్పాదుల నాటి నుండి ప్రచారమునకువచ్చిన శృంగేరీ పుష్పగిర్యాది పీఠములును బహుళ ప్రచారములో నున్నవి. గాయ త్ర్యాది పీఠములు విశ్వబ్రాహ్మణుల పాలనమునందును, శంకర పీఠములు కొన్ని వైదిక బ్రాహ్మణుల పాలనము నందును నున్నవి. పుష్పగిరిలోని శంకరపీఠము వీరదేశికు

నికి సమీపము. ఆ కాలపు పుష్పగిర్యగ్రహారికులు వేద విద్యాదర్పముచేతను, ఉన్నత జాత్యభిమానముచేతను స్వధర్మమునకు దూరులై శంకరోక్తధర్మముల విస్మరించి తిరుగుచుండిరి. ఈ పరిస్థితులలో ఒకనాఁడు సకుటుంబుఁడు సశిష్యుఁడు నగు వీరగురుఁడా యగ్రహారమునుండి కడపకు బోవుచుండెను. ముందు సిద్ధుఁడు ఈశావాస్యోపనిషత్తును పారాయణ మొనర్చుచు నడచుచుండెను. పుష్పగిరిలో బ్రవేశించునప్పటికి విప్రు లడ్డగించి జాతి మతముల నడిగి కలహము పెట్టుకొనిరి. సిద్ధుడు వారి ప్రశ్నముల కన్నింటి కిని దగిన సదుత్తరములను శ్రుతిప్రమాణ సహితముగా నిచ్చుచుండెను. పండితుల కీతని వాగ్ధోరణి యసహ్య మయ్యెను. తమ కోపు తగ్గిపోవుటకు మఱింత మండిపడు చుండిరి. నోటికి వచ్చినట్లు వీరగురుదేవునిగూడఁ దూల నాడిరి. ఇంతలో గోవిందమాంబాసమేతుఁడై శిష్యులతో గురుఁడును వచ్చెను. కులభేదమునుగూర్చిన గుణకర్మవాద రహస్యమును గురు లుగ్గడించిరి. ఉభయులను శాంత పఱుపఁ జూచిరి. పండితమ్మన్యుల యుద్ధతి నిందావాక్య

ములతోనాగక శిలావర్షమునుగూడఁ గురిపించెను. అమ్మ్ల వాడికిఁ గూడ ఱాయి తగులుటచే సిద్ధుఁడు కుపితుఁ డైనాఁడు. బ్రహ్మహృదయము చంద్రోదయారంభమున అంబురాశివలె నించుక కలంగినది. పుష్పగిరి గ్రామమున హుతాశనచ్ఛట లావరించినవి. గొల్లుమనిగోల అగ్రహార మంతయు వచ్చి దేశికేంద్రుని చరణముల వ్రాలినది. వృద్ధపండితులు ఉద్ధతపండితులను మందలించి "గురుచరణం మమ శరణం" అనిపించిరి. అగ్ని హోత్రుఁ డాత్మలీలను ఉపసంహరించినాఁడు. గ్రామము తగులఁబడ్డదా? లేదు. అంతయు యథాపూర్వమే!

పీఠాధిపతులతోఁగూడ పండితమండలికి ఉపనిష త్తత్త్వోపదేశము చేసినాఁడు గురుప్రభువు. అనేక ప్రశ్న ములు. అన్నింటికిఁ దగిన సమాధానములు. ఆ నాఁడు పుష్పగిరిలో వేదాన్తసూత్రసారము కాలువలుగట్టి ప్రవ హించినది. నగరమంతయు నూత్నశోభను సంతరించు కొన్నది. ప్రతివాని హృదయమును పరమాత్మనిసన్నిధా నమునకే చెంగలించినది. ఎల్లరిచూపులును గురుదేవుని పాద

కంజములందే వ్రాలినవి. ఇట్టి మహాయోగీశ్వరునికి, జ్ఞానికి, కర్మయోగికి అర్హమగు పూజ యేది! పీఠాధిపతులయాజ మాన్యమున అఖండ బ్రహ్మరథ మహోత్సవము స్వస్తిమంత్ర పాఠములతో సాగిపోయినది. పీఠాధిపతుల ధర్మమును సాంగముగ నుపదేశించి గురుదేవుడు ఉత్తమ సంస్కారమొనర్చెను. శంకరహృదయమును అనుసరింపఁ బ్రబోధించి గురువులకుగూడ గురూత్తముఁడై గురుచక్రవర్తి తేజరిల్లెను. పీఠాధిపతులగు గురువులకుగూడ కర్తవ్యోప దేశమొనర్చిన యీ యొక్క యంశమే గురుదేవుఁ డవ తారమూర్తి యని చాటఁ జాలును. పుష్పగిరిపీఠమునకు గురుడొనర్చిన సంస్కారబోధ సాటిలేనిది. దానిని సమస్త పీఠాధిపతులు అనుసరించినచో, పీఠములు ప్రజాసంస్కరణ సాధనములై ప్రజోపకార సమర్థములై తేజరిల్లఁగలవు.

"నిందగొనుమాత్రఁ బురమెల్ల నిండె నగ్ని
పదము పట్టినమాత్రానఁ బఱచె నౌర!
అకటకట కర్మమహిమ నేమనఁగవచ్చు
నన్నిటికి సాక్షి యీశ్వరుఁ డతఁ డొకండె."

—శ్రీ నిరంజనశాస్త్రిగారి కల్యంధకౌముది.

గు రు దే వు ని వే దా ం త ము

"అనధిగతే వేదాన్తే కలిమలకలుషే జనే సదా చరతి
వీరబ్రహ్మాభిధయా సమజని లోకే హి శాంకరం తేజః."

—శ్రీపుట్టపర్తి నారాయణాచార్యులుగారు.

వేదాంత తత్త్వము తెలియఁబడక కలిదోషమలిన చిత్తులై జనులు చరించునప్పుడు, పరమశివతేజము వీర బ్రహ్మనామముతో లోకమున అవతరించెను.

బ్రహ్మముగారు ప్రబోధించిన వేదాన్తసిద్ధాంత మేది ? ద్వైతమా ? అద్వైతమా ? విశిష్టాద్వైతమా ? శైవమా ? వైష్ణవమా ? తదతీతమా ? సగుణమా ? నిర్గుణమా ? అచలమా ? అని పలువురు పలురీతుల ప్రశ్నించుచుందురు. బ్రహ్మగురుని బాల్యకాలము శైవ సంప్రదాయమునకు చెందిన పాపాగ్నిపీఠ పాలకులవద్ద గడచినదని మన మెఱింగియేయున్నాము. ఈ పాపాగ్నిమఠము కన్నడదేశమునందలి చిక్కబళ్లాపుర ప్రాంతమున నున్నది. కర్ణాటకము వందల సంవత్సరముల నాఁడే బసవేశ్వరుని శైవమతముతో నిండిపోయిన దనుట విస్పష్టము. ఆకారణ మునఁగాని, సహజముగా ఆయనలో శైవ వైష్ణవాంశ

ములు కలసియున్నందునఁగాని గురుదేవుఁడు శైవాచార పరాయణుఁడు గానే కన్పట్టుచున్నాఁడు. అయినను వైష్ణవ పరాఙ్ముఖత్వము లేదు. పెక్కు కాలజ్ఞానగ్రంథ ములు గురుదేవుఁడు విష్ణ్వవతారమని గూడ వాకొను చున్నవి. అంతమాత్రముచేత శైవమత పరాఙ్ముఖత్వము గూడ ఆయనలో అగపడదు. అల్లాడుపల్లెలో వీరభద్ర స్వామిని ప్రతిష్ఠించి ఉపాసించుట, విభూతి రుద్రాక్ష మాలా ధారణాదులు, దేవీపూజా పంచాక్షరీ మంత్రోపాసనాదులు ఆయన శైవాచార సంప్రదాయమునకు నిదర్శనములు. ఆయన అవతారోద్దేశ్యములలో యోగోద్ధరణముకూడ ఒక్కటిగైనందున, సర్వయోగీశ్వరేశ్వరుఁడగు పరమశివునిమీఁద ఆయనకు ప్రీతియుండుట సముచితముగానేయున్నది. యోగులకందఱికిని శివతాత్పర్యముండుట సహజమే కావున, శిష్యశిక్షణార్థముకూడ ఆయన శివప్రీతిని ప్రకటించినాఁడనవచ్చును. గురుదేవునిలో "శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే" అన్న శివకేశవాభేదజ్ఞాన మొక్కటే పాదుకొని లేదు. "ఏకం సత్

విప్రా బహుధా వదన్తి" అన్న పరమాద్వైత బ్రహ్మ భావమే తావు చేసికొని యున్నందున, ఆయన శివ కేశవా దులయెడనే కాక, తక్కిన సర్వదేవతలయందును పరమ నిర్గుణ బ్రహ్మభావమునే కలిగి యున్నాఁడనుట రహస్యము. తాను తపస్సు చేసికొనుటకు నిర్ణయించుకొన్న ప్రదేశము 'హరిహరపుర' మగుటగూడ పై యభిప్రాయమునే బలపఱచుచున్నది. మాయాకల్పితములగు నామ రూపములకు గురుదేవుని దృష్టిలో ఎప్పుడును ప్రాధాన్యము లేనేలేదు. ఆయనకు పరమారాధ్యమైన తత్త్వము సచ్చిదానంద ఘనమైనట్టిది. అది ఏ రూపములోనున్నను, ఏ నామముతో పిలువఁబడుచున్నను, ఉపాసకులు రాగ ద్వేషములు పూనక, దాని నారాధింపవలయుననియే గురు చంద్రుఁడు ప్రబోధించుచుండువాఁడు. సగుణ నిర్గుణా రాధనములయెడఁగూడ అమ్మహనీయునికి సమానభావమే కలదు. సాధకుల మానసిక స్థితినిబట్టి ఆ యా తత్త్వ ములు ఉపాస్యము లగుచుండునని యెఱింగిన తత్త్వజ్ఞులు దేనినిఁగూడ చిన్నచూపు చూడరుగదా! మహామ్మ

దీయాది మతములయెడనే సామరస్యము ప్రకటించు మహనీయుడు ఒక్క వైదిక మతములోని అల్పాల్ప భేద ములకు ఆదరానాదరములను చూపునా ? పరిపూర్ణజ్ఞాన సంసిద్ధిని పొందిన మహనీయు లెప్పుడును భేదాతీతులు గానే సంచరించుచుందురు. కొందఱు గురుదేవునిది అచల మతమని తలంతురు. ఆ యభిప్రాయముగూడ పూర్ణ సత్యము గాదు. ద్వైత విశిష్టాద్వైతములయెడ వైతము గురుదేవునికి నిరసనభావము లేదు. అవి యన్నియు సాధ కుల అధికారమును బట్టి ఆచరింపదగిన పలు దశలని గురు దేవుని యభిప్రాయము.

ఈయన కిష్టమైన తత్త్వమార్గము ఉపనిషత్ప్రతి పాద్యమైన అద్వైత సిద్ధాంతమే. ఏ యద్వైత సిద్ధాంత ప్రచారముకోసమై శంకరులు ప్రస్థానత్రయమునకు భాష్య ములు వ్రాసియున్నారో, అదే గురుదేవుని కిష్టమైన వేదాన్తసిద్ధాంతము. నిర్గుణ తత్త్వ ప్రధానమగు నీయన వేదాన్తము సగుణులైన ఆ యా దేవతల పారమ్యమును దాటి "అహం బ్రహ్మాస్మి" అన్న మహావాక్యములో

అనుభవరూపమున సమన్వయించుచున్నది. 'ప్రజ్ఞానం బ్రహ్మ' (ప్రజ్ఞానమే బ్రహ్మస్వరూపము) 'అయ మాత్మా బ్రహ్మ' (ఈ ఆత్మయే బ్రహ్మము) 'తత్త్వ మ సి' (ఆ అఖండబ్రహ్మము నీవే) 'అహం బ్రహ్మాస్మి' (నేను బ్రహ్మమును) అన్న మహావాక్యార్థములు సర్వవేదాంతుల కును తెలిసికొనఁదగినవి; అనుభవమునకు తెచ్చుకొన దగి నవియై యున్నవి. మహావాక్యప్రధానమగు నా యద్వైత వేదాంతమునకు యోగముతో పొత్తు గూర్చి గురుదేవుఁ డొకవిశేషమును సంపాదించినాఁడు. ఈ యోగ, వేదాన్త ముల కలయిక సాధక ప్రపంచమునకు వెలలేని ఫలమును పండించి యిచ్చినది. శుష్క వేదాంతము కూలిపోయి అనుష్ఠాన పూర్వక వేదాంతప్రజ్ఞ వికసించినది. కావుననే గురుదేవుని వేదాంత సంప్రదాయమునకు చెందినవా రందఱు తమ ప్రాణప్రయాణ సమయమునెఱింగి జీవనముండ గనే సమాధులలో ప్రవేశించినారు. జ్ఞాన, యోగ ప్రధాన మైన ఈ తత్త్వమార్గములో వైదికమగు కర్మకాండమునకు చోటు లేదు. మంత్రానుష్ఠాన దేవతారాధన రూపమైన

ఉపాసనకు మాత్రము కొంతవఱకు తావున్నది. ఇందు ఆత్మసంస్కరణమునకు, ఆత్మజ్ఞానమునకే ఎక్కువ ప్రాధాన్యము. గురుదేవుని వేదాంతసిద్ధాంతములు, మంత్రయోగానుష్ఠానాది సాధనవిశేషములు, ఆయన ప్రాసిన "కాళికాంబ హంస కాళికాంబ" అను మకుటముగల పద్యముల లోను, పెక్కులగు గేయములలోను, వచనములలోను విస్తరింపబడి యున్నవి. మచ్చున కొకటిరెండు చూతము.

"బ్రహ్మ మనగ వేఱె పరదేశమున లేదు
బ్రహ్మ మనగ జూడు బట్ట బయలు
తనకుతానె బ్రహ్మ తారక మవు నయా
కాళికాంబ హంస కాళికాంబ ! "

"అంతా బ్రహ్మమయం బని
సంతసమున దిరుగువారు సర్వజ్ఞులు ; శ్రీ
కాంతునికృపచే వారికి
చింతలు లేవయ్య ! యోగసిద్ధులు సిద్ధా !
సంసారిగా నుండియు సర్వము బ్రహ్మమయమను

నారూఢ జ్ఞానముగలవాఁడే రాజయోగియని దిగువ పద్య
ములో వాకొనుచున్నాఁడు—

"సంసారమందు నుండియు
సంసారము మిథ్య జేసి సర్వము తానై
సంసారంబును గెలిచిన
సంసారే రాజయోగి సత్యము సిద్ధా ! "

వీరగురునికి శక్తిమంతములగు బీజాక్షరములతో
గూడిన మంత్రములపైఁగల సదభిప్రాయము ఈశ్వరమ్మ
గారు చెప్పిన దిగువవాక్యములలో స్పష్టమగుచున్నది.
"భక్తిగలిగి మనసందున మంత్రము మానకన్నడపండున్నాడు.
మంత్ర తంత్రములు మాయగాదు ఇక మర్మంబిది యని
యన్నాడు.

తెలిసిన భక్తులు తెలియనివారికి జ్ఞానము తెలుపండున్నాడు.
రేయి పగలు మా ద్వాదశాక్షరీ మంత్రము నడపం-
డన్నాడు."

గురుదేవునికిఁ గల ఈ తత్త్వదృష్టి ఆ నాఁటి
పీఠాధిపతులకు లేదు. వారు స్వార్థపరులై గుణకర్మములకు

ప్రాధాన్య మీాయక ప్రజలను బెల్లించుకొని తినుచుండిరి. ఇట్టి పీఠములను సంస్కరింప వీరదేశికుడు దీక్ష పూని నాడు. ఈదీక్షలో ఆయనకు పుష్పగిరిలోని శంకరపీఠము మొట్ట మొదటి రంగస్థల మైనది. ఈ సందర్భమునసే ఈతడు శంకరమార్గమును ఖిలము గానీక రక్షించినాడు ఉదయలయును. తన కాలమున వేదాన్తమునకు బాటిల్లిన దుర్గతిని బోనణచి, సామాన్య ప్రజలకుగూడ యోగ వేదాన్త రసాయనము నొసంగి జ్ఞానబలసంపన్నుల నొన రించుటకే ఆయన తేటతెలుగున తత్త్వసారస్వత నిర్మా ణము చేయవలసివచ్చినది.

వేదాంత సారస్వత సృష్టి

ఎవడు శ్రుత్యంతముల నెల్ల నేర్పటించి
తెలుగు "తత్త్వాల" లోడ బ్రబోధించినాడో,
ఆ త్రయీమూర్తి రుచిర పాదాబ్జసీమడ
కేరి నటియించుడ గాత నా చిత్తభృంగి.

సహజకవియగు గురుచంద్రుడు వాఙ్మయవిషయ మున నొనర్చిన సేవయు అమూల్య మైనట్టిదే. ప్రాచీన

కాలమునుండియు వేదాంతార్థములు సంస్కృతభాషలో నుండి బోధింపఁబడు చుండెడివి. తెలుఁగులో మార్గకవిత వెల్వడి పురాణాది గ్రంథములు తెనిగింపఁ బడిన నాఁటి నుండియు కొంతవఱకు సంస్కృతాపేక్ష సడలినను, ఆ గ్రంథార్థములుగూడ భాషాజ్ఞానము కలవారికే తెలియ వీలగునట్లుండెను. అయినను తెలుఁగుసీమలో మొదటి నుండియు, ద్విపదలు, రగడలు, ఏలలు, పదములు, తత్త్వములు అనుపేళ్లతో కొన్నివిధములగు గేయములు ప్రచారములో లేకపోలేదు. ఈ గేయసారస్వతమును పద కవిత్వమనియు పేర్కొందురు. జనసామాన్యమునందు విషయవ్యాప్తిని చేయుటకును, బహుళ ప్రచారమునకును ఈ విధమైన రచనలే తగినవైయున్నవి. ఎట్టి గంభీరార్థము నేనియు జానుతెనుఁగున పైని చెప్పిన గేయములలో నిబంధించినయెడల, అవి సజీవములై జనసమూహమున నాటుకొని పోయెడివి. ఈ యంశమును గురుదేవుఁడు గుఱుతించినాఁడు. వేదములయందును, ఉపనిషత్తుల యందును, తదితర దర్శనాది గ్రంథములయందును గలు

వేదాన్తరహస్యములను ఏలలలోను, తత్త్వములలోను, కందము, ఆట వెలఁదులవంటి చిన్న చిన్న పద్యముల లోను ప్రవచించి శిష్యసంతానద్వారమున ప్రచార మొనర్చినాఁడు. "నేనే బ్రహ్మమురా ! పామరులార ! నేనే బ్రహ్మమురా" అని చెప్పగలిగిన వీరగురుని తత్త్వ సారస్వతాంధ్రీకరణ మార్గము లోకోత్తరమైనది. దానిని పూర్తిగా ఈ చిన్నిపుస్తకమున వివరింప వలనుపడదు. గురుపాదుల యడుగుజాడలను బట్టియే సిద్ధప్పయు గొప్ప తత్త్వ వాఙ్మయమును జానుతెనుఁగులో సృష్టించి చెన్నొందినాఁడు.

వీరగురుఁడు ప్రాచీన తత్త్వ వాఙ్మయమును తేఁట తెనుఁగున వ్రాయుటేకాక, ఆ కాలపు ప్రజలలోనున్న మూఢవిశ్వాసములను, కల్పిత సిద్ధాంతములను ఖండించుటకుఁగూడ, మనోహరములగు పాటలను, గేయములను సంవాదరూపముగాఁగూడ రచించెను. ఇట్టి వానిని నేఁటికిని బిచ్చగాండ్రనోటను, బైరాగులనోటను మనము వినుచుందుము. పామరులనోటఁబడి అవి తమ కలరూపును

గూడ గోల్కోండ విక్రమములయినవి. గురుదేవుని రచన లలో "కాళికాంబ హంస కాళికాంబ" అను మకుటముతో నున్న పద్యములు, 'సిద్ధా, కాళి' అన్న సంబోధనములతో నున్న పద్యములును సుప్రసిద్ధములయినట్టివి. గోవింద వాక్యములయు, కాలజ్ఞానతత్త్వములయు ప్రసిద్ధి ఇంతింతని చెప్ప నలవికానిది. త్రికాలజ్ఞుడగు గురుమూర్తి అత్యాశ్చర్యకరములగు భవిష్యదంశములనుగూడ పెక్కింటిని తన రచనలలో నిమిడ్చి ప్రచారముచేసెను. ఈ నాడు జరుగు చున్న సాంఘిక పరిణామములు, రాజ్యాంగ పరిస్థితులు, ప్రజలమనోభావములు, మతకలహాములు, నానావిధ సాంకర్యములును వీరగురుని తత్త్వవాక్యములలో మన మూరయగలుగుదుము. సంఘములోని మూఢాచార విశ్వాసములను, అర్థరహిత సంప్రదాయములను మోమోటపడక ఖండించినవారిలో వీరబ్రహ్మము వలె వేమనయోగియు అగ్రేసరుడే. ఈ యోగీశ్వర సార్వభౌమద్వయముతోడ బోల్పదగినవారు ఆంధ్రదేశములోనే కాదు, భారత దేశమునందును ఎందఱుందురో ! కబీరు మున్నగువారు

కొలదిపాటిగపూ త్రమే యుందురు. కో. శే. కట్టమంచి రామలింగారెడ్డిగారికి ఈ యోగిద్వ్యయమువీాద అపార భక్తిగౌరవము లుండెడివి. వీరిసారస్వతమును ఆయనఎంత గానో ప్రేమించెడివాీడు. మన దురదృష్టవశమున వీర బ్రహ్మ వాఙ్మయము సురక్షితము కాలేదు. వేమన యోగీశ్వరుని పద్యవాఙ్మయము కొంతకుీ గొంతయైనను నేీడు చిక్కినది. ఈ నాీటికైనను వీరగురుని తత్త్వ సారస్వతమును సంపాదింపీ బూనుకొన్నచో కొంత యైనను దొరకక పోదు. ఈ కార్యమునకు కందిమల్లయ పల్లెలోని బ్రహ్మముగారి మఠాధిపతులు శ్రద్ధ చూపినచో పని సాీగీ గలదు.

నేీడు మనకు దొరకిన వాఙ్మయ మంతయు వీర గురునిదో, ఆయనగారి శిష్య ప్రశిష్య వర్గముదో అయి తీఱునని మనము భ్రాంతిపడరాము. ఇంను ఆ యీా కాల ములయందు ప్రక్షిప్తమైన భాగము కొంతయుండవచ్చును. ఈ ప్రక్షిప్తమను దుర్దశ ఏమహారచయిత వాఙ్మయమున కైనను బట్టుట వింతకాదు. స్వార్థపరులు తమ విచిత్ర

సిద్ధాంతములను, విపరీతోద్దేశ్యములను మహాత్ముల యండ దండలతో ప్రచార మొనర్చుకొనినెంచి, ప్రతిష్టకార్య చతురులై పుణ్యము గట్టుకొందురు. అయినను గురుదేవుని సంపూర్ణజీవిత పరిచయముచేతను, మఠములో సురక్షితములై యున్న కాలజ్ఞానాది గ్రంథముల సాయముచేతను దొరకిన వాఙ్మయములోని పొల్లు నేరి, మంచి సరకును సేకరించుకొనవచ్చును. ఇందుకు సమర్థులు తత్త్వజ్ఞులునగు పండితులు పూనుకొన్న కార్యము నెఱవేఱగలదు.

ఉపమానమును మాత్రమే చెప్పి ఉపమేయమును తోఁపింపఁజేయుట రూపకాతిశయోక్తి యందురు. బ్రహ్మముగారి గద్య పద్య గేయములు పెక్కులు రూపకాతిశయోక్తిలోనే యుండును. ఒక తత్త్వములో "మూడు కాల్వలు దాటలేరన్న ఈ మూఢజనులు మూడు కాల్వలు దాటలేరన్న" అన్నాఁడు. అందలి మూడుకాల్వలనెడి ఉపమానముచేత ఇషణత్రయమును, అనఁగా ధనేషణము (డబ్బుమీఁదికోరిక) దారేషణము (భార్యమీఁదివాంఛ) పుత్రేషణము (బిడ్డలమీఁది కోరిక)

అను ఉపమేయ పదార్థములను గ్రహింపవలసి యున్నది. అ క్లే ఇంకొకచోట "మూడారు వాకిళ్లు మూయవలెనన్న" అనును. అచ్చటి వాకిళ్ళనుమాట శరీరములోని నవరంధ్ర ములను సూ చిం చు చున్నది. ఇంకొకచోట "ఆరిటి మీదనె చిద్రూపం" అనును. అక్కడ ఆజ్ఞనఁగా ఆధా రాది షట్చక్రములని తెలియవలయును. ఆధారాది షట్చక్రములను దాఁటి, ఏడవదగు స హ స్రా ర ము న కేఁగిననే కదా సాధకుఁడు చిత్కళా సందర్శనము చేయు నది! (శ్రీ) వేలూరి శివరామశాస్త్రిగారు కోలవెన్ను పర బ్రహ్మతీర్థులవారి 'జగచ్చిల్పగ్రంథము' న కభిప్రాయము వ్రాయుచు "బ్రహ్మంగారి రూపకాతిశయోక్తియు. (Mysticism)వ్యతిరేకలక్షణయు అన్యదుర్లభములు" అని పలికినారు. ఇది ఎంతయు సత్యము. కావుననే (శ్రీ) వారి వాక్యములకు పెక్కింటికి అర్థము తెలియక పాఠకులు చిక్కువడుచుందురు. ఈ సందర్భమున గురుదేవుని ఒకటి రెండు తత్త్వము (గేయము)లను చవిచూచుట అప్రస్తు తము కాదు.

రాగము: నాదనామక్రియ. ఏకతాళము

ఆనందమయుడు గావలెను-పూని,
తాను తానైయున్న తావు గనవలెను. ॥ఆ॥

కామమును కడకొత్తవలెను-అప్పు,
సామజములమదము సమయింపవలెను. ॥ఆ॥

ప్రేమ సద్గురు జేరవలెను-దుప్పు,
తామసపు దుర్గుణము తొలగింపవలెను. ॥ఆ॥

సత్యమే మది నిల్పవలెను-అ
సత్యదేహాముమీద ఆశ విడవలెను. ॥ఆ॥

భక్తి మదిలో నిల్పవలెను-జీవ
న్ముక్తిమార్గము తాను ముందెఱుగవలెను. ॥ఆ॥

అక్షరాత్మకుడు కావలెను- మూడు
అక్షరములభావ మది తెలియవలెను. ॥ఆ॥

దీక్షాధికారి గావలెను- జన్మ
మోక్షకాంక్ష గురుని పూజింపవలెను. ॥ఆ॥

నిద్రరాకడ తెలియవలెను-పైని,
భద్రముగను యోగనిద్ర పోవలెను. ॥ఆ॥

చిద్రూప మపుడె కనవలెను-భద్ర
ముద్ర కీలెటిగి సద్గతిఁ బొందవలెను. ॥ఆ॥

వేష భాషలు మానవలెను-తన్ను
దూషించినవారి భూషించవలెను. ॥ఆ॥

చూపు మనసొకటి చెయవలెను-సర్వ
వ్యాపకుండౌ చిన్మయాత్మ్ గనవలెను. ॥ఆ॥

మేడమీదికి జేరవలెను-అచట,
జోడుబాయక హంస గూడగావలెను. ॥ఆ॥

తత్త్వం

శివపంచాక్షరి మంత్రం పరశివయోగులకే జపసూత్రం,
అవిరళయోగం బందినవారికి ఆరిటిమీదనె చిద్రూపం॥శి॥
అయిదుముఖంబుల పెరిగిందీ, అయిదక్షరముల అమరిందీ,
అయిదయిదులు ఇరునదిహైదా అఖండతేజం బీమంత్రం॥శి॥
మూడుత్రోవలది సాకారం, మూటినడుమనే శ్రీకారం,
చూచేదంతయు సాకారం చూపునిలిపితే నిరాకారం ॥శి॥
సుషుమ్నాంతమున గురుతేజం, అష్టకమలమున శివరూపం,
సహస్రారమున పరబ్రహ్మ శ్రీగురువీకేశుని ఘనతేజం॥శి॥

త త్త్వం

మాయను నటికినవాడు, గురు
రాయనిచో జతగూడు;
పాయుచు విషయము రోయుచు త త్త్వము
ఏయెడ జూచిన ఏకము తానై. ॥మా॥
కుండలి నిటు భేదించి, అ
ఖండముగను భావించి,
అండ పిండ బ్రహ్మాండములంతట
నిండి పండి యా నిర్వికల్పమున. ॥మా॥

ఈ శ్వ ర మ్మ గా రు

ఆదిశక్తియగు జగదీశ్వరి అపరావతారమని ప్రసిద్ధి గన్న ఈశ్వరమ్మను మన మింతవఱకు దర్శింపలేదు. ఈమె గురుదేవుని పెద్దకుమారుఁడగు గో వి ం ద య్య గా రి కూఁతురు; అఖండ బ్రహ్మవాదిని. తాతగారగు జేజి నాయనకు పలువిషయములందు సాటిలేని స ల హా ల నిచ్చుచు, వేదాన్తప్రచారమునకు తోడ్పడిన మహాయోగిని ఈమె. ఈమె దాదాపు నూఱేండ్లకాలము జీవించి, జీవిత

కాలమంతయు బ్రహ్మచారిణిగానే గడపినది. తనకు వివాహ మక్కఱలేదనియు, తన యవతారోద్దేశ్యమును తాను నిర్వ హించుకొనుటే తన లక్ష్యమనియు ఈమె ప్రజాసేవ యెొనర్చి కృతార్థురాలయినది. ఈమె అవివాహిత యైనందు వలనఁగూడ బ్రహ్మముగారి కుటుంబము సాంఘికముగా కొన్ని యిక్కట్టులకు గుఱికావలసివచ్చినది. ఆ కాలమున స్త్రీలు అవివాహితలై యుండునాచారము లేదు కదా ! పైపెచ్చు ఎనిమిదేండ్లకే పెండ్లిచేయు నాచారముండెడి దాయెను. ఇట్టి స్థితిలో దేశసేవాతాత్పర్యముతో ఉండఁ గలిగిన స్త్రీలు, బ్రహ్మచారిణులయి యుండవచ్చునని ఈశ్వరీదేవి తన్నే దృష్టాంతముగా నిరూపించి, ఒక మహానీ యాపర్యమును స్థాపింపఁగలిగినది.

ఈశ్వరమ్మగారుగూడ గద్య పద్య గేయ వచన రూపమైన తత్త్వసారస్వతము నెంతయో నిర్మించినది. స్త్రీ జనాభ్యుదయమున కనువగు పాటలు, ఏలలు వ్రాసినది. తన పితామహునివలెనే ఆమెకూడ భవిష్యద్విషయము లతో నింపిన కొంత కాలజ్ఞానమును రచించినది. ఒక్క

ఈశ్వరమ్మయే కాదు; వారిభార్యగోవిందమ్మ, కుమారులుగూడ కొన్ని రచనలు చేసినారు. వేయేల ! (శ్రీ) వారి కుటుంబ మంతయు మానవ సంస్కృతికి అవసరమగు వాఙ్మయమును నిర్మించి సారస్వతసేవ చేసినట్టిదే. ఈ వాఙ్మయ మంతయు పరిశుద్ధమగు వ్యావహారిక భాషలోనుండి, పండితపామరుల ధన్యవాదముల కర్హమైయొప్పుట నేటి సారస్వతోపాసకులు గర్వింపదగిన యంశము. దరిదాపు నాలుగు వందల యేండ్లనాడే భాషాసంస్కారమునకు ద్రోవచూపి, రెండవ వాగనుశాసనుడును, కవి బ్రహ్మయు నై యొప్పిన గురుదేవుని సారస్వతసేవా ఫలము ఈ నాటి తెలుగువారి నాలుకలపై నిండు తేనె వాకలను జాలువార్చు ప్రయత్న మవసరము కాదా ?

ఈశ్వరీదేవి ప్రశంస వచ్చినదికాన ఒక యంశము నిచ్చట తడవక తప్పుట లేదు. ఇప్పటికి బ్రహ్మముగారి చరిత్రమును వ్రాసిన కొందఱు రచయితలు ఈశ్వరమ్మ బ్రహ్మము సమాధియైన పిమ్మట పుట్టినదని వ్రాసియున్నారు. బ్రహ్మముగారి నాటకమును (యఱుగానము)

వ్రాసిన కీ. శే. కడియాల వీపూరయాచార్యులవారు మాత్రము ఈశ్వరి బ్రహ్మము సమాధి కాకముందే పుట్టినదని వర్ణించియున్నారు. బ్రహ్మముగారి చరిత్ర రహస్యములను పెక్కింటిని నాకు ఉపదేశించిన నా పితృ దేవులును అట్లే భావించినారు. నాకును అదే సత్యమని తోచినది. దీనికిందోడు ఇటీవల ఈశ్వరమ్మగారి కాల జ్ఞానమనుపుస్తకమును జూడగా అందు ఆమె తాతగారి కాల మునందే యున్నట్లు తేలినది. ఈయంశమునుగూర్చి రచయితలు ఇంకను పరిశోధింప వలసియున్నది.

కాలజ్ఞాన రచనము

"శ్రీ విరాట్పద విఖ్యాతం సిద్ధానంద ప్రదాయకమ్
కాలజ్ఞాన ప్రవక్తారం వీరబ్రహ్మగురుం భజే."

—శ్రీ పులికొండ పరబ్రహ్మకవిగారు.

విరాట్టు అను శబ్దముచే ప్రసిద్ధమైన వాడును, సిద్ధపురుషుల కానందము నొసగువాడును, కాలజ్ఞాన ప్రవచన మొనర్చిన వాడును నగు శ్రీ వీరబ్రహ్మగురు దేవుని భజించుచున్నాను.

వీరబ్రహ్మగురుని వలన మనకు లభించిన తఱుగని నిధానము కాలజ్ఞానము. ఈ కాలజ్ఞానమును జెప్పునాచారము ఱ్ఱె వసిద్ధులలో సహజముగా కలదు. నాకర్ణాటదేశ పర్యటన సందర్భమున అనేకుల కాలజ్ఞానగ్రంథములను జూచుటసంభవించినది. ఆ సంప్రదాయమును బాగుగా వృద్ధిచేసి, జనసమూహమునకు భవిష్యత్కాల స్వరూపమును బోధచేసి యీ మహనీయుఁడు లోకస్తుతులకుఁ బాత్రుఁడైనాఁడు. గురుదేవుని జీవిత చర్యయంతయు నొకయెత్తు, కాలజ్ఞాన ప్రవచనమొకయెత్తునని చెప్పవచ్చును. వీరి కాలజ్ఞానము ఱ్ఱె నకు అసాధారణప్రచార మున్నది. గురుదేవుఁడు కాలజ్ఞానములో వాక్రుచ్చిన యంశములు తు. చ. తప్పకజరుగుచున్నవి. దేశము తెల్లవారి స్వాధీనమగునని "వానరమూతులవారు భూమి పరిపాలనము చేసేరు" అను వాక్యమున గుచంద్రుఁడు తెలిపినాఁడు. "వారి ప్రభుత్వము రెండువందల యేండ్లకు పైఁబడి యుండు" నన్నాఁడు. "వీడుపోయేలోగా సమస్తమైన అన్యాయాలు పుట్టు" నన్నాఁడు. "పమిడికంటి కుక్కలు రాత్రింబగళ్లు రాగాలు

తీసేను" అని ఒక వాక్యము కాలజ్ఞానమున ఉన్నది. ఇది విద్యుద్దీపాలనే కన్నులతో రేలు పవళ్లు రాగాలు తీయు 'రేడియో' లను సూచించుటలేదా ! ఇట్లనేక విషయ ములు రహస్యములుగను, సమర్మములుగను చెప్పఁబడినవి.

నేను జూచిన పెక్కు కాలజ్ఞాన గ్రంథముల వలె బ్రహ్మముగారి దని చెప్పఁబడు కాలజ్ఞానముగూడ పరిశుద్ధ మైనదిగా లేదు. కాలజ్ఞానపు ప్రతులను వ్రాసికొన్నవారు సొంతభాగమును కొంత దూర్చి యుందురు. చక్కగా వ్రాసికొనలేకపోయినంతనఁ గూడ అది అపార్థములకు నెలవై యుండవచ్చును. పెక్కుప్రతులను సంపాదించి యథార్థమగు బ్రహ్మముగారి కాలజ్ఞానమును నిర్ణయించు టకై ప్రయత్నము చేయుట మంచిది.

భవిష్యద్విషయ పరిజ్ఞాన మనునది మన ము పూర్వము చెప్పికొన్న సంయమముచేఁ గలుగఁగలదు. సంయములందఱును భూత భవిష్యద్వర్తమానము లనెడి మూఁడు కాలముల యందలి విశేషములను దెలిసికొన సమర్థులై యుందురనుట నిక్కము. మన పురాణములు

కొంతవఱకు భవిష్యదంశములను తె లు పు చు న్న వి. అందును భవిష్యత్పురాణము ఆ యంశముల నెక్కు-వగా చెప్పును. జ్యోతిశ్శాస్త్రముచేత ఁగూడ భవిష్యత్తు నెఱుంగ వచ్చును గదా. గురుదేవుఁడు పై మూడుశక్తులను పెడికిటు ఁ బట్టిన మహనీయుఁడగుటచేత, లోకు లాశ్చర్యపడునట్లు కాలజ్ఞానమును జెప్పి వారి కైమోడ్పుల నందుకొనఁ జా లి నా ఁ డు.

పం చ మ సం ఘో ద్ధ ర ణ ము

కక్కయ్య నామక మతిప్రవిమూఢ బుద్ధిమ్
భార్యాం విదార్య మణిపూరక ముఖ్యవట్కమ్
అన్వేషయ న్త మకరోత్-శ్వపచం కృతార్థం
యో వీరదేశికవిభు స్త మహం భజామి.

గురుదేవుని జీవితచర్యలలో మూదిగవాఁడగు కక్కయ్యకు సదుపదేశము చేసి, పంచమజాతి సముద్ధరణ మునకు దారిచూపుట అనునది మిక్కిలి గొప్ప సంఘ సంస్కారకార్యము. బ్రహ్మముగారు కందిమల్లయపల్లెలో నున్న సమయములందు, తన యింటనే శిష్యులకు రోగ

వేదాంత బోధలను జేయుచుండుట ఆయన నిత్యకృత్యము. ఈ బోధలు పరమ రహస్యములయినచో, సాధారణముగా జనులందఱు నిదురించినపిమ్మట రాత్రివేళనే జరుగుచుండెడివి. ఒకనాఁటిరాత్రి గురుదేవుఁడు సిద్ధప్ప మున్నగు ప్రియశిష్యులకు షట్చక్ర రహస్యములను బోధించుచున్నాఁడు.

ఆధారము, స్వాధిష్ఠానము, మణిపూరము, అనాహతము, విశుద్ధము, ఆజ్ఞ అనునవే షట్చక్రములు. ఈ ఆఱింటికి పైని సహస్రారకమల ముండును. షట్చక్రములను కమలములనికూడ పోల్చుచుందురు. ఆధార కమలమున నాలుగు దళములు, స్వాధిష్ఠానమున ఆఱుదళములు, మణిపూరకమున పది దళములు, అనాహతమున పదిరెండు దళములు, విశుద్ధమునందు పదునాఱు దళములు, ఆజ్ఞా చక్రమున రెండు దళములు ఉండునని శాస్త్రసంప్రదాయమును, మహాత్ముల అనుభవమును వాకొనుచున్నవి. సహస్రారము వేయి తేకుల కమలమనియు, అష్టదళముల పద్మమనియు రెండురీతుల వ్యవహరింపఁబడుచున్నది. ఈ

రెండు విధములగు సంఖ్యాతీతమును ప్రత్యేకములగు రహస్యార్థము లున్నవి. వానిని సద్గురువుల యనుగ్రహముచేత సాధకు లెఱుంగవలయును. అకారము మొదలుగాఁగల పేఁబది యక్షరములును ఆధారము మొదలుకొని ఆజ్ఞ వఱకున్న కమలదళములమీఁద నెలకొనియుండుననియు సంప్రదాయము. ఒక్కొక్క దళముమీఁదనున్న ఆ యా బీజాక్షరములను ఉపాసించుటచేత సాధకునకు సంసార నివృత్తి కలిగి మోక్షసంసిద్ధి యగును. జీవుఁడు ఆ యా చక్రములయందలి ఆ యా దళములమీఁద సంచారము చేయునప్పుడు వానికి సంబంధించిన నానావిధ సంకల్పములు మంచివి, చెడ్డవి, మిశ్రములైనవి కలుగుచుండును. ఆధారమునందున్న కుండలినీ శక్తిని మేలుకొల్పి సహస్రారమునకు సుషుమ్నామార్గమున పయనింపఁ జేయుటకు మంత్ర యోగశాస్త్రములలో ఎంతయో సాధన ప్రణాళిక చెప్పఁబడియున్నది. జీవుఁడు ఈ మార్గమున కుండలినీశక్తి తోడ్పాటుతో సహస్రారమున కేగి, అచ్చటనున్న పరమాత్మ తేజమును సందర్శింపజాలి దానితో ఐక్యమైనచో

మక్కుడగుననుట రహస్యము. ఈ ఆధారాది షట్చక్రము
లకు, సహస్రారమునకు సంబంధించిన రహస్యములు
పెక్కులు కే. శే. శ్రీ కోవెలవెన్ను పరబ్రహ్మతీర్థుల
వారు తాము రచించిన "జగచ్చిల్పము" అనుగ్రంథములో
విస్తరముగా వివరించియున్నారు. జిజ్ఞాసువులు ఆ గ్రంథ
మును చదివినచో అనేకాధ్యాత్మికరహస్యముల నెఱుంగ
వచ్చును.

ఇట్టి పరమరహస్యములను, వానిని సాధించుటకు
లను గురుదేవుడు శిష్యులకు ఉపదేశించునాటిరాత్రి
ఊరితలవరిగానుండి రాత్రివేళ గ్రామసంచారము చేయు
చున్న కక్కడు బ్రహ్మాముగారి ఇంటి పంచలో పొంచి
యుండి వినుట సంభవించినది. మూఢభక్తి ప్రేరితుడైన
యాతనికి అప్పటికప్పుడే ఏదో తత్త్వము గోచరించినట్లు,
పరబ్రహ్మము సాక్షాత్కరించినట్లు తోచినది. ఆతడు
వెంటనే యింటికిపోయి నిదురించుచున్న భార్యపొట్ట కోసి
అందాధారాది చక్రములను జూచుటకు ప్రయత్నించెను.
చక్రము లగపడకపోగా, భార్య మరణించుటయను ఫల

మాతనికి కలిగినది. ఆతడు వెంటనే నెత్తి మొత్తుకొనుచు గురుదేవుని యింటికేడ్చుచు పరుగిడి వచ్చి, తాను జేసిన ఘోరకార్యమును నివేదించెను. బ్రహ్మగురుడాతని మూఢభక్తికి వింతపడి సశిష్యుడై యా మాదిగవాని యింటి కేతెంచి, వానిభార్యను బ్రతికించినాడు. నాటి నుండియు కక్కడు గురుదేవుని కెడబాయని ప్రియ శిష్యుడై ఆయన బోధలచేత కృతార్థుడైనాడు. కేవల వేదాంత విద్యాదానముచేత కక్కని కృతార్థుని జేయుటే కాక, అంటరానివారుగా పాటింపబడుచున్న మాల మాదిగలను (అవర్ణులను) సంస్కరించి, సవర్ణులనుగా లెక్కింపజేయుటకును గురుదేవుడెంతయో కృషిచేసి నాడు. ఈవిధముగా నాలుగు వందల యేండ్లనాడే హరి జనోద్ధరణ కార్యమునకు నాంది పలికిన గురుదేవుని దూర దృష్టి యెంతటిదో భావింపుడు. తాను నాటిన ఈ సంస్కార బీజములు మూడువందల యేండ్లకు ఫలితా వస్థకు రాగలవని తెలిసికొన్న గురుదేవుడు మాలలు ప్రభుత్వ మొనర్తురు (మాలలకు మంచాలు బొపలకు

పీటలు, మూలవాక్కే రాజ్య మేలేనిమా) అని తన కాల జ్ఞానములోను, గోవింద వాక్యాలలోను సూచించి యున్నాడు. అంతియేకాదు. కల్పితాలైన ఈనాటి కుల భేదాలు ఎంతోకాలము నిలువవని గురుదేవుడు-

"అయిదుశతాబ్దాల బహుధాన్యాలోపల
అన్నిజాతులు ఒక్కటయ్యేనిమా;
అవనిలోగల బీదధనశంతు లొకటిగా
అయ్యే యోగముగూడ వచ్చేనిమా॥వారి గోవింద గోవింద॥

అను నిట్టి గోవింద వాక్యములలో స్పష్టముగా చెప్పి యున్నాడు.

అలౌకికమహిమలు

అతడు తమోరజస్సుల కవల వెలుగు
సత్త్వమూర్తి త్రయీశిర స్సార దీపి
వెలుగులకు వెల్గు ప్రణవైక వేద్య నిత్య
తత్త్వ మా పీరగురుడు ప్రత్యక్ష మగుత.

గురుదేశ్రుని అద్భుత చరిత్రములో నెన్నదగిన యంశములలో లోకాతీత మహిమాప్రదర్శన మొక

ప్రముఖ ఘట్టమని చెప్పికొంటిమి. పాతంజలయోగ సూత్రముల ననుసరించి చూచిన, అణిమాది సిద్ధులను, లోకాతీత మహిమలను ద్రోసిపుచ్చ వీలుకాదు. "తత్ర త్తయ మేకత్ర సంయమః" అను సూత్రమునందు ధ్యాన ధారణా సమాధులనెడి మూడంగములను విజ్ఞాన భూమికమీద అనుసంధానము సేయుట సంయమమని చెప్పబడి యున్నది. ఈ సంయమమును ఆ యా విషయముల మీదికి కేంద్రీకరించి సంకల్పించినయెడల, యోగీశ్వరు నికి ఆ యా సిద్ధులుచేకూరునని వి భూ తి పా ద ము లో మహర్షి వివరించినాడు. ఈ సంయమ ప్రభావము వలననే సంయమికి అతీత వ్యస్త సమస్త శక్తులు కైవసములగును. పూర్వజన్మజ్ఞానము, భూత, భవిష్యద్విషయ విజ్ఞానము, పశు పక్ష్యాది రుతపరిజ్ఞానము, అణిమాదిసిద్ధులు, పంచ భూత వశీకరణము, తృత్పిపాసల నడంచుకొనగల శక్తి, పరాభిప్రాయముల నెఱుంగగల సామర్థ్యము, శాపాను గ్రహ దక్షత మొదలగు మహాశక్తు లెన్నియో సంయమ వ్రతసాధ్యములు. దీనింబట్టిచూచిన మహిమలు అసత్యము

లన జాలము. దీనికెదోడుమహాపురుషుల జీవితములందు గనబడు మహిమలనుబట్టియు, వానిని అసత్యములనుట సాహస మగుచున్నది.

రెండువేల సంవత్సరములనాడు క్రీస్తుప్రభువు గూడ అనేకములగు నలౌకిక మహిమలను ప్రదర్శించి, భక్తుల నుద్ధరించినాడనియు, రోగుల రోగములను గుదిర్చి నాడనియు బైబిలులో మనము చదివియున్నాము. కన్నడ దేశమువారైన పెక్కురు శైవసిద్ధులును, తమిళదేశము వారైన వైష్ణవ మహానీయులును, మహారాష్ట్రదేశమునకు చెందిన పెక్కురు మహాభక్తులును, తులసీదాస ప్రభృతులును ఎన్నెన్నో మహిమలను ప్రదర్శించినారని చదివియున్నాము. మన బసవపురాణాది గ్రంథములు మహిమల పుట్టలే గదా! అందు కొన్నింటిని త్రోసి రా జన్న కొన్నింటిని కాదనుటకు వీలు లేదు. ఇట్టి స్థితిలో కారణ జన్మ్మడగు బ్రహ్మయోగీంద్రుని మహిమా ప్రదర్శనము నెట్లు పూర్వపక్షము చేయ జాలుదుము?

"ఐన్‌స్టీన్" మహాశయుఁడు మన గాంధిమహా
త్ముని అహింసా ప్రయోగాది విధానములను, స్వాతంత్ర్య
సంపాదనమునకు ఆయనయవలంబించిన సాధనప్రణాళికను,
తదితర విశేషములను విని "ఇట్టిమహావ్యక్తి ఒకఁడున్నా
ఁడని ఒక శతాబ్దికి పిమ్మటనుండు జనులు విశ్వసింప
జాలరు" అని అన్నాఁడు. ఇట్టి స్థితిలో అనేక-అలౌకిక
దివ్యమహిమలను జూపిన బ్రహ్మగురుని యుదంతములను
కొందఱు నమ్మఁజాలక పోవుట వింత కాదు. ఎవరు నమ్మి
నను నమ్మకున్ననను, ఒక్కొక్క మహాపురుషుఁడు తాను
చేయవలసిన - చేయఁదలచిన కార్యములను జేయక
యుండఁడుగదా!

మన గురుదేవుఁడు పోలేరమ్మ విగ్రహముచేత
నిప్పు దెప్పించినాఁడు. ఆదేవతను వశము చేసికొని, కొన్ని
కార్యములను సాధించి ప్రజలకామెపై భక్తి నెలకొల్పెను.
ఒక సందర్భమున మూసూఁగరగు చున్న తగరమును
పానీయముగా గటగట త్రావివై చెను. సిద్ధవటము నవాబు
కొలువులో ఉపన్యసించినతఱి, సశిష్యుఁడగు గురుదేవుని

ఆ నవాబు తన ఆతిథ్యమును స్వీకరింపుఁడని కోరి, మాంససహిత భోజనము పెట్టినాఁడఁట. ఆ పదార్థములు గురుదేవుని మహిమచేత పరిపక్వ ఫలములుగా రూపొందె నఁట. ఈ యద్భుతమునకు నవాబు నివ్వెఱపడి స్వాముల వారిని క్షమింప ప్రార్థించినాఁడఁట. ఈ మ హి మ చే త 'మాంసభోజనము కర్తవ్యము కాదని' గురుస్వామి ప్రబో ధించినాఁడని గ్రహింపవలసియున్నది. కర్నూలు నవాబు గురుదేవుని ప్రభావము నెఱుంగఁ గోరి, యొక చూడి గుఱ్ఱము గర్భములోనున్న శిశువునుగూర్చి అది యెట్టి లక్షణములు గలదో చెలవిండని ప్రార్థించెను. గురుదేవుఁడు గుఱ్ఱపుపిల్ల లక్షణములను జెప్పినను నవాబు నమ్మక గుఱ్ఱ మును గోసి చూపవలసినదని కోరెను. బ్రహ్మముగారాతని కోరికప్రకారమే అశ్వగర్భమునుగోసి శిశువును వెలికిఁదీసి నవాబునకుఁ జూపి, మఱల యథాపూర్వముగా దానిని అశ్వగర్భములో నుంచి, గుఱ్ఱమును బ్రతికించెనఁట. గురు దేవుఁడు. చచ్చినవారిని బ్రతికించినాఁడని చెప్పెడి కథలిట్టివి

పెక్కులు గలవు. సిద్ధప్పయు, ఈశ్వరమ్మాయు ఇట్లే మృతులను బ్రతికించినట్లు కథ లున్నవి.

గురుదేవుఁడు అచ్చమాంబ గృహమున నున్న ప్పుడు కేవలము ఆవుపాలనే యాహారముగాఁ గొని శరీర యాత్ర చేసెను. వేంకటరెడ్డిగారి గోవులను గితిగీసి హద్దులోనుంచియు బలమును గోల్పోనీక రక్షించెను. "శరీరమునందు షట్చక్రము లున్నవా" యని మాదిగ కక్కఁడు తన పెండ్లమునుగోసి చూచి హతాశుఁడై గురుదేవుని శరణువేడఁగా అట్టి తతి ఆతని యజ్ఞానమునకు వగచి వాని భార్యను మఱల బ్రతికించి కక్కనికి జ్ఞానోప దేశమొనర్చి యుద్ధరించెనని చెప్పికొంటిమి. తాను సమాధిలోఁ బ్రవేశించినపిమ్మటఁగూడ పెక్కురగు భక్తు లకు శరీరముతో జాగ్రదవస్థలోనే యగపడి, వారి కడ గండ్లను, సుదియములను బాపెను. ఇంకను అత్రిమున్యా శ్రమమున నున్నప్పుడును, అచ్చమ్మగారి సేవలో కాలము పుచ్చునప్పుడును, గృహస్థజీవనము నెఱపునప్పుడును, అయ్యె తీర్థములందును, పుణ్యక్షేత్రములందును దిరుగు

నప్పుడును, తనకు లోబడని ప్రతికక్షులను, మందబుద్ధు
లను బ్రబోధించు ఘట్టములందును గురుదేవుడుచూపిన
స్వల్ప మహిమలును, మహా మహిమలును ఎన్నియో
కలవు. ఇట్టి మహిమలన్నియు మహా యోగీశ్వరుడగు
గురుమూర్తియొక్క యోగ ప్రాభవముచేతను, సంయమ
నశక్తిచేతనే సాధ్యము లైనవనుటలో ఆశ్చర్యము లేదు.
కనుక మహిమలు అభూత కల్పనలనుట తగదు. అయిన,
ఇట్టి మహిమలు యోగము సంపూర్ణముగా పండిన
ఏ మహాపురుషుని విషయమునసో తప్ప, అందటివిషయము
నను కలుగ నేరవని గ్రహింపవలయును. శతాధికములుగా
నున్న బ్రహ్మముగారి మహిమలలో కొన్నింటిని గూర్చి
శ్రీ. నే. పులికొండ పరబ్రహ్మ కవిగారు "బ్రహ్మముగారి
మహిమలు" అని యొక పుస్తకమును వ్రాసియున్నారు.

ఈ సందర్భమున ఒక్క విషయమును పాఠకులు
మఱువరాదు. ఏ వ్యక్తిగాని కేవలముగా మహిమలను
ప్రదర్శించినంత మాత్రమున మోక్షార్హుడు కాజాలడు.
మోక్షమునకుఁ గావలసినది అనుభవ ప్రధానమగు బ్రహ్మ

జ్ఞానము, సదాచరణమును. యోగాభ్యాసాదులచేతను, మంత్ర దేవతోపాసనలచేతను మహిమలు కలుగ వచ్చును. అవి మోక్ష హేతువులు మాత్రము కావుజాలవు. గురుదేవుఁడ్డు సైతము మహిమలను ప్రదర్శించుట ఆ యా కార్యములను సాధించు నిమిత్తమే కాని, అవి మోక్ష హేతువులని కాదు.

స జీ వ సమా ధి

మన గురుదేవుఁ డీ విధముగా తన యవతారోద్దే శ్యములను నిర్వహించుచు, కుల మత విభేదములకుఁ దన హృదయములో చోటీయక, ఏ మతమువాని కేని, ఏ జాతి వాని కేని అర్హతయున్న వాని కెల్ల బ్రహ్మవిద్యాదానము చేయుచు, నానా జాతులశిష్యులు తన్ను బలసి కొలుచు చుండగా యావద్భారత దేశ సంచారముచేసెను. ప్రయాణ సౌకర్యములు లేని యా కాలమున హిమాచలమునుండి ధనుష్కోటి వఱకుఁగల పుణ్యతీర్థములంచు దిరుగుచు, అయ్యో తావుల జనులను తన దివ్య బోధామృతముచేఁ దేర్చుచు, కాలజ్ఞానమును, హిందూ మహమ్మదీయ

సమైక్య సూత్రములను జాటుచు వేదాంత ప్రచార మొనర్చెను. ఈ ప్రచారములో ఆ మహానుభావుడు చూపిన మహిమలు, బోధసారము సాటిలేనివి. ఈ విధ ముగా జీవిత కార్యక్రమమును బూర్తిచేసి, ఒక వైశాఖ శుద్ధ దశమీ భానువాసరము నాడు ప్రాణములతో నుండియే దివ్యసమాధిలో ప్రవేశించుటకు నిశ్చయించు కొనెను. బ్రహ్మగురుడు ఏ సంవత్సరములో సమాధి నిష్ఠ నహించెనో తెలిసికొనుట కింకను సరియగు నాధార ములు దొరక లేదు. ఈ విషయమును గూర్చి గాఢ పరి శోధన జరుగనలసి యున్నది.

సిద్ధప్ప యిప్పటికే గురుదేవుని సేవించి తత్త్వజ్ఞాన మున పరిపక్వ దశ నందుకొనియే యున్నాడు. అయినను గురుదేవుని చరమకాలము అమూల్య మైనది గావున ఆ సుసమయమునను ఇంక ఎన్నో అమూల్య రహస్య ములను దెలిసికొన వలయునని తహ తహ పడుచుండెను. కాని, పోతులూరయ్య సిద్ధుడన్నచో సహనము లేక యున్నాడు గావున, సమాధి సమయమునకు వానిని గురు

వుల వద్ద లేకుండఁ జేయుటకు ఉపాయము నాలోచించు చుండెను. ఇంక కొందఱు శిష్యులు గూడ పోతులూ రయ్య దురాలోచనకు తోడ్పాటు నిచ్చిరి. వీరందఱు కలసి సిద్ధునితో "సిద్ధా, గురుస్వాములు సమాధి కానున్నారు గదా ! సమాధి వేళకు పూలు పత్రములు కావలసి యుండును. మనకు దగ్గఱలో పూలు దొరకుట దుర్లభము. బనగానపల్లెలో మంచిపూలతోట యున్నదని నీ వెఱుంగుదువు. బనగానపల్లె దూరమయినను గుర్వాను గ్రహమును చూఱలాశిన నీ కొకదూరములో లెక్క కాదు. అచిరకాలములోనే పోయిరాఁగలవు. కనుక శీఘ్రమే పయనమై పోయి పూలు పత్రములు తీసికొని వేళ మీఱక ముందే రావలయును." అని ప్రోత్సహించిరి. గురుభక్తి తాత్పర్యముచేత సిద్ధుఁడు ముందు వెనుక లారయక వల్లె యని పూలకోసమై పోయెను. పోతులూ రయ్య మున్నగువారు సిద్ధుని పూలకై బనగాన పల్లెకుఁ బొమ్మ్మనలేదనియు, చుట్టుప్రక్కల నెచ్చటికైనను పోయి పూలు దెమ్మ్మన్నారనియు కొందఱు వ్రాసియున్నారు.

ఎట్టయిన నగుఁగాక. సిద్ధప్పను సమయమునకు గురుదేవుని వద్ద లేకుండఁ జేయుటయే వారి ప్రధానోద్దేశ్యమనుట మాత్రము సత్యము. ఆ యుద్దేశ్యము ఎచ్చటికి ఏ పని మీఁద పంపినను నెఱవేఱునుగదా ! పూల కేఁగిన సిద్ధునికి పూలు దొరకలేదు. నానా కష్టములకు లోనయి పూలు సంపాదించుకొని వచ్చినప్పటికి రాఁదగిన వేళ మిగిలియే పోయినది. గురుదేవుఁడు దివ్యసమాధిలో ప్రవేశింపనే ప్రవేశించినాఁడు.

తిరిగి వచ్చిన సిద్దప్పకు పోతులూరయామలు చేసిన మోసము తెలిసినది. ఆతఁడు పెల్లుగా దుఃఖించి నాఁడు. గురుమహాదేవునిగూర్చి దీనాతిదీనుఁడై మొఱ పెట్టుకొన్నాఁడు. ఎట్టకేలకు గురునిదయ ఆతనిపై ప్రసరించినది. గురుదేవుఁడు సమాధి మూఁతపలకలను దీయు నట్లు సిద్ధునికి సంకల్పము గలిగించి, అట్లుజరిగిన పిదప దర్శనమిచ్చి మహాతత్త్వ రహస్యములను బోధించి నాఁడని కొందఱు రచయితలు వ్రాసియున్నారు. శ్రీ వడ్డెపాటి నిరంజనశాస్త్రిగారును, శ్రీ తత్త్వానంద స్వాములవారును

తాము రచించిన 'బ్రహ్మానందలీల' నా ట క ము లో బ్రహ్మము సమాధిలో నుండియే అంతర్వాణి మూలమున సిద్ధునికి మహావాక్య రహస్యములను ఉపదేశించినాడని వ్రాసియున్నారు. ఇది యెట్లయినను జరుగవచ్చును. బ్రహ్మ గురుడు సిద్దప్పకు తన పాదుకలను, యోగదండమును, అంగుళీయకమును ఒసంగియున్నాడు. ఆ యోగదండాది చిహ్నములను నేటికీని మనము ముడుమూలలో నున్న సిద్ధప్పగారి మఠములో చూడగలము. ఇవి యిచ్చుట యను కార్యము బ్రహ్మము సమాధినుండి బయటికి రాకున్న పొసగదు గదా ! కనుక గురుదేవుడు సిద్ధునికి మానసికముగా ఆజ్ఞ యిచ్చి సమాధి మూతతాళాలను దీయించి బయటికి వచ్చి మహోపదేశములను గావించి, చరమ సందేశమును యోగ దండాదులను ఒసంగినాడనుకొన్నను దోసము లేదు. లీలామానుష విగ్రహుడగు గురుదేవుని యెడ ఏదైనను సంభావ్యమే. సిద్ధుని ఈవిధముగా నుద్ధరించి కడకాతనిని గృహస్థుని గమ్మనియే గురుడాదేశించెను. గృహస్థాశ్రమమునకు పవిత్రత నాపా

దించుట ఆయన ముఖ్యోద్దేశ్యము కాన అట్లు చేస్పాటులో వింత లేదు. ఈ యంశములు విస్తరముగా నేను వ్రాసిన సిద్ధప్పగారి సంపూర్ణ చరిత్రలో వివరించినందున ఇచ్చట సంగ్రహముగా మాత్రమే వ్రాసినాఁడను. సిద్ధునికి గురుఁ డొసంగిన చరమ సందేశాదులు గూడ పాఠకులు ఆ గ్రంథమునందే చూడవచ్చును.

గురుదేవుఁ డిట్లు దివ్యసమాధిలో తపోనిష్ఠయం దుండియు భక్తమండలికి అప్పుడప్పుడు దర్శన మిచ్చుచుఁ దన మహిమలను జూపుచునే యుండెడి వాఁడఁట. ఇచ్చట స్మరింపఁదగిన యంశ మొకటి అతిప్రధానమైనది కలదు. బ్రహ్మముగారు సమాధియైన పిమ్మటఁ గూడ వారి భార్య యగు గోవిందమ్మగారు మాంగల్య చిహ్నములను పరిహరింపలేదు. అందుకు కారణము గురుచంద్రుఁడు మరణము నొందకయే జీవములతో సమాధినిష్ఠుఁడగుటయే. ఇట్లుండ సమాధియైన సంవత్సరమునకు వార్షికారాధనము చేయఁ దలఁచి, పోతులూరయ్యయు, మఱికొందరు శిష్యులును పరిసర గ్రామములకు చందాకై పోయిరి. అప్పుడు అంచున్న

యన్న వర్ణములవారును చందానిచ్చి సత్క_రించిరిగాని, కొందఱు విశ్వబ్రాహ్మణులు మా_త్రము "మీతండ్రి మరణించినను, మీతల్లి మంగళ సూత్రాదులను తీసివేయ లేదు. ఇది కులాచార ధర్మములకు విరుద్ధము గాదా ? కావున మేము మిమ్ము వెలిఁ బెట్టితిమి." అని యెదురు తిరిగిరి. అందుకు పోతులూరయ్య ఆగ్రహోదగ్రుఁడై చేయునదిలేక, మాతృదేవి వద్దకువచ్చి జరిగినదానిని విన్న వించి, గాజు, పూస తీయవలసినదని ఆమెను నిర్బంధించెను. గోవిందమ్మ విశ్వబ్రాహ్మణుల యజ్ఞోపవీతమునకును, కుమారుని · మూర్ఖత్వమునకును మిక్కిలి చింతించి, పోతులూరయ్య కిట్లు సమాధానము చెప్పెను. "నాయనా ! పూజ్యపాదులగు గురుదేవులు మరణింపలేదు. వారు సమాధిలో తపోనిష్ఠులైయున్నారు. సందేహింప వలదు. శ్రీవారు మరణించినఁగదా నేను మంగళసూత్రాదులను పరిహరింప వలసినది. లోకులు అజ్ఞానులై యాడిన పలుకులకు నీవిట్లు తామసింపవచ్చునా ?" లోకదృష్టియే గాఢముగా నున్న పోతులూరయ్యకు తల్లిమాట నచ్చలేదు. తన సందేహ

నివృత్తికై ఆతడు సమాధిపైనున్న మూత పలకలను దీసి చూడనే చూచినాడు. ఆ సమాధిలో గురుదేవుని దేహము చెక్కు చెమర్పక యున్నది. ఆ మహానుభావుడు చిన్ముద్ర ధరించి రెండవ దక్షిణామూర్తివలె ప్రకాశించు చుండెను. అట్లున్నను పోతులూరయ్య గురుదేవుడు బ్రతికియున్నాడని నమ్మలేక ఆయనను బలుకరించి సమాధానము బడయజాలక పోయెను. చిట్టచివరకు అతడు అమ్మహాతపస్వియొక్క గడ్డము పట్టుకొని యూచెను. అంతట స్మృతి కలిగిన గురుదేవుడు కనులు తెఱచి చూచి, సంగతిని గ్రహించి "పోతులూరూ ! ఈ మహాపాపము శమించుటకు పదిరెండేండ్లు ఆకు లలములు దినుచు, అరణ్యవాసము చేయుచు తపము సలుపనలసిన" దని నిష్కృతిని ఆదేశించి మఱల సమాధినిష్ఠుడాయెను. చూచితిరా ! దేశికేంద్రుని మహామహిమము ! తనవాడు పెఱవాడు అను భేదములేక కర్మమునకు దగినట్లు శాపానుగ్రహములకు గుఱిచేయు సత్యనిష్ఠ బ్రహ్మగురు దేశ్రమనకే చెల్లె !

ఉ ప సం హా ర ము

వీరబ్ర హ్మేంద్రస్వామి ఈ విధముగా లోకోత్తర మహిమలను జూపియు, యోగసమాధి సంపదను వెల యించియు, సంఘసంస్కా ర మొనర్చియు, భాషావిషయ మున ఎనలేని సేవ చేసియు, కుల మత ద్వేషములను దూరముచేసి విశ్వమానవ సౌభ్రాత్రమును స్థాపించియు, అఖండ వేదాం త జ్ఞానసారమును చిలికియు, ఆంధ్రప్రజా మండలమునకేగాక, అఖిల మానవ సమాజమునకును కల్యాణకర మార్గము నేర్పఱిచి యొప్పెను.

మన గురుదేవుఁడొక గొప్ప సంస్కా ర్త. కాపునన్నే అచ్చమ్మకును వేంకటరెడ్డికిని, మ హా మ్మ దీ యుఁ డగు సిద్ధప్పకును, మాదిగవాఁడగు కక్కయ్యకును మంత్రోప దేశము, మహావాక్యోపదేశము చేసి, అర్హతగలవారికి బ్రహ్మవిద్యాధికార మున్నదని చాటెను. బ్రాహ్మణాది వర్ణములు సత్త్వరజస్తమోగుణముల న్యూనతాధిక్యములను బట్టి యేర్పడునని గురుదేవుని యభిప్రాయము. "చాతు ర్వర్ణ్యం మయా సృష్టమ్ గుణకర్మ విభాగశః" అన్న

గీతాకారుని యభిప్రాయముగూడ ఇదియే. ఈ యంశ మును (శ్రీ) శంకరులు గీ తా భా ష్య మున వి వ రిం చి యున్నారు. అంతియేగాని, బ్రాహ్మణునికిఁ బుట్టినవాఁడెల్ల బ్రాహ్మణుఁడనియు, శూద్రపుత్రుఁడు శూద్రుఁడేయనియు నేఁ డనుసరింపఁబడు వ్యవస్థ యుక్తమైనది కాదనియే బ్రహ్మగురుని యుద్దేశ్యము. అందుకనియే ఆయన అవర ర్ణులను, అన్యమతస్థులనుగూడ శిష్యులనుగా పరిగ్రహించి సముద్ధరించినాఁడు. గాంధిమహాత్మునిచే వి స్తరింపఁ జేయఁ బడనలసియున్న హరిజనోద్యమమునకు బ్రహ్మగురుఁడు బీజావాప మొనర్చినాఁడు. తాను రజస్వలయైన కన్యనే పెండ్లియాడి తద్వివాహముల యావశ్యకతను నిరూపిం చెను. తన మనుమరాలు ఈశ్వరీదేవి అవివాహితయై యుండుటకంగీకరించి, సమర్థరాంధ్రగువనితలు సంఘమును సేవించు నిమిత్తముగాని, ఒక మహోన్నత లక్ష్యమును సాధించుటకుఁ గాని యావజ్జీవము బ్రహ్మచారిణులుగా నుండవచ్చునని ప్రబోధించినాఁడు. ఇది సర్వ స్త్రీజన సాధారణమగు విషయము మాత్రము కాదు. అధిక

సంఖ్యాకులలో నే యొకరిద్దలో మాత్రమే అట్లు ఉండఁ జాలుదురనియు, అట్టివారిని సంఘము ఆక్షేపింపరాదనియు, మాత్రమే మనము గ్రహింపవలసి యున్నది.

ఆ మహనీయుఁడొక సర్వమత సమన్వయమూర్తి. కావునఁనే పరమతస్థుఁడగు మహమ్మదీయబాలుని ప్రధాన శిష్యునిఁగా చేపట్టి తనయంతవానిని జేసెను. నవాబుల యాస్థానములందు భేదవాద నిర్వాపణ మొనర్చి, నానా మతములలోని ప్రధాన మూలసూత్రములను సమన్వయ పఱచి, ఏ మతమైనను మానవుల కీశ్వర సాక్షాత్కార యోగ్యతనుగూర్చి ఆత్మశాంతిని నెలకొల్పుటకే యేర్పడి నదనియు, ఉత్తమ తత్త్వసిద్ధి నందినవాఁడు సర్వమతా తీతుఁడై ప్రకాశించుననియు ప్రబోధించి, మతదురభిమానము నాశమొందించి, సర్వమతస్థులు అన్నదమ్ములనలె మెలంగు టకు చక్కనిరాచబాట నేర్పఱచి, హిందూమహమ్మదీయై క్యమునకు బీజములను నాటెను. ఈబీజములే పిమ్మట రాజా రామమోహన రాయలవారిచేతను, గాంధిమహాత్మునిచేతను అంకురింపఁజేయఁబడి నేఁటికిసత్ఫలములనీనుచున్నవి.

ఆ కవి చంద్రుడొక మేటి భాషోద్ధారకుడు. వ్యావహారిక భాషలో ఉత్తమ సంస్కార ప్రబోధకములగు సత్యసూత్రములను ప్రచారము చేసెను. ఆ మహాత్ముడు గురువులకు గూడ గురుదేవుడగు నొక జగద్గురుడు. కావుననే పెక్కురు వేదాంతాచార్యులు ఆ గురుమహారాజు ననుగ్రహము వలన దమ నడవళ్లను దిద్దుకొని లోక సంగ్రహ కార్యములందు అప్రమత్తులై విశ్వజనీనము లగు ఉపనిషత్సిద్ధాంతములను బ్రచారము చేసినారు. పుష్పగిరిలోని శంకరపీఠము ఇమ్మహాత్ముని దివ్యప్రబోధము చేతనే తెలివొంది, తొంటి జవసత్వములను బొంది ప్రకాశించి నదికదా!

ఆ సంయమి త్రికాలజ్ఞుడగు మహా పురుషుడు. తన సహజ జ్ఞానమునకు జ్యోతిశ్శాస్త్రమును గూడ దోడు చేసి ముందు జరుగబోవు నద్భుత సత్యములను దేట తెనుగున ప్రవచించి "కాలజ్ఞానము" ను జాటిచెప్పెను. ఆ శిల్పాచార్యుడొక యుత్తమ పౌరుడు. తానొక యవతారపురుషుడయ్యు సామాన్య జనునివలె ప్రజా

సమూహాములోఁ గలసి, అంచును కర్షకులకును, కర్మ కారులకును ప్రియబంధువై వారి యు ద్య మ ము ల కు చే యూఁత నిచ్చుచు గ్రామపరిశ్రమలును, సస్య సంప దయుఁ బెంపొంద సేవచేసి యు త్తమ పౌరధర్మములను ప్రచారము చేసెను. అచ్చమ్మగారి యింట ఆలకాపరి యుద్యోగము చేసి దేశమునకు పశుసంప త్తియు గోపూజా పరతయు అత్యవసరములని నిరూపించెను.

ఆతఁడొక యాదర్శ గృహస్థుఁడు. రామచంద్రుని లోనున్న సదాచరణము, కృష్ణజీవితములో నున్న ఉపదేశి కత్వ విశిష్టమగు ధర్మప్రవచనము ఈ రెండును ఈయనలో రూపె త్తినవి. గృహస్థుఁడుగా నుండియు తామరాకుమీఁది నీటి బొట్టునలె సంచరించుచు మోక్షపురుషార్థమును సాధింపవచ్చునని బ్రహ్మగుప్తుఁడు ఆచరణ పూర్వకముగా నిరూపించెను. తనతోఁబాటు తన కుటుంబమును, పరిసరస్థు లను గూడ మోక్షార్హులఁజేయు క్రమశిక్షణము నిచ్చిన మేటి రొప్పజ్ఞ యీ గృహపతి. మేలుబంతులగు పత్నీ పుత్ర

శిష్య బంధు పరివారములతోఁగూడిన గురుని గృహము స్వర్గధామమై యొప్పినది.

ఇఁక గురుదేవుఁడు మహావేదాంతి యనియు, యోగీశ్వరుఁడనియు, సంయమి యనియు జ్ఞానిసత్తముఁడనియుఁ జెప్పుట పునరుక్తియే యగును. అతిలోకములగు నీ గుణములను లౌకిక కార్యములందు సమన్వయ పఱచి, వేదాంతము కేవలము అరణ్యవాస సాధ్యము మాత్రమే కాదనియు, సామాన్య ప్రజాజీవనమునను, సాంఘికసమస్యా పరిష్కారమునను వేదాంతసూత్రము లాచరణయోగ్యము లయినపుడే మతము హింస, ద్వేషము, క్రౌర్యము మొదలగు రాజసగుణములను బోకార్చి, ధర్మ దయా స్నేహాది దైవగుణములతో సమాజమును కల్యాణ వంత మొనర్చి శాంతిసౌఖ్యములఁ దేలాడఁజేయునని స్వయ ముగా నాచరించి చూపిన మహాప్రభావుఁడీ జగద్గురుఁడు. కావుననే గురుచంద్రునివిషయమున ఒక్క జ్ఞానమే కాదు, కర్మమే కాదు, యోగమే కాదు, భక్తియే కాదు, నాల్గు మార్గములును గలసికొన్నవి. ఏ యోగమునకైనను

గురునిహృదయములో స్థాన మున్నది. ఈ బ్రహ్మామూ ర్తిలో రామ కృష్ణ బుద్ధ శంకర రామానుజ మ ధ్వా దు ల బోధల సారమే కాదు; జీససు, మహమ్మదు మున్నగు ప్రవ క్తల భావవాహినులును సంగమించినవి. విశాలమగు హిందూమతగర్భములో సర్వమత సిద్ధాంతములకును స్థాన మున్నట్లు, ఈ విశ్వమతప్రతినిధి హృదయములో అన్ని మతసూత్రములకును, సర్వమహాపురుషుల సదుపదేశము లకును తా వు న్న ది. కనని వినని సమన్వయశ క్తి యీ వ్యక్తిలో నెలవు చేసికొనుటంబట్టియే, ఎట్టి విరుద్ధశక్తుల నేని గురుమహారాజు కైవసము చేసికొని సుస్థిరశాంతిని జాటఁగల్గినాఁడు. దైవసంపద్విశిష్టమగు నార్షమహిమకున్న ప్రత్యేకత యిదియే కదా! తమ యాశ్రమవాటికలలో మనుష్యేతరములగు ఘాతుక మృగములనుగూడ సాధు భావ సమన్వితముల నొనర్చి సేవకై పనిగొన్న ఋషుల మహాదర్శము మానవాభిప్రాయములను మార్ఫఁజాలదా! సూక్ష్మదృష్టితో నవలోకించిన గురుబ్రహ్మామునందు ఈ యార్షశ క్తి సముజ్జృంభణమునే మనము కాంచఁగలము.

గురుదేవుని అచంచలమగు ధర్మదీక్షలో శైవ, వైష్ణవ, శాక్తేయాది వైదిక మతశాఖలు సముచితవికా సము నంది మానవతారకములై యొప్పినవి. నామ రూప భేదమాత్రముచే పృథక్కులుగా నున్న ఆ యా మతముల యాంతరిక తత్త్వమును భేదములేని సమరసస్వరూపముగా సమన్వయించి గురుమూర్తి వైదికసిద్ధాంతములను సమ్మా నించెను. సువిశాలమగు ఆ గురుని మతదృష్టి అడ్డమాఁకలు లేక, సంకుచితము కాక, విశ్వజనీన సంస్కారసారమును జాల్వార్చి, విశ్వశాంతిజ్యోత్స్నను వెలయించి మించెను. ఈ నాఁడాంధ్రదేశము చేయవలసినంత ప్రచారమే చేసినచో, గురుమహాదేవుని అనతారకల్పలత విశ్వమానవ జగత్తునకు కావలసిన మధురఫలములను బంచిపెట్టఁగలదు.

నేఁటి యుగపురుషుఁడు, ప్రపంచశాంతిదూత, పురుషోత్తముఁడునగు గాంధిదేవుఁ డిచ్చు నమరసందేశము లోని సత్యాహింసలు, విశ్వజీవకారుణ్యము, మతసహనము, హిందూమహమ్మదీయైక్యప్రబోధము, అస్పృశ్యతా నివారణయత్నము, వృత్తివిద్యాప్రచారము, భగవద్భక్తి,

స్వాతంత్ర్యదీక్ష మున్న గు మహాప్రబోధములు వీర బ్రహ్మేంద్రస్వామి ఆచరించి, ప్రబోధించి అవసరములని చాటినవే యని గ్రహించుట సులభము. వీరదేశికుడు సంకల్పించి యారంభించిన మహాధర్మములు అంతట ప్ర చా ర ము నందినయెడల విశ్వమానవకల్యాణము చేకూరి, ప్రపంచమున సౌఖ్యానందశాంతులు తేజరిల్లగల వనుట సత్యము. మన గురుమహాదేవుని తపస్సు పండి, ఆయన సంకల్పములు సఫలములై అచిరకాలములోనే సమాజము ఈ సమున్నతాదర్శముల నాచరించి కృతార్థము కావలయునని ఆశింతము.

ఓం సర్వేషాం స్వస్తి భవతు.
ఓం సర్వేషాం పూర్ణం భవతు.
ఓం సర్వేషాం శాంతి ర్భవతు.
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

అనుబంధము

బ్రహ్మముగారి కాలము

నేను 1949 ప్రాంతమున వీరబ్రహ్మముగారి చరిత్రాంశములను పరిశోధన చేయుటకు పూనుకొని కొంతవఱకు కృషి చేసియుంటిని. తత్ఫలితముగా వీర బ్రహ్మస్వామి క్రీ. శ. 1604 మొదలుకొని 1640 ప్రాంతము వఱకు నుండి తన లీలలను మహిమలను ప్రదర్శించినట్లు కొన్ని ఆధారములను సంపాదింపజాలినాడను. కాగా 17 వ శతాబ్ది పూర్తిగా ఈ మహానీయుని చరిత్రోదంతములతో నిండియున్నట్లు తోచుచున్నది.

బ్రహ్మముగారు నేటికి సుమారు మూడువందల యేండ్లకు పూర్వమున్నారని ఆయన శిష్యులును భక్తులును చెప్పుదురు. కందిమల్లయ పల్లెలోని బ్రహ్మముగారి మఠము పరిపాలకులును ఇట్లే చెప్పుచుందురు. మఠములో బ్రహ్మము సమాధితోపాటు తద్వంశీయుల సమాధులును పెక్కులున్నవి. ఒక్క సమాధిమాదగూడ సమాధి చెందినవారి సమాధికాలము శాసనమూపముగా చెక్కబడిలేదు. అట్టి శాసనములే అసమాధులయందున్నచో కాలనిర్ణయమునకు మనము పరిశోధన సేయవలసిన యక్కఱయే యేర్పడెడిది కాదు. భక్తాదులు చెప్పు పుక్కిటిపురాణములను బట్టియే మనము కాలనిర్ణయము చేయ రాదుగదా! కావున బాహిరములును, ఆంతరములునగు కొన్నిదృష్టాంతములు దొరకిన నేగాని సరియగు కాలమును నిర్ణయించుటకు వీలుకాదు. ఇందుకు నాకు దొరకిన యాధారభూత గ్రంథములివి :

1. 1920 ప్రాంతమున శిల్పసాగరబిరుదాంకితులు శ్రీ తాటికొండ వేంకటరాఘవాచార్యులుగారు వ్రాసి ప్రకటించిన "వీరాచార్య చరిత్రము".

2. 1937 లో కందిమల్లయపల్లె నివాసియగు శ్రీ చాటుకొండ సుబ్బయ్యగారు రచించి ప్రకటించిన "శ్రీ వీరబ్రహ్మముగారి జీవిత చరిత్రము".

3. "కాలజ్ఞాన తత్వములు" అను పుస్తకము.

4. కాగితములమీద వ్రాయబడిన 'కాలజ్ఞానము' అను గ్రంథము.

5. కవిశేఖర వడ్డిపాటి నిరంజనశాస్త్రి గారు రచించిన 'కల్యంధకాముడి" అను పద్య కావ్యము.

మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయములో మెకంజీదొర గారు సంపాదించిపెట్టిన గ్రామచరిత్రలు (కైఫీయతులు) కొన్ని చూచితిని గాని, వానియందు వలసిన యంశములు దొరకలేదు. ఇంకను గాఢముగా పరిశీలించినచో ఏమేని యాధారములు దొరకు నేమో!

కాలనిర్ణయము

మఠములోనున్న ఒక కాలజ్ఞానగ్రంథములో బ్రహ్మముగారి పౌత్రియగు ఈశ్వరమ్మగారు సమాధియైన కాలము కలియుగాబ్దములు 4871 కి సరియైన వికృతి సంవత్సర చైత్రశుక్ల విదియ సోమవారమని వ్రాయబడియున్నది. నేటికి కలిగతాబ్దములు 5060. కాగా ఈశ్వరమ్మగారు సమాధిపొంది నేటికి 189 సంవత్సరములు. ఈశ్వరమ్మగారు 95 సంవత్సరముల పూర్ణజీవితమును గడపి తత్త్వవిద్యాప్రచారము చేసినదని ప్రసిద్ధియున్నది. అమె మహాయోగినియు, బ్రహ్మచారిణియు గావున 95 సంవత్సరముల పూర్ణజీవితమును గడపినదను

ప్రసిద్ధి అయథార్థము గాదు. అప్పుడామె జననకాలము కలియుగ సం॥ 4776 అగుచున్నది. బ్రహ్మము జీవసమాధిని ప్రవేశించునప్పటికి ఈశ్వరమ్మగారు 10, 12 సంవత్సరముల వయస్సుగలవారట. ఆపది రెండు సంవత్సరములు కలుపుకొన్నచో 4788 ప్రాంతము బ్రహ్మముగారి సమాధికాల మగుచున్నది. కాగా నేటికి 272 సంవత్సరములనాడు బ్రహ్మము సమాధియైనారని తేలుచున్నది. తరమునకు ముప్పది సంవత్సరములని లెక్కచూచిన నేటికి తొమ్మిదితరముల నాడు బ్రహ్మముగా రున్నారని చెప్పుటకు వీలగుచున్నది. దీనికి దగినట్లు బ్రహ్మముగారినుండి నేటివఱకు వారి వంశపరంపరలోనివారి సమాధులు తొమ్మిది బ్రహ్మముగారి మఠములో నేటి కగపడుచున్నవి. కనుక క్రీ. శ. 1687 ప్రాంతము సమాధికాలము. కాగా అంతకు పూర్వకాలమున బ్రహ్మముగారు జీవించియున్నారన్నమాట. ఆయనకు ఎనుబదియేండ్లకు నించిన జీవితకాలము నూహసేయుచో పదాఱవ శతాబ్ది ప్రారంభమాయన జననకాలమగును. బ్రహ్మముగా రెనుబది వత్సరముల కెక్కువయే జీవించినారనుట కనేక సాక్ష్యము లున్నవి. ఇంకొక ప్రమాణమును బట్టి చూతము. ముద్రితములగు కాలజ్ఞాన తత్త్వములలోని ఒక మంజరీ ద్విపదలో నిట్లున్నది.

"ఆనంద గురువుల అనుమతిచేత
భావసంధికివచ్చి భక్తవత్సలుడు
ఆదికేశవులకు అభయంబు నిచ్చి
ఆదిలక్ష్మినిగూడి ఆనంద మొంది
సిద్ధార్థినామ సంవత్సరమందు
బనగానపల్లెలో పరగంగ నిలిచి
రత్నసింహాసనారూఢుడై తాను
కృతయుగ ధర్మంబు నడిపించుకొఱకు

వీరవసంతుడై వచ్చియున్నాడు
కానకయున్నాము బ్రహ్మంబు మాయ
కారణంబులు ముందు కానవచ్చెడును."

దీనిని బట్టి సిద్ధార్థినామ సంవత్సరములో బ్రహ్మము బనగానపల్లెలో విహరించినట్లు తెలియుచున్నది. బనగానపల్లెలో వీరప్పయ్య యను వీర బ్రహ్మముగారు గరిమిరెడ్డి అచ్చమ్మగారి యింట అవుల గాయుట, అన్నాజయ్య మొదలగు శిష్యులకు కాలజ్ఞానాదు లుపదేశించుట చరిత్రప్రసిద్ధము. వేటికిని బనగానపల్లెలో బ్రహ్మము విహరించిన ఆయాచిహ్నములగపడుచుండుట, భక్తులు వెళ్లి చూచుచుండుట ప్రత్యక్షము. పై ద్విపదగేయమును బ్రహ్మముగారి ప్రియశిష్యులగు అన్నాజయ్యయో మతిం కెవ్వరో వ్రాసియుందురని నా అభిప్రాయము.

ఇప్పటి వికారి వత్సరముతో నాలుగువికారులను దీసి వేయగా అయిదఱువదులు మూడు వందలగుచున్నవి. తుదివికారినుండి విలోమముగా (వెనుకకు) లెక్కించినచో సిద్ధార్థినాటికి నలుబది సంవత్సరములగును. కాగా ఇప్పటికి 340 సంవత్సరములనాడు వీరబ్రహ్మముగారు బనగానపల్లెలో నున్నారని చెప్పవీలగుచున్నది. పై ద్విపదలోని "భావసంధి" "వీరవసంతాడి" పదములు గూఢార్థయుక్తములు. వసంతములోకమునకు వికాసకారి గావున మానవ వికాసమునుగూర్చి, తనను వీరవసంతుడని ఆయన చెప్పుకొనుటగాని, శిష్యులట్లనుటగాని జరిగియుండవచ్చును. బ్రహ్మము విష్ణుదేవు నవతారమనియు, ఆయన భార్య గోవిందమ్మ ఆదిలక్ష్మి అనియు కాలజ్ఞానాది గ్రంథములలో నుపవర్ణితము. ఆ యంశములు పైద్విపదలోను సూచితము లైనవి.

గరిమిరెడ్డి అచ్చమ్మగారి యావుల గాచునప్పటి కాయనకు 12 లేక 15 వత్సరముల కెక్కువయుండవు. దీనింబట్టి చూచినచో

నేటికి 355 ఏండ్లనాడు-క్రీ. శ. 1604 ప్రాంతమున బ్రహ్మముగారు జన్మించి యుండవచ్చునని తెలియుచున్నది. 1687 ప్రాంతమున జీవ సమాధియందు ప్రవేశించినారని పూర్వము చెప్పికొంటిమి గాన, 17 వ శతాబ్దియంతయు ఆ మహనీయుని జీవితలీలలతో గడిచినట్లు భావింప వచ్చును.

ఇప్పటి కలియుగాది గతాబ్దసంఖ్య 5060 లో 355 తీసివేయగా కల్యాది 4705 బ్రహ్మముగారి జనన కాలమగుచున్నది. కాలజ్ఞానము లోని వర్ణనమును బట్టి చూచినను పై లెక్క సరిపడుచున్నది. కాల జ్ఞానములోని వర్ణనలు—వాక్యములు పెక్కులు శ్రీ కృష్ణదేవరాయల యనంతరము జరిగిన వృత్తాంతములను సూచించు చున్నవి. కృష్ణరాయల పిమ్మటనే- అందును తల్లికోటయుద్ధమునకు పిమ్మటనే విజయనగర ప్రాంతము మహమ్మదీయాక్రాంత మగుటయు, భారతధర్మము దెబ్బ దినుటయు సంభవించినది గావునను, హిందూమహమ్మదీయ విభేద విద్వేషములు పొడచూపినవి గావునను తత్సంస్కరణమునకే తానవ తరించి కృషిచేయుచున్నట్లు కాలజ్ఞానములో బ్రహ్మను విస్పష్టముగా చేరొక్కనినాడు.

"కలియుగము సుమారు 3180 సం॥ (సరిగా 3172 సం॥) జరుగగా శకపురుషుడగు శాలివాహను డవతరించి ధర్మపరిపాలనము చేసెను. శాలివాహన శక సం॥ 1258 గడవగా అసెగొందియను రాయసింహాసనమునకు హరిహర రాయలు రాజై ధర్మపరిపాలన మొనర్చుచు విజయనగరమను నొక పట్టణమును నిర్మించుకొని యదియే రాజస్థానముగా ప్రజాపరిపాలనము చేసెను. వారి తరువాత వారి సంతతివారు మూడుతరములవారు పాలించిరి.(?)అటు పిదప సాళువ నరసింగరాయలు 13 ఏండ్లేలెను. అతని కుమారుడు వీరనరసింహ రాయలు తమ్ముని రాయలను జంపించి అయిదువత్సరము లేలెను. నరస

రాయని రెండవకుమారుడగు కృష్ణదేవరాయలు 21 వత్సరములు పాలించెను. అచ్యుతరాయలు ఎనిమిది నెలలు రాజ్య మేలెను. సదాశివరాయలను ముందుంచుకొని రామరాజు 22 సం॥ విజయనగర పాలనముచేసెను. అతనితో విజయనగర హిందూసామ్రాజ్య మంతరించెను. (తరువాత తురకల పరిపాలనలోని దుశ్చర్యల వర్ణనమున్నది. అది యిట ప్రస్తావింపనైతిని.) అప్పటికి కలియుగము 4700 సంవత్సరములు గడచెను."

ఇది కాలజ్ఞానములోని భాగము. తిరువాత భూదేవి పాప భారమును మోయలేక విష్ణుమూర్తితో మొఱపెట్టుకొన్నట్లును, ఆమె మొఱ నాలకించి యాతడు బ్రహ్మముగాను, శంకరు డానందభైరవ యోగిగాను, బ్రహ్మదేవుడు అన్నాజయ్యగాను భూలోకమున బుట్టినట్లును కాలజ్ఞానము చెప్పుచున్నది.

ఇంకను బ్రహ్మముగారు బనగానపల్లెలో అన్నాజయ్యకు కాలజ్ఞానము నుపదేశించుచు, విజయనగర రాజులవృత్తాంతమును వినిపించిన పిమ్మట ఇట్లు నుడివిరి:

"రామరాజుతో విజయనగరసామ్రాజ్య మంతరించెను. తరువాత నా రాష్ట్రమునకు మహమ్మదీయులు ప్రభువులై ధర్మముల తిరస్కరింపుచు న్యాయ మెఱుగక రాజ్యపాలనము చేయుచుండిరి. ఇట్లధర్మములు దేశమున పెచ్చు పెరుగుటచేత వాని నణచుటకై నేనిట్టి యవతారమెత్తితిని. నాయనా! నాకీయవతారమందు వీర బ్రహ్మము సాధారణనామధేయము. బాల్యమున వీరంభట్లయ్యయనియు, నిపుడు వీరప్పయ్యయనియు, నిక ముందు వీరబ్రహ్మమనియు నామాంతరములు గలవు. ఈ నామధేయములతో కొందఱికి విజ్ఞానము గఱపి సమాధి నిష్ఠవహింతును" అనియు, మఱియొకచో "...పిమ్మట అనం

తావతార మహిమలకుగాను పదునొకండవ యవతారమెత్తి బనగాన పల్లెలో పంచవింశద్వర్ష ములు తపముచేసి వెనుక కొంతకాలము గృహా స్థాశ్రమమునందుండి యనేక శిష్యకోటికి జ్ఞానోపదేశముచేసి యటు వెనుక సమాధినిష్ఠ వహించును" అని యున్నది.

దీనింబట్టి బ్రహ్మము మహమ్మదీయుల దుశ్చేష్టల వరికట్టి వారికి మతసామరస్యమును బోధించుటకును, హిందూజాతిని సంస్కరించుటకును బూనినట్లు తెలియుచున్నది. ఇంకను పదునొకండవ యవతారమనియును దెలియుచున్నది. ఇందలి అతిలోకములు - దేవతాత్మకములు నగు వర్ణనలను ఎల్లరు విశ్వసింపజాలక పోయినప్పటికిని, చారిత్రకాంశములను గుర్తించి వానికి ప్రాధాన్యమిచ్చి, తత్త్వమును విచారించుటకు వెనుకంజ వేయరని తలంచెదను.

పైనుదాహరించిన కాలజ్ఞానవాక్యములనుబట్టి చూడ బ్రహ్మము గారు బనగానపల్లెలోనుండి తపస్సుచేసినది ఇరువదియైదేండ్లని తెలియుచున్నది. అతడు పండ్రెండవయేటగాని, పదునేడవయేటగాని బనగానపల్లెకు వచ్చినాడనుకొన్న, దాదాపు నలుబది వత్సరముల ప్రాయమున అయనకు వివాహము జరిగినట్లు నిశ్చయింపవచ్చును. బనగాన పల్లెనుండి కందిమల్లయపల్లెకు వచ్చిన పిమ్మటనే అయన కుద్వాహము జరిగెను. వెంటనే ప్రథమసంతానముగా గోవిందయ్య జన్మించినాడు. అయన కుమారికయే ఈశ్వరమ్మ. బ్రహ్మముగారి జననము క్రీ. శ. 1604. అయనకు నలుబదవయేట వివాహము జరిగినదనుకొన్న 1644 పెండ్లికాల మగును. వివాహానంతర మొకటి రెండు సంవత్సరముల లోనే గోవిందయ్యగారు జన్మించినారన్న 1645, 46 గోవిందయ్య జన్మకాలము గాగలదు. అయనకు 30 యేండ్ల ప్రాయమున ఈశ్వరి జనించియుండును. ఆమె పుట్టిన 12 వత్సరములకు బ్రహ్మము సమాధియైనారు కావున 1687, 88 ప్రాంతము బ్రహ్మముగారి సమాధి కాలమగుచున్నది. ఇదియు మనము మొదటచెప్పికొన్న లెక్కకు సరి

పోవుచున్నది. కనుక ఇప్పటికి నాకు దొరకిన ఆధారములనుబట్టి బ్రహ్మముగారు పదునేడవ శతాబ్దమున నున్నారనియు, దాదాపు 1690 తో ఆయన జీవితము ముగియుచున్నదనియు నిర్ణయింపజాలినాడను. బ్రహ్మముగారి మఠములో బ్రహ్మము స్వయముగా వ్రాసిన కాలజ్ఞానమును (మూలము) గూడ నేనై చూచుటకు ప్రయత్నించుచున్నాను. ఆ పరిశీలనమైన పిమ్మట ఇంతకంటెను సునిశితముగా కాల నిర్ణయమును జేయు నవకాశములు చిక్కిన, లోకమునకు నివేదించుకొందును.

మొత్తముమీద బ్రహ్మముగారి యుగము మాత్రము ఆంధ్ర దేశ చరిత్రలోనే గాక, భారతదేశచరిత్రలోగూడ ఒక ప్రత్యేకత గలదని నా యభిప్రాయము. కారణమేమన, భారతదేశములోని వివిధ ప్రాంతములలో పలువురు మహాపురుషులుదయించి భారతీయ సంస్కృతి నుద్ధరించుటకు కృషిచేసిన కాలమది. ఈ 17 వ, శతాబ్ది మధ్యభాగమునసే, మహారాష్ట్రములో శివాజీ చక్రవర్తి మహమ్మదీయుల దాడుల నరికట్టబూనినాడు. ఆయునకు గురుమూర్తులై సమర్థ రామదాసస్వామి—తుకా బ్రహ్మానందస్వాములు అధ్యాత్మవిద్యా ప్రచారము చేసినారు. ఆశతాబ్దపు టుత్తరభాగమునసే కంచర్ల గోపన్న రామదాసుడై భక్తితత్త్వమును విస్తరింపజేసినాడు. అటు కన్నడదేశములోను పెక్కురు శైవసిద్ధులుదయించి తత్త్వప్రచారము నొనర్చియున్నారు. ఈవిధముగా యావద్భారతదేశము ఆనాడు ఆధ్యాత్మిక తత్త్వపరిమళములతో గుబాళించిపోయినట్లు చరిత్ర చక్షువులకు గోచరించుచున్నది.

1952 నం॥ డిసంబరు

"భారతి" నుండి పునర్ముద్రితము.

భారతీప్రెస్, కొనాలి.

152



కీ॥ శే॥ పచ్చిపాల ఆదెపరెడ్డిగారు,
కోచ్చూరు.

153






శ్రీ యోటూరు అదెమ్మగారు

నోపూరు (నెల్లూరు జిల్లా)

IJ4



కీ॥ శే॥ మ ది రి ఆ డె య్య్ గా రు

వీరబ్రహ్మేశ్వరమునిర్మాత

నాన్ రెడ్డిపేట, (నెల్లూరు జిల్లా)

155



శ్రీ పదాల వెంకటసుబ్బయ్యగారు - ధర్మపత్ని సీతమ్మగారు,
గోపూరు.

156

157

RGHB02R103

గ్రంథకర్త యితర కృతులు

1. అమరావతి (పద్యకావ్యము)	1-25
2. తోరణము (ఖండకావ్యము)	0-75
3. ఆత్మదర్శనము (వేదాన్తము)	2-50
4. శిల్పదర్శనము (శిల్పము)	2-50
5. కళారాధన (జక్కణాచార్య చరిత్ర)	2-50
6. శిల్పకళాక్షేత్రాలు	3-25
7. సిద్ధప్పచరిత్ర	2-00
8. మూడుకావ్యాలు (సమీక్ష)	2-00
9. నిరంజన విజయము	0-50
10. ఆసియా జ్యోతులు	1-00
11. శ్రీ వీరబ్రహ్మసుప్రభాతమ్	0-60
12. శ్రీవిశ్వకర్మాష్టకమ్	0-15

ప్రతులకు:
ఆంధ్ర శిల్పకళా పరిషత్తు, తెనాలి.

158

	మవసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	RFHB02R103
పుస్తకం పేరు	మనసు గురుదేవులు
తారీఖు	13-3-24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	169
పెద్ద సైజు పేజీలు	NO
ఖాకీ పేజీలు	ci,x,157
లేవి పేజీలు	85,86
తయారు చేసినది	Rohith
పేజీలు విడదీసినది	Rohith
స్కాన్ చేసినది	pragathi
పరీక్ష చేసినది	lakshmi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యవివి	
తప్పులు	NO
పరిస్థితి	good